శుక్రవారం 26-1-2024

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 305




'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'




SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గణతంత్రం
2024

## దేశభక్తి, జాతీయపతాకం...

2011లో హైదరాబాద్ మొదలు, 2016 ఏలూరులో కూడా

అతి భారీ జాతీయ పతాకము సామాన్యునిచే ఎగరవేసే ఒరవడిని కొనసాగిస్తూ...

ఈ గణతంత్ర దినోత్సవమున మన

డా॥ కావూరు సాంబశివరావు గారు, మాజీ కేంద్ర క్యాబినెట్ మంత్రివర్యులు

ఈ భారీ జెండా, ఉన్న భూమి మరియు 10కోట్ల రూపాయల నిధిని

ఆర్.ఎస్.ఎస్. చే నిర్వహించబడే సంస్థకు సమర్పిస్తున్నారు.

## రండి ప్రజా రాజ్యాంగ పండుగ చేసుకుందాము



ఉదయం 10.00 గంటలకు
26 జనవరి 2024
**సాంబశివ స్థలము**
NH-5, భోగాపురం, ఏలూరు.

ఇట్లు
మీ
**భాస్కర్ కావూరు**
9440122555

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



## వెంకయ్యనాయుడు, చిరంజీవి

# 'విభూషణులు'



### తెలుగు తేజాలను వరించిన రెండో అత్యున్నత పౌర పురస్కారం

### బిందేశ్వర్ పాఠక్, పద్మా సుబ్రమణ్యం, వైజయంతీమాలకు కూడా..

- నటులు విజయ్‌కాంత్, మిథున్, గాయని ఉషా ఉతుప్‌లకు పద్మభూషణ్
- మొత్తంగా 17 మందికి మూడో అత్యున్నత పురస్కారం
- మరో 110 మందికి పద్మశ్రీ పురస్కారాలు.. ఇందులో తెలంగాణ నుంచి ఐదుగురు, ఏపీ నుంచి ఒకరు..
- జాబితాలో సోమ్‌లాల్, ఆనందచారి, కొండప్ప, సమ్మయ్య, విఠలాచార్య, ఉమా మహేశ్వరి
- వివిధ రంగాలకు సంబంధించి మొత్తం 132 మందికి పురస్కారాలు
- అవార్డులకు ఎంపికైన వారికి సీఎంలు వైఎస్ జగన్, రేవంత్ రెడ్డి అభినందనలు

**సాక్షి, న్యూఢిల్లీ/ సాక్షి నెట్‌వర్క్:** తెలుగు ప్రముఖులను దేశ అత్యున్నత పౌర పురస్కారాలు వరించాయి. ప్రముఖ సినీ నటుడు కొణిదెల చిరంజీవి, మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకు దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ విభూషణ్‌కు ఎంపిక చేసినట్టు కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా 2024 సంవత్సరానికిగాను మొత్తం 132 పద్మ పురస్కారాలను ప్రకటించారు. వీటిలో ఐదు పద్మ విభూషణ్, 17 పద్మభూషణ్, మిగతా 110 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. ప్రఖ్యాత భరతనాట్య కళాకారిణి పద్మా సుబ్రమణ్యం, సామాజికవేత్త, సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాఠక్, అలనాటి బాలీవుడ్ నటి వైజయంతిమాల బాలిని కూడా పద్మ విభూషణ్ వరించింది. పద్మభూషణ్ ప్రకటించిన వారిలో సుప్రీంకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి ఫాతిమా బీవీ, సినీనటుడు విజయ్‌కాంత్, ప్రముఖ బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి, నేపథ్య గాయని ఉషా ఉతుప్, ప్రముఖ బాలీవుడ్ సంగీత దర్శకుడు ప్యారేలాల్ శర్మ తదితరులున్నారు. వీరిలో ఫాతిమా, పాఠక్, విజయ్‌కాంత్ సహా 9 మందికి మరణానంతరం పురస్కారాలు దక్కాయి.

**తెలంగాణ, ఏపీల నుంచి ఆరుగురికి..**

తెలంగాణ నుంచి ఐదుగురికి, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒకరికి పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. వీరిలో తెలంగాణ నుంచి బుర్రవీణ వాయిద్యకారుడు దాసరి కొండప్ప, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య, కూరెళ్ల

మిగతా 2వ పేజీలో ▶

'పద్మశ్రీ' గ్రహీతలు



దాసరి కొండప్ప



ఆనందచారి



గడ్డం సమ్మయ్య



కూరెళ్ల విఠలాచార్య



కేతావత్ సోమ్‌లాల్





ఉమా మహేశ్వరి (ఏపీ)

## జ్ఞానవాపి అడుగున భారీ ఆలయం ఆనవాళ్లు

- దేవనాగరి, తెలుగు, కన్నడ భాషల్లో శాసనాలు
- ఏఎస్ఐ సర్వే నివేదికలో వెల్లడి
- పేర్కొన్న హిందూ పక్షం లాయర్ విష్ణుశంకర్ జైన్

6లో






ఫొటో అద్భుతంగా ఉంది కదూ.. కెనడాకు చెందిన ఫొటోగ్రాఫర్ పాల్ జిజ్కా అక్కడి జాస్పర్ నేషనల్ పార్కులో దీన్ని తీశారు. ఇటు మంచు గుహల్లో ట్రెక్కింగ్ చేస్తున్న సాహసికులు.. అటు మైమరిపించే ఉత్తర ధ్రువ కాంతులు.. రెండింటినీ కలిపి తీయడంతో ఈ సూపర్ ఎఫెక్ట్ వచ్చింది.

# ఎమ్మెస్.. టైమ్ పాస్!

**ఉద్యోగాలు దొరక్క విదేశీ చదువులపై బీటెక్ గ్రాడ్యుయేట్ల చూపు**

- ఐటీ సెక్టార్‌పై ఆర్థిక మాంద్యం ప్రభావం..
- కొన్ని కంపెనీలు ఆఫర్ లెటర్లు ఇచ్చినా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వని వైనం
- ఖాళీగా ఉండటం ఇష్టం లేక విదేశాల్లో ఎమ్మెస్‌పై దృష్టి.. అప్పోసొప్పో చేసి అమెరికా లాంటి దేశాలకు పయనం
- చదువుకుంటూ పార్ట్ టైమ్ జాబ్ చేసుకోవచ్చనే ఆలోచన

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక మాంద్యం ఐటీ రంగాన్ని కుదిపివేస్తున్న నేపథ్యంలో భారతీయ విద్యార్థులు విదేశీ చదువులపై దృష్టి పెట్టారు. సాఫ్ట్‌వేర్ రంగం గాడిన పడే వరకూ ఎంఎస్ చేయడమే మేలని భావిస్తున్నారు. ఈ కారణంగా ఈ ఏడాది విదేశీ విద్యకు వెళ్ళే వాళ్ళ సంఖ్య పెరిగింది. కరోనా నేపథ్యంలో 2021 విద్యా సంవత్సరంలో 4.44 లక్షల మంది విదేశీ విద్యకు వెళ్తే, 2022లో ఈ సంఖ్య ఏకంగా 6.84 లక్షలకు పెరిగింది. 2023 చివరి నాటికి ఈ సంఖ్య మరో 10 వేల వరకు పెరిగిందని అంచనా. అమెరికా వంటి దేశాల్లో ఐటీ సెక్టార్ తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోందని తెలిసినా.. ఈ ఒక్క దేశానికే 2023లో 2.80 లక్షల మంది భారతీయులు విద్య కోసం వెళ్ళారు. మరోవైపు కెనడా వీసా ఆంక్షలకు నిబంధనలు పెట్టే ఆలోచనలో ఉన్నట్టు వార్తలొస్తున్నా, చదువు కోసం వెళ్ళేందుకే విద్యార్థులు ఇష్టపడుతున్నారు.




## ఎందుకీ పరిస్థితి..?

దేశవ్యాప్తంగా ప్రతి ఏటా 12 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు మార్కెట్లోకి వస్తున్నారు. వీరిలో కేవలం 8 శాతం మందికి మాత్రమే నైపుణ్యం ఉన్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నారు. బహుళజాతి కంపెనీల్లో మంచి వేతనంతో ఉద్యోగాలు పొందుతున్నది వీళ్ళే. మిగతా వాళ్ళు వచ్చిన ఉద్యోగంతో సంతృప్తి పడుతున్నారు. సివిల్ ఇంజనీరింగ్ చేసిన వాళ్ళు కూడా ఏదో ఒక సాఫ్ట్‌వేర్ కోర్సు నేర్చుకుని సంబంధం లేని ఉద్యోగానికి వెళ్తున్నారు. ఇంతకాలం వీళ్ళ అవసరం ఉండేది. అవసరమైన శిక్షణ ఇచ్చి కంపెనీలు వారి సేవలను వినియోగించుకునేవి. కానీ ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. అమెరికాలో వచ్చిన ఆర్థిక సంక్షోభం ప్రభావం భారత్ ఐటీ రంగంపైనా ప్రభావం చూపించింది. ప్రధాన కంపెనీలన్నీ వరుసగా లే ఆఫ్‌లు ప్రకటించడంతో ఐటీ విభాగం కుదేలైంది. క్యాంపస్ నియామకాలు తగ్గాయి. కొన్ని కంపెనీలు ఆఫర్ లెటర్లు ఇచ్చినా ఉద్యోగాలు మాత్రం ఇవ్వలేదు. దీంతో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు ఆఫ్ క్యాంపస్ ఉద్యోగాలు వెతుక్కోవాల్సి వస్తోంది. పోటీ తీవ్రంగా ఉండటంతో ఫ్రెషర్స్ పోటీని తట్టుకుని నిలబడటం కష్టంగా ఉంది. ఈ కారణంగానే విదేశాల్లో విద్యాభ్యాసానికి వెళుతున్నారు.

## సమయం వృథా ఎందుకుని..

చాలా కంపెనీలు ఏడాది క్రితం ఫ్రెష్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్‌కు ఆఫర్ లెటర్స్ ఇచ్చాయి. కానీ చాలా సంస్థలు ఇంత వరకూ నియామక ఉత్తర్వులు ఇవ్వలేదు. నాస్కామ్ తాజాగా జరిపిన ఓ సర్వేలో ఇలాంటి వాళ్ళు భారత్‌లో 2.5 లక్షలు ఉంటారని తేలింది. మన రాష్ట్రంలోనే 24 వేల మందికి పైగా ఉన్నట్టు స్పష్టమైంది. మరోవైపు అమెరికా ప్రాజెక్టులు తగ్గుతున్నా యని కంపెనీలు చెబుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో నియామక ఉత్తర్వులు వస్తాయన్న భరోసా లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉండటం దేనికి? అని యువత భావిస్తోంది. ఒకవేళ ఖాళీగా ఉంటే ఆ తర్వాత జాబ్‌లోకి తీసుకోవడానికి కంపెనీలు అంతగా ఆసక్తి చూపవు. దీన్ని దృష్టిలో ఉంచుకునే పరిస్థితి చక్కబడే వరకూ ఎమ్మెస్ లాంటిది చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

## లభించని బ్యాంకు రుణాలు

విదేశీ విద్యకు గతంలో తేలికగా రుణాలు లభించేవి. కానీ గత ఏడాది కాలంగా బ్యాంకులు పెద్దగా ఆసక్తి చూపడం లేదనిన విద్యార్థులు అంటున్నారు. బ్యాంకు రుణాల విధానాన్ని సవరించడమే దీనికి కారణమని బ్యాంకర్లు అంటున్నారు. ఈ నేపథ్యంలో విదేశాలకు వెళ్ళేందుకు అవసరమైన సెక్యూరిటీ మొత్తం, అక్కడి ఖర్చుల కోసం ఒక్కో విద్యార్థి కనీసం రూ.40 లక్షల వరకూ అప్పు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని విదేశాల్లో చదివేటప్పుడు తీర్చేద్దామన్న ధీమాతో వెళ్తున్నారు. విదేశాల్లో ఏదైనా పార్ట్‌టైం జాబ్ చేయొచ్చనేది వారి ఆలోచన. కానీ గతేడాది డిసెంబర్‌లో వెళ్ళిన విద్యార్థులకు అమెరికాలో చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. పార్ట్ టైం ఉద్యోగాలు దొరకడం కూడా కష్టంగా ఉందని అక్కడి విద్యార్థులు చెబుతుండటం గమనార్హం.

### ఐటీ కోలుకోవడంపైనే ఆశలు

బీటెక్ పూర్తయ్యాక ఇండియాలో ఏడాది పాటు ఉద్యోగం కోసం విఫల ప్రయత్నం చేశా. చివరకు అమెరికా వెళ్ళి ఎమ్మెస్ చేయాలని నిర్ణయించుకున్నా. ఇంట్లో అర ఎకరం పొలం అమ్మి డబ్బులిచ్చారు. నేను కొంత అప్పు చేశా. డిసెంబర్‌లో అమెరికా వచ్చా. ఇక్కడ పార్ట్ టైం జాబ్ కష్టమని కన్సల్టెన్సీలు చెబుతున్నాయి. మళ్ళీ అప్పు చేయమని తల్లిదండ్రులకు చెప్పడం ఇబ్బందిగానే ఉంది. ఐటీ కోలుకుంటే పరిస్థితి మారుతుందనే నమ్మకం ఉంది.

-శశాంక్ (అమెరికా వెళ్ళిన వరంగల్ విద్యార్థి)

### ఏడాది క్రితం ఆఫర్ లెటర్ ఇచ్చారు

బీటెక్ అవ్వగానే ఆఫ్ క్యాంపస్‌లో ఓ కంపెనీ ఉద్యోగం ఆఫర్ చేసింది. ఉద్యోగం వచ్చిందని నేను, మా వాళ్ళూ బంధువులందరికీ చెప్పుకున్నాం. ఆ లెటర్ పట్టుకుని ఏడాది నిరీక్షించా. ఎంతకీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ రాలేదు. ఇప్పుడు చిన్నతనంగా ఉంది. అందుకే అప్పు చేసి మరీ అమెరికా వెళ్ళేందుకు సిద్ధమవుతున్నా. ఎమ్మెస్ అయిపోయే లోగా పరిస్థితి మారుతుందనే ఆశ ఉంది.

- పి. నీలేశ్ కుమార్ (యూఎస్ వెళ్ళేందుకు సిద్ధమైన హైదరాబాద్ విద్యార్థి)

# మణుగూరును పంచాయతీగానే ఉంచాలి

- పిటిషన్‌పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: కొత్త మున్సిపాలిటీల జాబితాలో మణుగూరును చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ, పంచాయతీగానే ఉంచి ఎన్నికలు జరపాలంటూ దాఖలైన పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ అభ్యంతరాలపై స్పందించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రధాన కార్యదర్శి, కమిషనర్, డైరెక్టర్, పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, మణుగూరు మున్సిపాలిటీ కమిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేస్తూ, ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. మున్సిపాలిటీల జాబితాలో షెడ్యూల్డ్ తెగల ప్రాంతమైన మణుగూరును రాష్ట్ర ప్రభుత్వం చేర్చడాన్ని సవాల్ చేస్తూ కోడి నాగరాజు, మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. మణుగూరును మున్సిపాలిటీగా ప్రకటించడం మంచిదే కదా.. పంచాయతీతో పోలిస్తే ఎక్కువ నిధులు రావడమే కాకుండా పరిపాలన కూడా మెరుగవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం 2019లో మణుగూరును గ్రామ పంచాయతీగానే పేర్కొన్నారని, ఆ మేరకు ఎన్నికలు జరిపేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

# నేడు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ భేటీ

**కేసీఆర్ అధ్యక్షతన నిర్వహణ**

- శస్త్ర చికిత్స తర్వాత తొలిసారిగా పార్టీ కార్యక్రమం





సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ఈ నెల 26న పార్లమెంటరీ పార్టీ సమావేశం జరగనుంది. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం మధ్యాహ్నం 12.30కు జరిగే ఈ భేటీలో వచ్చే పార్లమెంటు సమావేశాల్లో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించి దిశా నిర్దేశం చేస్తారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా హాజరవుతారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత గతేడాది డిసెంబర్ 7న తుంటి ఎముక చికిత్స కోసం ఆసుపత్రిలో చేరిన కేసీఆర్ సుమారు నెలన్నర తర్వాత తొలిసారిగా పార్టీ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. శస్త్ర చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జయిన ఆయన కొంతకాలం హైదరాబాద్ నందినగర్ నివాసంలో విశ్రాంతి తీసుకుని, ఇటీవలే ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. ఈ నెల 3 నుంచి 22 వరకు బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొంతకాలంగా లోక్‌సభ నియోజకవర్గాల వారీగా అందిన నివేదికలను విశ్లేషిస్తున్న కేసీఆర్ అందులోని అంశాలపై పార్టీ నేతలు, కేడర్‌తో నేరుగా సంభాషిస్తున్నారు. పార్టీ పేరు మార్పు అంశం సహా కేడర్ నుంచి అందిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా పార్టీ భవిష్యత్ కార్యాచరణకు కేసీఆర్ పదును పెడుతున్నారు. కాగా ఈ నెల 27న బీఆర్ఎస్ మైనారిటీ విభాగం సమావేశం తెలంగాణ భవన్‌లో జరుగుతుంది.

**రేపటి నుంచి బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాలు: కేటీఆర్**

బీఆర్ఎస్ అసెంబ్లీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాలను ఈనెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితా ల వెల్లడి తర్వాత ఇప్పటికే పార్లమెంటు నియోజ కవర్గాల వారీగా పార్టీ ఎన్నికల సన్నాహక సమావే శాలను పూర్తి చేయడాన్ని గుర్తు చేశారు. అదే తరహాలో ఈ నెల 27 నుంచి అసెంబ్లీ నియోజక వర్గాలవారీగా పార్టీ సమావేశాలను నిర్వహిస్తామని ప్రకటించారు. 17 పార్లమెంట్ స్థానాల సమావేశా లు తెలంగాణ భవన్‌లో జరగ్గా, నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాలను ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 10లోగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తి చేస్తామన్నారు.

**27న సమావేశాలు ఎక్కడెక్కడంటే..**

సమావేశాల్లో భాగంగా తొలిరోజు ఈ నెల 27న సిద్దిపేట, బోథ్, జూబ్లీహిల్స్, వనపర్తి, నల్గొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు జరుగుతాయి. 28న వర్ధన్నపేట, మెదక్, సిరిసిల్ల, ముషీరాబాద్, పాలకుర్తి నియోజకవర్గాలు, 29న ఆలేరు, నర్సంపేట, ఖైరతాబాద్, జుక్కల్, ఆందోల్, వికారాబాద్, జగిత్యాల నియోజకవర్గాల్లో సమావేశాలు జరుగుతాయి. మిగతా నియోజకవర్గాలకు సంబంధించి ఒకటి రెండు రోజుల్లో పూర్తి షెడ్యూలును ప్రకటిస్తారు.




# సాక్షి

సత్యమేవ జయతే

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 305

శుక్రవారం 26-1-2024

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి
గణతంత్ర దినోత్సవ
శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




### బీజేపీ వైపు... నితీశ్ చూపు!

కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమికి జేడీ(యూ) చీఫ్, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ కటీఫ్ చెప్పేలా కనిపిస్తున్నారు.

- వివరాలు 6లో



### రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు

తెలంగాణ అదనపు డీజీపీలు దేవేంద్ర సింగ్ చౌహాన్, సౌమ్యా మిశ్రాలకు ప్రతిష్టాత్మక రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకాలు లభించాయి.

- వివరాలు 7లో



కోదండరాం ఆమేర్ అలీఖాన్

# ఎమ్మెల్సీగా కోదండరాం

**ప్రభుత్వ ప్రతిపాదనకు గవర్నర్ ఆమోదం**

**గవర్నర్ కోటా మరో సభ్యుడిగా మీర్ ఆమేర్ అలీఖాన్**

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం రాష్ట్ర శాసన మండలి సభ్యునిగా నియమితులయ్యారు. ఆయనతో పాటు సియాసత్ ఉర్దూ దిన పత్రిక అసిస్టెంట్ ఎడిటర్ మీర్ ఆమేర్ అలీఖాన్‌ను కూడా సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించారు. గవర్నర్ కార్యాలయం గురువారం ఈ మేరకు ప్రకటన చేసింది. ప్రొఫెసర్ కోదండరాంను విద్యావేత్తల కోటాలో, ఆమేర్ అలీఖాన్‌ను జర్నలిస్టుల కోటాలో మండలి సభ్యులుగా ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶

# మోదీ ఓటమే లక్ష్యం

## కాంగ్రెస్ బూత్ లెవల్ నేతల సమావేశంలో మల్లికార్జున ఖర్గే

- మోదీ ఒక్క గ్యారంటీ కూడా అమలు చేయలేదు
- భగవంతుని పేరిట పబ్బం గడుపుకోవాలని ప్రధాని చూస్తున్నారు
- ఎన్నికలకు ముందు ఏదో ఒక అంశంతో లబ్ధి పొందడం ఆయనకు అలవాటే
- తెలంగాణలో కాంగ్రెస్ చాలా పటిష్టంగా ఉందన్న ఏఐసీసీ అధ్యక్షుడు
- విధ్వంసం చేసిన రాష్ట్రాన్ని పునర్నిర్మించే మేస్త్రీని నేను: రేవంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున ఖర్గే. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: పదేళ్లుగా దేశ ప్రజలను మోసం చేస్తూ, ఏదో ఒక అంశాన్ని తీసుకొని ఎన్నికలకు వెళ్లి లబ్ధి పొందే ప్రధాని మోదీని గద్దె దించడమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేయాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తుంటే, మోదీ ఎన్నికల ముందు తన గ్యారంటీ పేరిట ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. మోదీ ప్రధాని అయ్యాక దేశంలో ప్రజాస్వామ్యం సర్వనాశనం అయిందని, పార్లమెంటులో ప్రశ్నించిన 140 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని ధ్వజమెత్తారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో తెలంగాణ కాంగ్రెస్ బూత్ స్థాయి నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఖర్గే ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.

**దేశంలోని ప్రతి ఇంట్లో దేవుడు ఉన్నాడు**

'దేశంలో యువశక్తి నిరుద్యోగంతో సతమతమవుతోంది. రైతులు కనీస మద్దతు లేక ఆత్మహత్యలు

మిగతా 2వ పేజీలో ▶

**మోదీ, అమిత్ షాలతో అప్రమత్తంగా ఉండాలి**

'ఎక్కడ బలహీనంగా ఉంటే అక్కడి ప్రభుత్వాలను మోదీ, అమిత్ షాలు పడగొడతారు. కానీ తెలంగాణలో గతంలో ఉన్న కాంగ్రెస్ లేదు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో చాలా పటిష్టమైన కాంగ్రెస్ ఉంది. ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ రెండింటినీ కాంగ్రెస్ ఓడించింది. దీన్నిబట్టి ఇక్కడ కాంగ్రెస్ ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవాలి. తెలంగాణలో వచ్చిన ఫలితాలే లోక్‌సభ ఎన్నికల్లోనూ రావాలి. తెలంగాణలో ప్రభుత్వ, రేవంత్ రెడ్డి పనితీరు ఆదర్శంగా ఉంది. అయితే బీజేపీ భయపెట్టే ప్రయత్నం చేస్తోంది. కానీ బీజేపీకి తెలంగాణలో ఎవరూ భయపడరు. మోదీ, షాలు ఈడీ, సీబీఐ, ఐటీలను ప్రయోగించే ప్రమాదం ఉంది. రేవంత్‌తో పాటు కాంగ్రెస్ నేతలంతా చాలా అప్రమత్తంగా ఉండాలి..'అని ఖర్గే అన్నారు.



## టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి

- మరో ఐదుగురు సభ్యుల నియామకం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు గవర్నర్ ఆమోదం
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి

5 లో

## ఎంసెట్.. ఇకపై టీఎస్ఈఏపీ సెట్

- పేరు మార్చిన ఉన్నత విద్యామండలి
- మే 9 నుంచి 11 వరకు నిర్వహణ
- మే 6న ఈసెట్..అదే నెల 23న ఎడ్‌సెట్
- జూన్ 4న ఐసెట్.. మొత్తం 8 సెట్‌ల షెడ్యూల్ విడుదల

3 లో

# మోదీ ఓటమే లక్ష్యం


ఎల్బీ స్టేడియంలో జరిగిన సమావేశానికి హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు

▶ మొదటి పేజీ తరువాయి

చేసుకుంటున్నారు. కార్మికులు, మహిళలు, అణగారిన వర్గాల ప్రజలు తీవ్ర కష్టాలను అనుభవిస్తోంటే.. మోదీ భగవంతుని పేరిట పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. యువతకు పని దొరికితే, ఉద్యోగాలు ఉంటే ఉపయోగం తప్ప భగవంతుని ఫొటోతో కడుపు నిండుతుందా? దేశంలోని ప్రతి ఇంట్లో దేవుడు ఉన్నాడు. కానీ మోదీ దేవుడు తమ దగ్గరే ఉన్నట్టు ప్రచారం చేసుకుంటారు. ఆకలి అయినవాడికి అన్నం పెట్టాలి.. ఉపాధి లేని వారికి ఉద్యోగం ఇవ్వాలి..కానీ మోదీ ఎన్నికల రాజకీయాలు, ప్రచారంతోనే కాలం గడుపుతున్నారు. ప్రజల సొమ్ముతో ఆయన ప్రచారం చేసుకుంటున్నారు. మొన్న అయోధ్యలో మోదీ ఒక్కరే గర్భగుడిలో పూజలు చేశారు. చివరకు అద్వానీ, మనోహర్ జోషిలను కూడా రానివ్వలేదు. ఎన్నికలకు ముందు ఏదైనా సమస్యను సృష్టించి ఆ అంశాన్ని వాడుకొని లబ్ధి పొందడం మోదీకి అలవాటే. పాకిస్తాన్, చైనా, భగవంతుడు..ఇలా ఏదో ఒక అంశాన్ని తెరపైకి తెస్తారు..'అని ఖర్గే విమర్శించారు.

**బట్టలు విప్పి చూపించేందుకు సిద్ధం: మంత్రి పొన్నం**

కరీంనగర్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎమ్మెల్యేలుగా గెలిస్తే ఓర్వలేకనే మాజీ మంత్రి కేటీఆర్ బట్టలు ఊడదీస్తానని అంటున్నాడని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బట్టలు విప్పడం ఎందుకు, ఆయనకు చూడాలనిపిస్తే తనతో పాటు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం బట్టలు ఇప్పి చూపించేందుకు సిద్ధమని అన్నారు. కల్వకుంట్ల కుటుంబం దోచుకొని, దాచుకున్న సొమ్ము కక్కాల్సిందేనని మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ అన్నారు. అధికారుల దగ్గరే అన్ని కోట్ల రూపాయలు దొరికితే, వారిపై పెత్తనం చేసిన కల్వకుంట్ల ఫ్యామిలీ ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తే మరెన్ని వేల కోట్లు బయటపడతాయో అని వ్యాఖ్యానించారు.

## ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలి: దీపాదాస్ మున్షీ



రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా బూత్ లెవల్ నాయకులు పని చేయాలని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పిలుపునిచ్చారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటైన విధంగా ఢిల్లీలో కూడా కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బూత్ స్థాయిలో అధిక ఓట్లు తీసుకొచ్చిన ఏజెంట్లకు ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

## మనకు మోదీతోనే యుద్ధం: రేవంత్‌రెడ్డి



తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్లలో 14 గెలిచి, రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. మనకు మోదీతోనే యుద్ధం అని, గల్లీలో ఉన్న బిల్లా, రంగాలతో కాదని ఎద్దేవా చేశారు. జనాలు బీఆర్‌ఎస్‌ను ఊరికే ఓడగొట్టలేదని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు కాబట్టే ఇంటికి పంపారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డ వంద రోజుల లోపు ఇచ్చిన హామీలుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఫిబ్రవరిలో మరో రెండు గ్యారంటీలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు రైతుభరోసా ద్వారా నగదు బదిలీ జరుగుతుందని చెప్పారు. 'నన్ను మేస్త్రీ అని ట్రోల్ చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి నిజంగానే మేస్త్రీనే.. మీరు విధ్వంసం చేసిన రాష్ట్రాన్ని సరిచేసే మేస్త్రీని నేను. మీకు 100 మీటర్ల లోతులో ఘోరీ కట్టే మేస్త్రీని..'అన్నారు.

**పులిని రమ్మనండి.. బోను రెడీ**

ఈ నెలాఖరులో ఇంద్రవెల్లి నుంచి తన లోక్‌సభ ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తానని రేవంత్‌రెడ్డి చెప్పారు. వారంలో మూడు రోజులు కాంగ్రెస్ పార్టీ పటిష్టానికి జిల్లాల్లో పర్యటిస్తానని తెలిపారు. 'లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి బిల్లా, రంగాలను తెలంగాణ సరిహద్దులను దాటిస్తాం. వాళ్లు ఎక్కువ తక్కువ మాట్లాడుతున్నారు. చార్లెస్ శోభరాజ్ ఇంట్లో దుప్పటి పట్టుకుని పడుకున్నాడు. పులి బయటికి వస్తుంది అంటున్నారు కదా.. రమ్మని చెప్పండి. బోను పట్టుకుని రెడీగా ఉన్నాం'అని వ్యాఖ్యానించారు. మోదీ, కేడీ రెండూ ఒక్కటేనని, నాణేనికి మోదీ ఒకవైపు, కేసీఆర్ మరోవైపు అని ధ్వజమెత్తారు.

## చేతగానితనంగా భావిస్తే తడాఖా చూపిస్తాం

**ఉప ముఖ్యమంత్రి భట్టి**



రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలను ప్రజాస్వామ్యయుతంగా గౌరవించాలనే ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్లడాన్ని చేతగానితనంగా భావిస్తే తడాఖా చూపిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హెచ్చరించారు. ప్రజాతీర్పును జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్ నేతలు నోటికి వచ్చినట్టు అవాకులు, చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. బట్టలు ఊడదీసి కొడతామంటే ఎవరూ చేతులు ముడుచుకొని లేరని, కాంగ్రెస్ కార్యకర్తలు కన్నెర్ర చేస్తే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మిగలదని అన్నారు.

## పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



సాక్షి, హైదరాబాద్: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జులు పనిచేయాలని కరీంనగర్ ఇన్‌చార్జ్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని పేర్కొన్నారు. గాంధీభవన్‌లో గురువారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, పార్టీ ఇన్‌చార్జులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా పరిధిలోకి వచ్చే కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలలో గెలుపు కోసం ఏం చేయాలనే అంశంపై చర్చించారు. శాసనసభా నియోజకవర్గాలలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కలసి పనిచేద్దామని ఉత్తమ్ అన్నారు. సచివాలయంలో ప్రతిరోజూ అందుబాటులో ఉంటానని, నియోజకవర్గ సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. కాగా, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఉనికి కష్టమేనని వ్యాఖ్యానించారు. కేటీఆర్ ఇంకా భ్రమల్లోనే బతుకుతున్నారని, ఆయన వాస్తవంలోకి వస్తే మంచిదని అన్నారు. కాంగ్రెస్‌కు రాష్ట్రంలో 13 ఎంపీ సీట్లు వస్తాయని ఉత్తమ్ పేర్కొన్నారు. మేడిగడ్డ పై విజిలెన్స్ నివేదిక అసెంబ్లీ సమావేశాల నాటికి రానున్నట్లు చెప్పారు. ప్రాథమిక విచారణ నివేదిక తనకు ఇంకా అందలేదని, అసెంబ్లీ తేదీలు కూడా త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు.

## అహంకారంతో ఇష్టానుసారం వ్యాఖ్యలు

- మాది గడీలపాలన కాదు.. ప్రజాపాలన
- కేటీఆర్‌పై మంత్రి సీతక్క మండిపాటు


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: అధికారం కోల్పోయి కూడా కేటీఆర్ అహంకారంతో బుద్ధిలేకుండా మాట్లాడుతున్నారని, తమ ప్రభుత్వంపై లేనిపోని వ్యాఖ్యలు చేస్తున్నారని పంచాయతీరాజ్, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్నను గురువారం దర్శించుకున్న అనంతరం మంత్రి సీతక్క విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదేళ్ల గడీల పాలన నుంచి విముక్తి పొందేందుకు రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని స్పష్టం చేశారు. కేసీఆర్ ఎమ్మెల్యేగా గెలిచి కూడా ఇంకా ప్రమాణస్వీకారం చేయడం లేదని, అధికారం ఉంటేనే ప్రజల్లోకి వచ్చే ఆలోచనలో తండ్రీకొడుకులు ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష హోదాలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటిస్తే.. ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు పెట్టింది గత ప్రభుత్వం కాదా?.. అని సీతక్క ప్రశ్నించారు. ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసి తమకిష్టమైన పనులు చేసుకుంటూ రాష్ట్రాన్ని దివాళా తీయించారని మండిపడ్డారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రతి నెల 5వ తేదీలోగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాలు అందేలా చూస్తున్నట్లు తెలిపారు.

# ఎమ్మెల్సీగా కోదండరాం

▶ మొదటి పేజీ తరువాయి

సిఫారసు చేసింది. గత ప్రభుత్వం దాసోజు శ్రావణ్, కుర్రా సత్యనారాయణలను గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా సిఫారసు చేయగా..వారి రాజకీయ నేపథ్యం కారణంగా ఆ ప్రతిపాదనను తమిళిసై తిరస్కరించిన విషయం విదితమే. ప్రస్తుతం వీరి స్థానంలోనే కోదండరాం, మీర్ ఆమేర్ అలీ ఖాన్‌ను నియమించారు.

**జర్నలిజంలో విశేష కృషి**

జర్నలిజంలో విశేష సేవలందించిన ఆమేర్ అలీ ఖాన్ (సియాసత్ ఉర్దూ దినపత్రిక రెసిడెంట్ ఎడిటర్ జాహెద్ అలీఖాన్ కుమారుడు) ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీసీఏ, తరు వాత సుల్తాన్-ఉల్-ఉలూమ్ కాలేజీ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఎంబీఏ చేశారు. ప్రస్తుతం సియాసత్‌లో న్యూస్ ఎడిటర్‌గా ఉన్న ఆయన..పత్రిక కర్ణాటక రాష్ట్రానికి విస్తరించేందుకు విశేష కృషి చేశారు. పలు అంతర్జాతీయ ఈవెంట్లను కవర్ చేయడానికి ప్రధానమంత్రి, రాష్ట్రపతిల వెంట విదేశీ పర్యటనలకు వెళ్లారు. మైనారిటీల్లో విద్య, నైపుణ్యాన్ని వృద్ధి చేయడానికి, నిరుద్యోగుల కోసం కోచింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇప్పించేవారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సియాసత్ ప్రస్తుతం ఖతర్ దేశానికి కూడా విస్తరించింది. 1973 అక్టోబర్ 18న హైదరాబాద్‌లో జన్మించిన ఆమేర్ అలీ ఖాన్‌కు ఉర్దూతో పాటు ఇంగ్లిష్, హిందీ, అరబిక్, తెలుగు భాషలు తెలుసు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించారు.

## పెద్దల సభకు ఉద్యమ సారథి

కోదండరాం సార్‌గా సుపరిచితుడైన ముద్దసాని కోదండరాం స్వగ్రామం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నెన్నెల మండలం జోగాపూర్. 1955 సెప్టెంబర్ 5న ముద్దసాని వెంకటమ్మ, ఎం.జనార్దన్ రెడ్డి దంపతులకు జన్మించారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో డిగ్రీ , ఓయూలో పీజీ (పొలిటికల్ సైన్స్), జేఎన్‌యూలో ఎంఫిల్ పూర్తి చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్డీ కోసం చేరగా.. 1981లో ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఉద్యోగంలో చేరారు. ఆదివాసీల సమస్యలపై దివంగత హక్కుల నేత బాలగోపాల్, ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావుతో కలిసి పని చేశారు. ఓయూలో ప్రొఫెసర్‌గా సుదీర్ఘ కాలం పనిచేసిన కోదండరాం..దివంగత ప్రొఫెసర్ జయశంకర్, ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ సహా అనేక మంది ప్రముఖ తెలంగాణవాదులతో నూ కలిసి పనిచేశారు. ఉద్యమ సమయంలో రాజకీయ జేఏసీ చైర్మన్‌గా అన్ని పార్టీలను తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏకం చేయడంలో క్రియాశీలంగా పని చేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇప్పటి బీఆర్‌ఎస్ విధానాలతో విభేదించారు. ప్రజాస్వామిక తెలంగాణ పేరిట 2018 మార్చి 31వ తేదీన తెలంగాణ జనసమితిని ఏర్పాటు చేశారు. ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీజేఎస్ కాంగ్రెస్‌తో కలిసి పని చేసింది. అదే క్రమంలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌తో జత కట్టారు. దీనితో పాటు ఉద్యమ నేపథ్యం, ప్రొఫెసర్‌గా ఆయన అందించిన సేవలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చింది.


ఎలాగూ వాళ్లు కదలిరారు కానీ వాళ్ల ఇళ్ల దగ్గరకే మనం కదిలి వెళ్దాం సార్!

# వెంకయ్యనాయుడు, చిరంజీవి ‘విభూషణులు’


బిందేశ్వర్


పద్మ సుబ్రమణ్యం


వైజయంతీ మాల

▶ మొదటి పేజీ తరువాయి

విఠలాచార్య, కెతావత్ సోమ్‌లాల్, ఎ.వేలు ఆనందచారి, ఏపీ నుంచి హరికథా కళాకారిణి డి.ఉమా మహేశ్వరి ఉన్నారు. పద్మశ్రీ గ్రహీతల్లో 34 మందికి 'అన్‌సంగ్ హీరోస్' పేరిట పురస్కారం దక్కింది. క్రీడారంగం నుంచి టెన్నిస్ డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న, స్క్వాష్ ప్లేయర్ జోష్నా చినప్ప, హాకీ క్రీడాకారుడు హర్బిందర్ సింగ్ సహా ఏడుగురికి పద్మశ్రీ లభించింది. పురస్కార గ్రహీతల్లో మొత్తం 30 మంది మహిళలున్నారు. దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను నాలుగేళ్ల విరామం అనంతరం బిహార్ దివంగత ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు మంగళవారం ప్రకటించడం తెలిసిందే. కాగా, తెలుగు రాష్ట్రాల నుంచి పద్మ అవార్డులకు ఎంపికైన వారికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్ అభినందనలు తెలిపారు.

**పద్మాలు గర్వకారణం: ఏపీ సీఎం జగన్**

తెలుగు రాష్ట్రాల నుంచి పద్మ అవార్డులకు ఎంపికైనవారిని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సినీ నటుడు చిరంజీవిలకు కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ పురస్కారాలను ప్రకటించడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే తెలుగు రాష్ట్రాల్లో 'పద్మ' అవార్డులను దక్కించుకున్న వారిని అభినందించారు, వారు మనకు గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు.

## పరిచయం అక్కర్లేని పేరు.. వెంకయ్య

ముప్పవరపు వెంకయ్యనాయుడు.. దేశ రాజకీయాల్లో పరిచయం అక్కర్లేని పేరు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో కాషాయదళంలో వివిధ హోదాల్లో పనిచేశారు. విద్యార్థి సంఘం నేత నుంచి దేశ ఉప రాష్ట్రపతి వరకు ఎదిగిన బీజేపీ నేత. 1972 జైఆంధ్రా ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. విజయవాడ, నెల్లూరులో అనేక ఉద్యమాలు చేపట్టారు. 1978లో తొలిసారిగా ఏపీ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఉదయగిరి నియోజకవర్గం నుంచి 2 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1988 నుంచి 1993 వరకు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా కొనసాగారు. తర్వాత పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసి 1998 ఏప్రిల్‌లో కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. పలు పార్లమెంటరీ బోర్డుల్లో సభ్యునిగా, చైర్మన్‌గా పనిచేశారు. 2000 సెప్టెంబర్ నుంచి 2002 జూన్ వరకు కేంద్రంలోని వాజ్‌పేయి ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా సేవలందించారు. 2002 జూలైలో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నియమితులై 2004 అక్టోబర్ వరకు ఆ పదవిలో కొనసాగారు. 2014లో నరేంద్ర మోదీ కేబినెట్‌లో పట్టణాభివృద్ధి శాఖ, సమాచార, ప్రసారాల శాఖల మంత్రిగా నియమితులయ్యారు. వెంకయ్యనాయుడు 2017లో ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ఉప రాష్ట్రపతి హోదాలో రాజ్యసభ చైర్మన్‌గా మెప్పించారు.స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంత ఉన్నత పదవిలో ఉన్నా, తరచూ తెలుగు రాష్ట్రాలకు వచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొనే వారు. ఉపరాష్ట్రపతి పదవీ కాలం ముగిసిన అనంతరం మరింత చురుగ్గా సామాజిక సేవలో పాల్గొంటున్నారు.

**బాధ్యతను పెంచింది**

''దేశం అమృత కాలం దిశగా అభివృద్ధి పథంలో సాగుతున్న తరుణంలో ప్రకటించిన పద్మ విభూషణ్ పురస్కారాన్ని వినమ్రంగా స్వీకరిస్తున్నా. ఇది నా బాధ్యతను మరింతగా పెంచింది. రైతులు, యువత, మహిళలు సహా నవ భారత నిర్మాణంలో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరికీ పురస్కారాన్ని అంకితం చేస్తున్నా''.

## పద్మ అవార్డుల వివరాలివీ..

**పద్మ విభూషణ్ (ఐదుగురికి)**

వైజయంతిమాల బాలి (కళారంగం-తమిళనాడు), కొణిదెల చిరంజీవి (కళారంగం-ఆంధ్రప్రదేశ్), ఎం.వెంకయ్యనాయుడు (ప్రజావ్యవహారాలు-ఆంధ్రప్రదేశ్), బిందేశ్వర్ పాఠక్ (సామాజిక సేవ-బిహార్), పద్మా సుబ్రమణ్యం (కళారంగం-తమిళనాడు).

**పద్మభూషణ్ (17 మందికి)**

ఫాతిమా బీవీ (మరణానంతరం-ప్రజా వ్యవహారాలు-కేరళ), హోర్ముస్ జీ ఎన్.కామా (సాహిత్యం, విద్య, జర్నలిజం-మహారాష్ట్ర), మిథున్ చక్రవర్తి (కళారంగం-పశ్చిమబెంగాల్), సీతారాం జిందాల్ (వర్తకం-పరిశ్రమలు-కర్నాటక), యంగ్ లియు (వర్తకం-పరిశ్రమలు-తైవాన్), అశ్విన్ బాలచంద్ మెహతా (వైద్యం-మహారాష్ట్ర), సత్యబ్రత ముఖర్జీ (మరణానంతరం-ప్రజా వ్యవహారాలు-పశ్చిమ బెంగాల్), రాంనాయక్ (ప్రజా వ్యవహారాలు-మహారాష్ట్ర), తేజస్ మధుసూదన్ పటేల్ (వైద్యం-గుజరాత్), ఓలంచెరి రాజగోపాల్ (ప్రజా వ్యవహారాలు-కేరళ), దత్తాత్రేయ్ అంబాదాస్ మయలూ అలియాస్ రాజ్ దత్ (కళారంగం-మహారాష్ట్ర), తోగ్దన్ రింపోచే (ఆధ్యాత్మికత-లద్దాఖ్), ప్యారేలాల్ శర్మ (కళారంగం-మహారాష్ట్ర), చంద్రేశ్వర్ ప్రసాద్ ఠాకూర్ (వైద్యం-బిహార్), ఉషా ఉతుప్ (కళారంగం-మహారాష్ట్ర), విజయ్‌కాంత్ (మరణానంతరం-కళారంగం-తమిళనాడు), కుందన్ వ్యాస్ (సాహిత్యం, విద్య, జర్నలిజం-మహారాష్ట్ర).

పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైన 110 మందిలో గోండు చిత్రకార దంపతులు శాంతిదేవీ పాశ్వాన్, శివన్ పాశ్వాన్ తదితరులున్నారు.

## విభూషణ మాల

సాక్షి, హైదరాబాద్: తొలి తరం సినీ కథానాయికల్లో వైజయంతీ మాలది ప్రత్యేక స్థానం. 1933 ఆగస్టు 13న వసుంధరా దేవి, యండీ రామన్‌లకు వైజయంతీ మాల చెన్నైలో జన్మించారు. నటిగా, భరతనాట్య కళాకారిణిగా, గాయనిగా, కొరియోగ్రాఫర్, పార్లమెంట్ సభ్యురాలిగా.. ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు తెచ్చుకున్నారు. 'వాళ్కై'(1949) చిత్రం ద్వారా తమిళ చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారామె. తెలుగులో 'జీవితం' (1950) చిత్రంతో అరంగేట్రం చేసి, 'సంఘం' (1954), 'వేగుచుక్క' (1957), 'విజయకోట వీరుడు' (1958), 'బాగ్దాద్ గజదొంగ' (1960), 'విరిసిన వెన్నెల' (1961), 'వీర సామ్రాజ్యం' (1961), 'చిత్తూరు రాణీ పద్మిని' (1963) వంటి సినిమాల్లో నటించారు.

## ‘యాదాద్రి’లో ఆనందచారిది కీలకపాత్ర..

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయ పునర్నిర్మాణంలో ప్రధాన స్థపతి సలహాదారుడిగా విధులు నిర్వహించిన డాక్టర్ ఎ.వేలు ఆనందచారికి పద్మశ్రీ అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాలోని వెన్నెంపల్లికి చెందిన ఆనందచారి ప్రస్తుతం హైదరాబాద్‌లోని సైదాబాద్‌లో నివాసం ఉంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అద్భుతంగా పునర్నిర్మితమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి 2018లో అదనపు స్థపతి సలహాదారుడిగా ఆనందచారి పనిచేశారు. ప్రధాన స్థపతి సలహాదారుడిగా ఉన్న సౌందర్‌రాజన్ రాజీనామా చేసిన తర్వాత 2019లో ఆలయానికి ప్రధాన స్థపతి సలహాదారుడిగా ప్రభుత్వం నియమించింది. 2022 మార్చి 28వ తేదీన ప్రధానాలయం ఉద్ఘాటన సమయం వరకు వేలు ఆనందచారి ప్రధాన స్థపతి సలహాదారుడిగా ఉన్నారు. యాదాద్రి ఆలయంతో పాటు వేములవాడ, బాసర, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం, గుంటూరు, నెల్లూరు, చిత్తురు, ఒంగోలు, విజయవాడ, అన్నవరం, కాణిపాకం, శ్రీకాళహస్తి, సింహాచలం వంటి ఆలయాల పునర్నిర్మాణ పర్యవేక్షణలో స్థపతిగా, ఆలయ ప్లాన్, నిర్మాణాలు వంటి శాఖలకు సలహాదారుడిగా పనిచేశారు. కేంద్ర ప్రభుత్వం తనకు పద్మశ్రీ అవార్డును ప్రకటించడంతో చాలా సంతోషంగా ఉందని డాక్టర్ వేలు ఆనందచారి సాక్షికి తెలిపారు.

## బంజారాభాషలో ‘సోమ్‌లాల్’ భగవద్గీత

సాక్షి యాదాద్రి: భువనగిరి మండలం ఆకుతోట బాయితండాకు చెందిన కేతావత్ సోమ్‌లాల్ బంజారాభాషలో భగవద్గీతను రచించారు. హైదరాబాద్‌లోని హబ్సిగూడలో నివాసం ఉంటున్న సోమ్‌లాల్ బంజారా రచయితగా, గాయకునిగా ఎంతో ప్రసిద్ధి చెందారు. బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి బంజారా సాహిత్య సేవకు శ్రీకారం చుట్టారు. తన జాతికి భగవద్గీతను అంకితం చేయడానికి ఆయన ఎంతో కృషి చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో బంజారా భగవద్గీతను తీర్చిదిద్దారు.

## మెగా విభూషణ్

సాక్షి, హైదరాబాద్: మెగాస్టార్ చిరంజీవి కీర్తికిరీటంలో ఇప్పుడు పద్మవిభూషణ్ చేరింది. సినిమాకి చేస్తున్న సేవలను గుర్తించి 2006లో కేంద్ర ప్రభుత్వం ఆయనకు 'పద్మభూషణ్' పురస్కారాన్నివ్వగా.. ఇప్పుడు 'పద్మవిభూషణ్' ప్రకటించింది. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా సాధారణ నటుడిగా తెలుగు తెరకు పరిచయమై, తెలుగు సినీ తెరపై ఇంతవరకు ఎదిగిన ఈ 'మెగా విభూషణ్' చిరంజీవి ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో 1955 ఆగస్టు 22న జన్మించారు. అసలు పేరు కొణిదెల శివశంకర వరప్రసాద్. సినిమాల్లోకి వచ్చాక చిరంజీవిగా మార్చుకున్నారు.

**పునాది రాళ్లతో పునాది.. స్వయంకృషితో 'నంది':** 1978 ఫిబ్రవరి 11న 'పునాది రాళ్ళు' చిత్రం చిరంజీవి నటనకు పునాది పడింది. కె. విశ్వనాథ్ దర్శకత్వంలో చేసిన 'స్వయంకృషి' (1987) సినిమాతో చిరంజీవి ఉత్తమ నటుడిగా తొలి నంది పురస్కారం అందుకున్నారు. 'ఆపద్బాంధవుడు' (1992), 'ఇంద్ర' (2002) చిత్రాలకూ నంది అవార్డులు అందుకున్నారాయన. అలాగే 'రఘుపతి వెంకయ్య '(2016) అవార్డు అందుకున్నారు. 2006లో ఆంధ్రా వర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 'చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్' ద్వారా 'చిరంజీవి బ్లడ్ బ్యాంక్', 'చిరంజీవి ఐ బ్యాంక్' ఏర్పాటు చేసి, సేవలందిస్తున్నారాయన.

**అక్కినేని తర్వాత చిరుకే**

తెలుగు సినీరంగంలో దివంగత అక్కినేని నాగేశ్వరరావు తర్వాత, ఇప్పుడు ఆ అత్యున్నత పురస్కారం చిరంజీవికి దక్కింది.

## ఈ గౌరవం మీది: చిరంజీవి

'''పద్మ విభూషణ్' అవార్డు వచ్చిందని తెలిసిన క్షణంలో నిజంగా ఏ మాట్లాడాలో.. ఎలా రియాక్ట్ అవ్వాలో తెలియని పరిస్థితి. మన దేశంలోని రెండో అత్యున్నత పురస్కారం 'పద్మ విభూషణ్' వచ్చినందుకు నిజంగా నాకు చాలా సంతోషంగా ఉంది. ఒక తల్లి కడుపున పుట్టకపోయినా నన్ను తమ సొంత మనిషిలా, మీ అన్నయ్యగా, మీ బిడ్డగా భావించే కోట్లాది మంది ఆశీస్సులు, నా సినీ కుటుంబం అండదండలు, నీడలా నాతో ప్రతి నిమిషం నడిచే లక్ష లాది మంది అభిమానుల ప్రేమ, ఆదరణ కారణంగానే నేను ఈ రోజు ఈ స్థితిలో ఉన్నాను. అందుకే నాకు దక్కినటువంటి ఈ గౌరవం మీది. ఈ పురస్కారానికి ఎంపిక చేసిన భారత ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు'' అని చిరంజీవి స్పందించారు.

## బుర్ర వీణ కళా సంరక్షకుడు కొండప్ప..

బుర్ర వీణ కళకు సంరక్షకుడిగా పేరుపొందిన 63 ఏళ్ల మాల దాసరి కొండప్ప ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద గ్రామానికి చెందిన కొండప్ప బుర్ర వీణ కళారూపం అంతరించిపోకుండా కాపాడేందుకు తన జీవితాన్ని అంకితం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో బుర్ర వీణ కళాకారుడు కొండప్ప ఒక్కరే. ప్రస్తుతమున్న రూపంలో వాయిద్యాన్ని రూపొందించినదీ ఆయనే. తెలుగు, కన్నడ భాషల్లో 'తత్వాలు', సామాజిక-మతపరమైన నైతిక కూర్పులను, ఆధ్యాత్మిక-తాత్విక అనుకరణలను ఆయన బుర్ర వీణ ద్వారా పాడారు. ఆచారం ప్రకారం తమ సామాజికవర్గంలో మాత్రమే వాయించాల్సిన బుర్ర వీణ కళను తన గాత్రం ద్వారా జన బాహుళ్యానికి దగ్గర చేశారు. దూరదర్శన్‌లో కళారూపాన్ని ప్రదర్శించారు. 2019లో మూల ధ్వని సంగీత కార్యక్రమంలో బుర్రవీణ జానపద జెండా ఎగరవేశారు. 2023లో ఆద్యకళ ఆధ్వర్యంలో సాలార్జంగ్ మ్యూజియం, తెలుగు విశ్వవిద్యాలయం కలసి నిర్వహించిన ఆదివాసీ జానపద సంగీత సమ్మేళనంలో.. ఆదివాసీ రాగాలకు జానపద సంగీతాన్ని జోడించి అలరించారు.

**నా జన్మ ధన్యమైంది:** ''జీవితంలో ఇంత పెద్ద అవార్డు వస్తుందని కలలో కూడా ఊహించలేదు. నా జన్మధన్యమైంది. బుర్ర వీణ వాయిస్తూ, జానపద పాటలు పాడుతూ.. గ్రామాల్లో, పట్టణాల్లో కథలు చెప్పుకుంటూ వచ్చాను. బుర్ర వీణ వాయిస్తున్న నన్ను తిరుమలరావు అనే వ్యక్తి అక్కడక్కడా పాటలు పాడేందుకు తీసుకెళ్లేవారు. ఇప్పుడు పద్మశ్రీ అవార్డుతో చాలా సంతోషంగా ఉంది..''

– దాసరి కొండప్ప

## చిందు, యక్షగానానికి ఊపిరిలూదిన సమ్మయ్య

చిందు, యక్షగాన కళకు ఊపిరినిచ్చి నిలబెడుతున్న ప్రముఖ కళాకారుడు గడ్డం సమ్మయ్యను పద్మశ్రీ అవార్డు వరించింది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లెకు చెందిన ఆయన 1956 జనవరి 1న జన్మించారు. తల్లిదండ్రులు చండికాంబ, రామస్వామి నుంచి చిందు యక్షగాన కళారూపాన్ని నేర్చుకున్నాడు. 14 ఏళ్ల వయసు నుంచే కథాగానం మొదలుపెట్టారు. ఇప్పటివరకు పలు రాష్ట్రాల్లో 19 వేలకుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. సంపూర్ణ అక్షరాస్యత, పర్యావరణ పరిరక్షణ వంటి సామాజిక సమస్యలపై తనదైన విధంగా కళారూపాలను రూపొందించి, ప్రజల్లో అవగాహన కల్పించారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థల కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కళను ప్రోత్సహించడానికి చిందు యక్షగాన కళాకారుల సంఘం, సమ్మయ్య యువ కళాక్షేత్రాన్ని స్థాపించారు. పలు అవార్డులు, రివార్డులు అందుకున్నారు.

**చిందు జాతికి అంకితం:** ''నా కులవృత్తి, జీవనాధారమైన చిందు యక్షగాన కళారూపాలకు జీవం పోసేలా ప్రభుత్వాల తోడ్పాటు మరువలేను. రామాయణం, మహాభారతంలోని దేవతల పాత్రలతో రక్తి కట్టించేలా చిందు, యక్షగానానికి రూపకల్పన చేసిన మా జాతికి ఈ పురస్కారం అంకితం. ఈ అవార్డుతో నా జీవితం ధన్యమైంది. దీనికి సహకరించిన వారందరికీ, చిందు కుటుంబాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

– గడ్డం సమ్మయ్య

## స్వర మహేశ్వరి.. ఉమా మహేశ్వరి

సంస్కృతంలో హరికథ చెప్పిన తొలి మహిళా భాగవత కళాకారిణి ఉమా మహేశ్వరి. తన గానంతో ఆమె స్వర మహేశ్వరిగా పేరుపొందారు. సావిత్రి, భైరవి, శుభపంతువరాలి, కేదారం, కల్యాణి వంటి గాథలను వివిధ రాగాల్లో హరికథగా చెప్పడం ఆమె ప్రత్యేకత. తెలుగు, సంస్కృత భాషల్లో ప్రావీణ్యమున్న మహేశ్వరి.. రమణ మహర్షి, పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల గాథలను నాలుగు హరికథల్లో రచించారు. చాలామంది మహిళలు సంప్రదాయ అడ్డంకుల నుంచి బయటికి వచ్చి.. హరికథ కళను స్వీకరించేలా ఆమె ప్రోత్సహించారు. ఏపీకి చెందిన మహేశ్వరి నాదస్వర విద్వాంసుడు దాలిపర్తి పిచ్చిహరి మనవరాలు.

## ఇంటినే గ్రంథాలయం చేసిన విఠలాచార్య

తన ఇంటినే గ్రంథాలయంగా మార్చి అందరికీ సాహిత్య, విద్యా సౌరభాలు అందిస్తున్న కూరెళ్ల విఠలాచార్యను పద్మశ్రీ వరించింది. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన ఆయన.. తన ఇంటిని రెండు లక్షల పుస్తకాలతో గ్రంథాలయంగా మార్చారు. తన పెన్షన్ డబ్బుతోనే ఈ గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. అనేక రచనలు చేసి అభినవ పోతన, మధురకవిగా పేరొందారు. 2019లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి దాశరథి పురస్కారం , 2018లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి విశిష్ట పురస్కారం పొందారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రశంసలు కూడా అందుకున్నారు.

**పల్లెకు పట్టం కట్టారు:** ''కేంద్ర ప్రభుత్వం నాకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం ద్వారా పల్లెకు పట్టం కట్టినట్లు భావిస్తున్నాను. పల్లెను నమ్ముకొని జీవిస్తూ సాహిత్య, సాంస్కృతిక ధార్మిక సేవలు అందిస్తున్న నాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన గుర్తింపు ఇవ్వడం సంతోషకరంగా ఉంది. నా సేవలను, సాహితీ వ్యాసంగాన్ని ప్రధాని స్వయంగా ప్రశంసించడం మర్చిపోలేను.

– డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య

# ఇకపై ఎంసెట్.. టీఎస్ఈఏపీసెట్

## పేరు మార్చిన ఉన్నత విద్యామండలి.. మే 9 నుంచి 11 వరకు నిర్వహణ

- 2024–25 విద్యాసంవత్సరానికి మొత్తం 8 సెట్ల టెస్టుల తేదీల ప్రకటన
- షెడ్యూల్ వెల్లడించిన ఉన్నత విద్యామండలి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ఈఏపీసెట్), టీఎస్ ఈ సెట్, టీఎస్ ఎడ్‌సెట్ సహా మొత్తం ఎనిమిది ప్రవేశపరీక్షల తేదీలను ఖరారు చేస్తూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి షెడ్యూల్‌ను ప్రకటించింది. రాబోయే 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించిన వివిధ కోర్సుల్లో ప్రవేశం నిమిత్తం నిర్వహించే పరీక్షల తేదీలు, వాటిని నిర్వహించే విశ్వవిద్యాలయాల వివరాలను వెల్లడించింది. రాష్ట్రంలో గతంలో టీఎస్ ఎంసెట్‌గా ఉన్న పేరును గత కొంతకాలంగా విడిగా నీట్ ద్వారా మెడిసిన్ ప్రవేశాలను నిర్వహిస్తుండడంతో టీఎస్ఈఏపీసెట్‌గా మారుస్తూ ఉత్తర్వులిచ్చింది. గురువారం ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, టీఎస్‌సీహెచ్ఈ చైర్మన్ ప్రొ. ఆర్. లింబాద్రి షెడ్యూల్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో... టీఎస్‌సీహెచ్ఈ వైస్ చైర్మన్ ప్రొ. ఎస్కే మహమూద్, జేఎన్‌టీయూ–హెచ్ వీసీ ప్రొ. కట్టా నర్సింహారెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ ప్రొ.డి.రవీందర్, కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొ.టి.రమేశ్ పాల్గొన్నారు. ఈ ప్రవేశపరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలు ..షెడ్యూల్, దరఖాస్తు చేసుకునేందుకు అర్హతలు, చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ ఫీజు తదితరాల గురించి సంబంధించి సెట్ కన్వీనర్లు ప్రకటిస్తారని ఉన్నత విద్యామండలి కార్యదర్శి డా. ఎన్.శ్రీనివాసరావు తెలిపారు.

ఈ ఎనిమిది ప్రవేశపరీక్షలకు సంబంధించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షల (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌లు) టీఎస్ సెట్‌ల తేదీలు, నిర్వహించే యూనివర్సిటీల వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి....

| టీఎస్ సెట్స్–2024 | నిర్వహించే వర్సిటీ | పరీక్ష తేదీ/ తేదీలు |
|---|---|---|
| 1) టీఎస్ ఈ సెట్–2024 (డిప్లొమా హోల్డర్లకు ఇంజనీరింగ్, ఇతర కోర్సుల ప్రవేశానికి, బీఎస్సీ హోల్డర్లకు) | ఉస్మానియా విశ్వవిద్యాలయం | 06-05-2024(సోమవారం) |
| 2) టీఎస్ ఈఏపీసెట్–2024 ఇంజనీరింగ్ | జేఎన్‌టీయూ–హెచ్ | 09-05-2024 నుంచి 11-05-2024 (గురువారం నుంచి శనివారం) |
| అగ్రికల్చర్, ఫార్మసీ | జేఎన్‌టీయూ–హెచ్ | 12-05-2024, 13-05-2024 (ఆదివారం) (సోమవారం) |
| 3) టీఎస్ ఎడ్.సెట్–2024 (బీఈడీ కోర్సు కోసం) | మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం | 23-05-2024 (ఆదివారం) |
| 4) టీఎస్ లాసెట్–2024 (3 ఏళ్లు ఇంకా 5 ఏళ్ల ఎల్ఎల్‌బి కోర్సుల కోసం) | ఉస్మానియా విశ్వవిద్యాలయం | 03-06-2024 (సోమవారం) |
| 5) టీఎస్ పీజీఎల్‌సెట్(ఎల్ఎల్ఎం కోర్సులు) | ఉస్మానియా విశ్వవిద్యాలయం | 03-06-2024 (సోమవారం) |
| 6) టీఎస్ఐసెట్–2024 (ఎంబీఏ ఇంకా ఎంసీఏ కోర్సుల కోసం) | కాకతీయ విశ్వవిద్యాలయం | 04-06-2024, 05-06-2024 (మంగళవారం, బుధవారం) |
| 7) టీఎస్ పీజీఈసెట్–2024 (ఎంటెక్ ఇంకా ఎంఫార్మసీ కోర్సుల కోసం) | జేఎన్‌టీయూ–హెచ్ | 06-06-2024 నుంచి 08-06-2024 (గురువారం నుంచి శనివారం) |
| 8) టీఎస్ పీఈసెట్–2024 (బీ.పీ.ఈడీ ఇంకా యూ.జీ.డీపీ.ఈడీ కోర్సుల కోసం) | శాతవాహన విశ్వవిద్యాలయం | 10-06-2024 నుంచి 13-06-2024 (సోమవారం నుంచి గురువారం) (ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్) |

# ఏడు రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు

**రూ. 29.27 కోట్ల సీఎంఆర్ దుర్వినియోగం**

**వర్ని/బోధన్/బోధన్‌టౌన్:** కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) దుర్వినియోగం చేసిన నిజామాబాద్ జిల్లా బోధన్, వర్నిలోని ఆరు రైస్ మిల్లులపై సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అధికారులు గురువారం రైస్ మిల్లుల్లోతనిఖీలు నిర్వహించారు. వర్నిలోని నాలుగు మిల్లుల్లో రూ.24.27 కోట్ల విలువైన 1,06,173 క్వింటాళ్ల వడ్లను రైస్‌మిల్లుల యజమానులు అమ్ముకొని సొంతానికి వాడుకున్నారని గుర్తించారు. వర్ని మండల కేంద్రంలోని ఎమ్మెస్సార్ ఆగ్రో ఇండస్ట్రీ రూ.5.05 కోట్లు, రాయల్ ట్రేడింగ్ రూ.6.48 కోట్లు, గంగా రైస్‌మిల్ రూ. 8.09 కోట్లు, ఎస్ఏఆర్ ట్రేడర్స్ రూ. 4.65 కోట్ల విలువైన వడ్లను విక్రయించుకున్నారని అధికారులు తెలిపారు. బోధన్ పట్టణ శివారులోని దాదాబాయ్ ఇండస్ట్రీస్ (రైస్‌మిల్లు)లో రూ.5 కోట్ల విలువ చేసే 15 వేల 260 క్వింటాళ్ల బియ్యం దుర్వినియోగం చేశారని పేర్కొ న్నారు. దాడుల్లో సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ నిఖిల్ రాజ్, అశోక్ అహ్మద్, వర్ని ఎస్సై కృష్ణకుమార్ పాల్గొన్నారు.







# ఆ ధాన్యం విక్రయానికి గ్లోబల్ టెండర్లు

సాక్షి, హైదరాబాద్: రైస్‌మిల్లుల్లో నిల్వ ఉన్న యాసంగి ధాన్యం విక్రయానికి గ్లోబల్ టెండర్లు ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ప్రణాళిక విభాగ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా, మరో నలుగురు సభ్యులతో కూడిన రాష్ట్రస్థాయి కమిటీని నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022–23 సంవత్సరానికి సంబంధించి యాసంగిలో ఉత్పత్తి అయిన 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని గత ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసి మిల్లులకు కేటాయించింది. అయితే ఈ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ముడిబియ్యం(రా రైస్)గా మిల్లింగ్ చేయడానికి రైస్‌మిల్లర్లు ఆసక్తి చూపలేదు. రారైస్‌గా మిల్లింగ్ చేస్తే నష్టం వస్తుందని, బాయిల్డ్ రైస్‌గా మిల్లింగ్ చేసేందుకు అవకాశం ఇవ్వాలని మిల్లర్లు కోరగా, ఎఫ్‌సీఐ స్పందించలేదు. దీంతో మిల్లర్లు ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా పక్కన పెట్టారు. రూ.18వేల కోట్ల విలువైన ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా నిల్వ ఉంచడం వల్ల, వీటి కొనుగోలుకు రుణం తెచ్చిన పౌరసరఫరాల సంస్థపై ఆ భారం పడింది. ఈ నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం నిల్వ ఉన్న ధాన్యాన్ని విక్రయించేందుకు గత ఆగస్టులో టెండర్లు పిలిచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇటీవల పౌరసరఫరాల శాఖపై సమీక్షించి పాత టెండర్లు రద్దు చేసి, కొత్త నిబంధనలతో టెండర్లు ఆహ్వానించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.ఈ కమిటీకి చైర్మన్‌గా ప్రణాళిక ముఖ్య కార్యదర్శి వ్యవహరించనుండగా, సభ్యులుగా ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి నామినేట్ చేసిన ఓ సీనియర్‌అధికారి, పౌరసరఫరాలశాఖ కమిషనర్, వ్యవసాయశాఖ కార్యదర్శి, నీటిపారుదలశాఖ కార్యదర్శి వ్యవహరిస్తారు.


### రిపబ్లిక్ డే సందర్భంగా 'డిజిటల్ ఇండియా సేల్'

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా, రిలయన్స్ డిజిటల్ లేదా మై జియో స్టోర్ నుండి డిజిటల్ ఇండియా సేల్‌తో అద్భుతమైన రాయితీలను పొందే అవకాశం వినియోగదారులకు కల్పించింది. ప్రముఖ బ్యాంకుల కార్డ్‌లపై రూ. 26,000 వరకు ప్రత్యేక తక్షణ తగ్గింపును పొందవచ్చు. టీవీలు, రిఫ్రిజిరేటర్‌లు, ల్యాప్‌టాప్‌లు, వాషింగ్ మెషీన్‌లు తదితర విద్యుదుపకరణాల కొనుగోళ్లపై అద్భు తమైన రాయితీలను జనవరి 28 వరకు ఇవ్వనున్నారు. వివరాలకు వినియోగదారులు ఏదైనా రిలయన్స్ డిజిటల్ స్టోర్‌ని సందర్శించవచ్చు లేదా www.reliancedigital.inకి లాగిన్ చేయవచ్చు.









ఓ నా కుమారా! ఒక వేళ నీ కర్మ ఆవగింజంత ఉండి, అది ఒక పెద్ద రాతిబండలో గానీ, ఆకాశాలలో గానీ లేదా భూమిలో గానీ దాగివున్నా అల్లాహ్ దానిని తప్పక (వెలుగులోకి) తెస్తాడు. అల్లాహ్ ఎంతో సూక్ష్మగ్రాహి, సర్వం తెలిసినవాడు.

– ఇస్లాం ధర్మం



సాక్షి

శుక్రవారం, 26 జనవరి 2024

# అనైక్యతా కూటమి

వచ్చే ఎన్నికల్లో అధికార బీజేపీని గద్దె దింపడమే లక్ష్యంగా ఐక్యంగా ప్రతిఘటిస్తామని 28 పార్టీల కలగూరగంప 'ఇండియా' కూటమి ఆది నుంచి చెబుతోంది. కానీ, ఎన్నికలు ముంచుకొస్తుంటే, కూటమి బీటలు వారుతోంది. అంతటా అనైక్యతా రాగాలే వినిపిస్తున్నాయి. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని ఆ రాష్ట్ర సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ బుధవారం తేల్చేశారు. 'ఆప్' నేత – పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ సైతం తమ రాష్ట్రంలోనూ అంతే అని కుండబద్దలు కొట్టారు. జేడీ(యూ) అధినేత – బిహార్ సీఎం నితీశ్ కుమార్ పైకి ఏమీ చెప్పకున్నా, లోలోపల కుతకుతలాడుతున్నట్టు కనిపిస్తూనే ఉంది. వెరసి, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'భారత్ జోడో' అని తిరుగుతుంటే, ముందుగా 'ఇండియా(కూటమి) జోడో' చేయాల్సిన పరిస్థితి తలెత్తింది.

రాహుల్ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' బెంగాల్‌లోకి ప్రవేశించడానికి ఒక రోజు ముందే మమత షాక్ ఇచ్చారు. బెంగాల్‌లో హస్తం బలం పుంజుకుంటే, అది తనకు తలనొప్పి అవుతుందని మమతకు తెలుసు. అందుకే, కలసికట్టుగా పోటీ చేసినా... రాష్ట్రంలో నిరుడు కాంగ్రెస్ నెగ్గిన 2 లోక్‌సభా స్థానాలనే ఆ పార్టీకి కేటాయిస్తామన్నది తృణమూల్ ప్రతిపాదన. దూకుడు ప్రదర్శిస్తున్న స్థానిక హస్తం నేతలు అందుకు ససేమిరా అంటున్నారు. ముఖ్యంగా రాష్ట్ర పీసీసీ ప్రెసిడెంట్, కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత అధీర్ రంజన్ చౌధురి నిత్యం మమతపై చేస్తున్న విమర్శలు చివరకు ఇక్కడకు తెచ్చాయి. కాంగ్రెస్ పెద్దలు నష్టనివారణకు ప్రయత్నిస్తున్నా రాజీ లేదని దీదీ కొట్టిపారేశారు. కూటమిలో కొనసాగుతామంటూనే, ఎన్నికలయ్యాక కాంగ్రెస్ బలాన్ని బట్టి మిగతావి మాట్లాడదామని ఆమె చెబుతున్న మాటలు కంటితుడుపుకే తప్ప, బీజేపీపై కలసికట్టు పోరుకు పనికిరావు.

మరోపక్క 'ఇండియా' కూటమి ఏర్పాటులో కీలక పాత్రధారి, జేడీ (యూ) అధినేత, బిహార్ సీఎం అయిన నితీశ్ కుమార్ వ్యవహారశైలి సైతం అనుమానాస్పదంగానే ఉంది. కూటమిలో తనకు సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆయన అసంతృప్తితో ఉన్నారు. మోదీతో రామ్ రామ్ చెప్పి, ప్రతిపక్ష కూటమిలో చేరిన ఆయన తీరా ఇప్పుడు మళ్ళీ అధికార ఎన్డీఏ కూటమికే తిరిగి వచ్చేస్తారని ఊహాగానం. బిహార్‌లో ఉమ్మడి పాలన సాగిస్తున్న ఆర్జేడీ – జేడీయూల మధ్య కొన్నాళ్ళుగా సఖ్యత లేదు. ఫ్లేటు ఫిరాయించడంలో పేరొందిన నితీశ్ గతంలో బీజేపీకి కటీఫ్ చెప్పి, ఆర్జేడీతో కలసి ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేశారు. కానీ, ఇటీవల తననే గద్దె దింపాలని చూసిన ఆర్జేడీ మీద గుర్రుగా ఉన్నారు. ఆ పార్టీని పక్కకు నెట్టి, మళ్ళీ కమలనాథులతో నితీశ్ చేతులు కలిపే సూచనలున్నట్టు పుకారు. బిహార్‌లో జేడీయూ, ఆర్జేడీ నేతలు ఎవరికి వారు గురువారం కీలక భేటీలు జరపడం, ఢిల్లీలో రాజకీయ వాతావరణం వేడెక్కిన తీరు చూస్తుంటే... ఆ రెండు పార్టీల ప్రేమకథ ముగిసినట్టే ఉంది. మరి, రాజకీయ చాణక్యుడు నితీశ్ రానున్న రోజుల్లో ఏం చేస్తారో చూడాలి.

విచిత్రమేమిటంటే, మాటలే తప్ప చేతల్లో కూటమి అడుగు ముందుకు పడట్లేదు. సెప్టెంబర్‌లో అనుకున్న సీట్ల సర్దుబాటు వ్యవహారం డిసెంబర్‌కి వాయిదా పడి, జనవరి ముగిసిపోతున్నా అతీగతీ లేకుండా పడివుంది. అన్ని పార్టీలూ కలసి సమష్టి ప్రతిపక్ష ర్యాలీ భోపాల్‌లో చేయాలనుకున్నా అది కార్యరూపం దాల్చలేదు. నెలలు గడుస్తున్నా ఉమ్మడి మేనిఫెస్టో ఊసే లేదు. లౌకికవాద, రాజ్యాంగబద్ధ పాలన కోసం పోరాటం అని చెబుతున్నా... బీజేపీ వ్యతిరేకత, మోదీని గద్దె దింపడమనే లక్ష్యం మినహా తగిన సమష్టి సైద్ధాంతిక భూమికను సిద్ధం చేసుకోవడంలో ప్రతిపక్ష కూటమి విఫలమైంది. వివిధ రాష్ట్రాల్లో తమ బలాబలాలు తెలుసు గనక, పార్టీలు తమలో తాము పోరాడే కన్నా బీజేపీపై బాణం ఎక్కుపెడితే ప్రయోజనం. ఒకటి రెండు సీట్లకై పంపిణీలో కలహించుకొనే కన్నా పెద్ద లక్ష్యం కోసం విశాల హృదయంతో త్యాగాలకు సిద్ధపడితేనే లక్ష్యం చేరువవుతుంది.

బెంగాల్‌లో తృణమూల్, పంజాబ్, ఢిల్లీల్లో ఆప్ లేకుండా కూటమికి ప్రాసంగికత ఏముంది? వాస్తవాల్ని గుర్తించి కాంగ్రెస్ తన వైఖరి మార్చుకోవాలి. పెద్దమనిషిగా కాక, అందరికీ పెద్దన్నగా వ్యవహరించాలనుకోవడంతోనే అసలు ఇబ్బంది. అలాగే, 'యాత్ర'లతో రాహుల్ ఇమేజ్ పెరగవచ్చేమో కానీ, ప్రతిపక్ష కూటమికి జరిగే ప్రయోజనమేమిటో తక్షణం చెప్పలేం. మణిపుర్ నుంచి ముంబయ్ దాకా 100 లోక్‌సభా స్థానాల మీదుగా సాగి, మార్చి 20న యాత్ర ముగియనుంది. అన్ని పార్టీలనూ ఒక తాటిపై నడిపి, సమన్వయం సాధించాల్సిన ఎన్నికల వేళ రాహుల్ దూరంగా యాత్రలో ఉంటే ఎలా? కనీసం అన్ని పార్టీలతో కలిసైనా యాత్ర చేయాల్సింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల్ని కూడగట్టడంలో 1977లో జేపీ, 1989లో వీపీ సింగ్, ఆ తరువాత యూపీఏ కాలంలో అందరి సమన్వయానికి సోనియా లాంటి వారు కృషి చేశారు. ప్రస్తుతం యాత్రతో రాహుల్, పార్టీ పునరుజ్జీవనంతో ఖర్గే బిజీ. మరి, కూటమి మెడలో ఐక్యత గంట కట్టేదెవరు?

మొత్తానికి, ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోదీ రోడ్‌షోలు, ప్రచారగీతాలతో సింహనాదం చేస్తుంటే, ప్రతిపక్షాలు వేటికవి స్వలాభం చూసుకుంటూ విభేదాల బాట పట్టడం విడ్డూరం. సమావేశాలతో హంగామా రేపుతూ మొదలైన ప్రతిపక్ష కూటమి తీరా ఆట ఆడకుండానే 'వాక్ ఓవర్'తో మోదీకి విజయం కట్టబెడుతోందని అనిపిస్తోంది. 28 కత్తులు ఒకే ఒరలో ఇమడడం కష్టమే. కానీ, అన్ని పార్టీలకూ ఒకే లక్ష్యం ఉంటే, అసాధ్యం కాకపోవచ్చు. నిష్క్రియాపరత్వంతో, సొంత లాభం కోసం సాటి పార్టీల కాళ్ళు నరికే పనిలో ఉంటే లాభం లేదు. ఢిల్లీలో పాగా వేయాలంటే, సమయం మించిపోక ముందే కళ్ళు తెరవాలి. కూటమిది ఆరంభ శూరత్వం కాదని నిరూపించాలి. కలహాలు మాని కార్యాచరణకు దిగాలి. లేదంటే తర్వాతేం చేసినా చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమే అవుతుంది.

# రాజ్యాంగమే సమ సమాజానికి దిక్సూచి

సందర్భం



డా॥ కత్తి పద్మారావు

భారతదేశంలో రాజ్యాంగం అమలైన జనవరి 26 ఒక మహత్తరమైన పండుగదినం. భారత రాజ్యాంగం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాలను కలిగిస్తానని ప్రజలకు వాగ్దానం చేసింది. ఆలోచనా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ ఇస్తానని భరోసా ఇచ్చింది. సమాన హోదా, సమాన అవకాశాలు, సమైక్యతా భావన, సోదర భావన కలిగించడానికే రాజ్యాంగం రూపొందింది. సమతా భావాలను అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారు. అమెరికా, బ్రిటన్ రాజ్యాంగాల నుంచి, ఫ్రెంచ్ విప్లవం నుంచి ఆయన స్ఫూర్తి పొందినా... బౌద్ధ తత్వంలోని ప్రేమ, కరుణ, ప్రజ్ఞ, మానవత్వం, సమానత్వం, స్వేచ్ఛ, తర్కం, ప్రశ్న వంటి అనేక భావాల్ని పొందుపర్చడం వల్లే, స్వాతంత్య్రం వచ్చిన తరువాత రక్తపాతం లేని సమాజంగా భారతదేశం రూపుదిద్దుకుంది.

డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్... మహా మేధావి, ఆలోచనాపరుడు, లౌకికవాద శిఖరం, సమతా దర్శనకర్త, గొప్పవక్త, లోతైన రచయిత. ఆయన శైలిలో గాఢత, విశ్లేషణ బలంగా వుంటాయి. విద్యా సంపన్నమైన ఆయన భాషలో సరళత, అభివ్యక్తిలో సాంద్రత కనిపిస్తాయి. అంబేడ్కర్ మానవ హక్కుల పోరాట ధీరుడు. బౌద్ధంలో ఉన్న సామాజిక సమతా నీతిని రాజ్యాంగంలో పొందుపర్చారు. ఆయన జీవితంలో అస్పృశ్యతను ఎదుర్కోవడం ప్రధాన అంశం అయ్యింది. మానవోత్తేజితమైన, వైజ్ఞానికమైన ఎన్నో కార్యక్రమాల్లో అస్పృశ్యులకు చోటు లేకపోయిందని మథనపడ్డారు. అందువలననే అస్పృశ్యతా నివారణా చట్టం గురించి పోరాడారు. ఈ సమాజాన్ని అస్పృశ్యత లేని సమాజంగా రూపొందించాలని తపన పడ్డారు. దాని వల్ల ఎంతో మంది తమ ప్రతిభకు తగిన స్థానం లేక సంఘర్షణకు గురయ్యారు, అణచి వేయబడ్డారు.

అంబేడ్కర్ ఒక తాత్వికుడు కూడా. కుల సమాజానికి ప్రత్యామ్నాయంగా కుల నిర్మూలనా సమాజాన్ని బోధించారు. అగ్రకుల రాజ్యాధికారంలో దళితులకు విముక్తి లేదని చాటారు. ప్రత్యామ్నాయ వ్యవస్థను రూపొందించుకోవడానికి రాజ్యాధికారం అవసరం అని ప్రబోధించారు. ఆయన రాజకీయ తత్వశాస్త్రం భావాత్మకమైంది కాదు... అది సాంఘిక, ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించగల సత్తా కలిగినది.

బొంబాయి వంటి నగరాల్లో కూడా కులతత్వం వ్యాపించి ఉండటంతో అంబేడ్కర్ సోదరులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కుల తత్వపు గొడ్డలి వేటు వారిని చిన్నప్పుడే తాకింది. ఒకే పాఠశాలలో చదివే పిల్లలు ఒక కూజా నీళ్ళు తాగలేకపోవడం, తోటి విద్యార్థులు ఆ కూజాలోని నీళ్ళను పైనుంచి పోస్తే దోసిళ్ళు పట్టి త్రాగవలసి రావడం వంటి ఘటనలు అంబేడ్కర్ గుండెల్ని పిండివేశాయి. ఆ గాయాలే రాబోయే కాలంలో కుల నిర్మూలన గ్రంథం రాయడానికి పునాదులేశాయి. కేవలం నీటి దగ్గరే కాదు, భాష దగ్గర కూడా ఆయనకు అస్పృశ్యత ఎదురైంది. అంబేడ్కర్ హైస్కూల్లో ప్రత్యేక పాఠ్యభాగంగా సంస్కృతాన్ని కోరుకున్నారు. ఒక అస్పృశ్యుడు సంస్కృతం నేర్చుకోవడం ఏమిటని నిరాకరించారు. దాంతో పర్షియన్ భాషను తీసుకోవలసి వచ్చింది. కానీ సంస్కృతాన్ని స్వయంగా కష్టపడి నేర్చుకున్నారు. వాల్మీకి, వ్యాసుడు, కపిలుడు, లోకాయతులు ఇంకా ఎందరో బ్రాహ్మణేతరులు, క్షత్రియులు సంస్కృతంలో గ్రంథాలు రాశారు. ఎందరో పాశ్చాత్య పండితులు సంస్కృతం నేర్చుకుని, వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు, కావ్యాలు, అన్నీ ఇంగ్లీషులోకి అనువాదం చేశారు. అంబేడ్కర్ కూడా వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు అన్నింటినీ అధ్యయనం చేసి, వ్యాఖ్యానించారు. ఏ భాషైనా, ఏ మనిషైనా నేర్చుకోవచ్చని నిరూపించారు.



అభివృద్ధిని తరచిచూస్తే...

దేశం ఎంతగానో అభివృద్ధి చెందుతోందని ఇప్పుడు గొప్పగా చెప్పుకొంటున్నాం. కానీ గణతంత్ర దినోత్సవ వేళ కొన్ని కఠిన వాస్తవాలను మనం అంగీకరించాల్సి ఉంటుంది. 2023 ప్రపంచ ఆకలి సూచీలో 125 దేశాల్లో ఇండియా 111వ స్థానంలో ఉంది. దేశంలో 81.35 కోట్ల మందికి ఇప్పటికీ ఉచిత బియ్యం పంపిణీ చేయాల్సి వస్తున్నదంటేనే దేశం ఎక్కడ ఉన్నదో అర్థమవుతుంది. కూడు, గూడు, బట్ట లేని ప్రజలు ఇంకా ఉన్నప్పుడు రాజ్యాంగం అమలవుతున్నట్టా అనే ప్రశ్న ఎదురవుతుంది. అంబేడ్కర్ భూమిని జాతీయం చెయ్యమన్నారు. కానీ అదేమో కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోతోంది. ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న తిండి గింజల వల్ల ఇక్కడి వ్యవసాయం సంక్షోభంలో వుంది. ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న వస్త్రాల వల్ల చేనేత పరిశ్రమ కుంటుపడింది. భారతదేశంలో పేదరికం ఎందుకు ఉందంటే రాజ్యాంగాన్ని నూటికి 90 శాతం ఉల్లంఘించడం వల్లనే అని చెప్పొచ్చు.

ప్రజలు ఇప్పటికీ అనారోగ్యంతో కునారిల్లుతున్నారు. పారిశుద్ధ్య వ్యవస్థ దెబ్బతింది. కేంద్ర ప్రభుత్వం పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టినా, ఎన్నో పట్టణాలు ఇంకా మురికి కూపాలుగానే వున్నాయి. వందశాతం బహిరంగ మల విసర్జన రహిత రాష్ట్రాలుగా ప్రకటించినవాటిల్లో కూడా 71 శాతం మేరకే నిరోధించగలిగారని జాతీయ గణాంక కార్యాలయ సర్వే వెల్లడించింది. ఇళ్లు, వ్యాపార, పారిశ్రామిక సముదాయాల నుంచి వ్యర్థ జలాలను శుద్ధి చేసిన తరువాతే బయటకు వదిలే నగరాలకు 'స్వచ్ఛ సర్వేక్షణ్' పోటీలో వాటర్ ప్లస్ సర్టిఫికేషన్ ఇస్తారు. ఆ వ్యవస్థ సరిగ్గా లేని నగరాలకూ పురస్కారాలు ఇవ్వడం... పోటీ నిష్పాక్షికతపై సందేహాలు లేవనెత్తుతోంది.

ఇకపోతే రోడ్లు నెత్తుటిమయం అవుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రతి గంటకూ 53 రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే, 19 మంది మృత్యువాత పడుతున్నారని 2022 నాటి గణాంకాల్ని కేంద్ర సర్కారే ప్రస్తావిస్తోంది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ప్రమాదాల్లో 11.9 శాతం, మృతుల సంఖ్యలో 9.45 శాతం, క్షతగాత్రుల లెక్కలో 15.3 శాతం పెరుగుదల రహదార్ల రక్తదాహ తీవ్రతను కళ్లకు కడుతోంది. రోడ్డు ప్రమాద మృతుల్లో 18–45 ఏళ్ల వయస్కులే 69 శాతం దాకా ఉంటున్నారన్న వాస్తవం గుండెల్ని మెలిపెట్టేదే. కుటుంబ పోషణకు రోడ్డెక్కిన మనిషి అకాల మృత్యువాత పడితే, ఇంటిల్లిపాదీ రోడ్డున పడే దుఃస్థితి ఏటా లక్షల మంది అభాగ్యుల్ని దుఃఖసాగరంలో ముంచేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా రహదారి ప్రమాద మృతుల సంఖ్య అయిదు శాతం దాకా తగ్గితే, అంతకు రెట్టింపు ఇండియాలో పెరగడం నిశ్చేష్టపరుస్తోంది. రహదార్ల మారణహోమానికి కారణమేమిటో సుప్రీంకోర్టే నియమించిన నిపుణుల కమిటీ పూసగుచ్చినా, సరికొత్త మోటారు వాహనాల చట్టం ద్వారా అవ్యవస్థను ఊడ్చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించినా జరిగిందీ ఒరిగిందీ ఏమీ లేదు. వాహన వేగాన్ని 5 శాతం తగ్గించ గలిగినా ప్రమాద మరణాల్ని 30 శాతం దాకా నియంత్రించగల వీలుందని తెలిసినా 'ఏడెనిమిది సెకన్లలోనే 100 కిలో మీటర్ల వేగం' అందుకొనే శకటాలు ఎందుకు రోడ్డెక్కుతున్నట్లు?

ఇకపోతే వాయు కాలుష్య భూతం భయపెడుతోంది. శారీరక మానసిక సమస్యలు పెంచి, ఏటా లక్షల కుటుంబాల్లో శోక సంద్రాల్ని ఉప్పొంగిస్తున్న వాయు కాలుష్య భూతం గర్భస్థ పిండాల్ని సైతం కర్కశంగా కాటేస్తోంది. వాయు కాలుష్యంతో పోటీపడుతూ... గాలిలో, నీటిలో, భూమిపై అంతటా పరుచుకుంటున్న ప్లాస్టిక్ వ్యర్థాలు ఆరోగ్య, ఆహార రంగాల్లో పెను సంక్షోభం సృష్టిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు గాలిలో ఉన్నా, భూగర్భ జలాల్లోకి చేరినా ప్రమాదమే. అవి మనుషుల దేహాల్లోకి చొచ్చుకుపోయి, శరీర కణాలను దెబ్బతీస్తాయనీ, క్యాన్సర్ల ముప్పు పెచ్చరిల్లుతుందనీ ఇప్పటికే పలు దేశాల శాస్త్రవేత్తలు, పరిశోధకులు హెచ్చరించారు.

అందుకే అంబేడ్కర్ ఆశయాలు రాజ్యాంగంలో ప్రతిఫలిస్తున్నాయా అన్నది పెద్ద ప్రశ్నగా మిగిలింది. నిజానికి రాజ్యాంగంలో ఆయన ఆలోచనలు ప్రతిఫలిస్తే 100 శాతం అక్షరాస్యత ఏర్పడుతుంది. విద్య మహోన్నత స్థాయికి చేరుతుంది. ప్రపంచం గర్వించే మేధో సంపన్నులు ఆవిర్భవిస్తారు. పేదరిక నిర్మూలన జరిగి, సమ సమాజం ఏర్పడుతుంది. స్త్రీలు ఆత్మ రక్షణతో, పురుషులతో సమానంగా జీవించగలుగుతారు. యువత శక్తి సంపన్నులై సంపదను సృష్టించగలుగుతారు. నిరుద్యోగం, పేదరికం లేని సమ సమాజం ఏర్పడుతుంది. అందుకే రాజ్యాంగ మార్గంలో నడుద్దాం!

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు | 98497 41695

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### మళ్లీ జంపా?

ఇండియా కూటమితో నితీశ్ కుమార్ విసిగిపోయారనేది స్పష్టం. కానీ కూటమి ఇవ్వలేనిది బీజేపీ ఏమిస్తుంది? డబ్బు? ఆయనకు కుటుంబం లేదు కాబట్టి డబ్బు కాకపోవచ్చు. అధికారమా? బీజేపీ/ఎన్డీఏలో మోదీకి తప్ప ఎవరికీ అధికారం ఉండదు. కూటమి కన్వీనర్ కానందుకు ప్రతీకారమా? ఇదైతే కావొచ్చు. ఏమైనా ఆయన ఒక నవ్వులాటగా మారిపోతారు.

– సబా నఖ్వీ, కాలమిస్ట్

### ఇదెక్కడి ద్రోహం?

పశ్చిమ బెంగాల్లో తృణమూల్ ఒంటరిగా పోటీ చేయనుంది. యూపీలో కాంగ్రెస్‌కు ఎస్పీ 3 సీట్లు ఇస్తోంది. మహారాష్ట్రలో ఉద్ధవ్ 23 సీట్లలో పోటీ చేయనున్నారు. తమిళనాడులో కాంగ్రెస్‌కు డీఎంకే 8 సీట్లు ఇస్తోంది. చూస్తుంటే బీజేపీ కాదు, కాంగ్రెస్ విముక్త భారతం కోసం ఇండియా కూటమే పనిచేస్తోంది.

– రిపీ బాగ్రీ, వ్యాఖ్యాత

### వాళ్లకే హీరో

అయోధ్యలోని అసలు ఆలయాన్ని కూల్చిన దురాక్రమణదారు ఉజ్బెకిస్తాన్ దేశస్థుడు. కానీ కొత్తగా ప్రారంభించిన రామాలయం గురించి అక్కడి మీడియా ఒక్క చెడు మాట కూడా రాయలేదు. బాబర్ ఇప్పుడు వాళ్ల హీరో కాదు. కేవలం పాశ్చాత్యులు, పాకిస్తానీలు, ఇండియాలోని ఇస్లామిస్టులు, భారత నాగరికతనే సమస్యగా భావించే స్థానిక 'ఉదారుల'కు మాత్రమే ఆయన సైద్ధాంతిక హీరో.

– సూర్య కానేగావ్‌కర్, కాలమిస్ట్

### అసలు వాస్తవం

రెండు వందల ఏళ్ల క్రితంతో పోలిస్తే, ఇండియా ఇప్పుడు మరింత శక్తిమంతంగా ఉంది. అదే సమయంలో చరిత్రలో తొలిసారి ఇండియా పక్కలోనే ఒక సూపర్ పవర్ ఎదుగుతోంది. ఇది అన్నింటికంటే ఎక్కువగా, విశ్వవ్యాప్తంగా ఎదుగుతున్న ఇండియా స్థానికంగా బలహీనపడుతోందని మాత్రమే వివరిస్తుంది.

– హేపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

### ఒక్క దేవుడేనా?

కొత్త హిందుత్వ నియమాల ప్రకారం మనం దేవతలను కూడా పూజించవచ్చా, లేక కేవలం రాముడినే పూజించాలా? ఎవరి దగ్గరైనా మేనిఫెస్టో ఉందా?

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

# అయోధ్యలో ఆధ్యాత్మిక శోభ

భారతదేశంలో, ప్రస్తుత అయోధ్యలోని ఆధ్యాత్మిక పరిణామాలను అవలోకిస్తే కని విని ఎరుగని భావోత్తేజం దేశంలో నెలకొందని స్పష్టమవుతోంది. జాతిని నడిపించే ఉన్నత మేధావి వర్గం, సమాజాన్ని ప్రభావితం చేయడం ఏ దేశంలో అయినా, ఏ శతాబ్దంలో అయినా సహజమే అయినా... ప్రస్తుత భారతావనిలో రూపుదిద్దుకొంటున్న వినూత్న ప్రాణప్రతిష్ఠలు, ప్రభుత్వాధినేతల ఆధ్యాత్మిక ఉద్విగ్నతలు భవిష్య భారతావనిని ఎలా ప్రభావితం చేస్తాయో అగమ్య గోచరంగా ఉంది. భారత జాతి ఆధ్యాత్మిక ఔన్నత్యానికి శ్రీరాముడు ప్రతీకగా, సదా ఆరాధ్యనీయుడనడంలో సందేహం లేదు.



సరయూ నదీ తీరంలోని అయోధ్యా పురి ప్రాశస్త్యం, పౌరాణిక పవిత్రత, చారిత్రక ప్రాధాన్యత, మర్యాదా పురుషోత్తముని జీవన కథనం విశ్వ మానవ సమాజానికి సదా ఆదర్శనీయమే. శ్రీమద్రామాయణం సర్వజన శ్రేయోదాయకం, సర్వ మంగళప్రదంగా నేటికీ శిరోధార్యం. అత్యాధునిక సాంకేతిక ప్రపంచం, మానవాళిని నడిపిస్తున్న ఈ 21వ శతాబ్దంలో, అయోధ్యా భారతం సృష్టిస్తున్న ఆధ్యాత్మిక చైతన్యాన్నీ, కేంద్ర ప్రభుత్వాధినేతల పాలనా వ్యవహార శైలినీ, ప్రపంచంలోని మతాధికార మతోన్మత్తత ఏ విధంగా స్వీకరిస్తుందో వేచి చూడవలసినదే. స్వేచ్ఛా, స్వాతంత్య్రాల సాధన కోసం పరితపించిన ఉద్యమాలూ, పోరాటాలూ జాతీయతను ప్రధాన ప్రాతిపదికగా చేసుకుని అనేక స్వతంత్ర దేశాలు ఆవిర్భవించాయి. ఈ జాతీయత ఒకానొక దశలో ప్రపంచ యుద్ధాలకు దారి తీసింది. విశ్వమానవ భావన దారితప్పింది. ఐక్యరాజ్య సమితి వైఫల్యం కొట్టొచ్చినట్టు స్పష్టమవుతోంది. దానికి తోడు, ప్రతీ దేశం అణ్వాయుధాల కోసం అర్రులు చాస్తూ, అగ్ర రాజ్యాధిపత్యానికి అడుగులకు మడుగులొత్తుతూ వ్యవహరిస్తోంది. దేశభక్తి ఆవశ్యకత క్రమేపీ స్వతంత్ర రాజ్యాల అవతరణ తర్వాత కొంత కుంటుపడటంతో, ఆ యా దేశాల పాలకులు తమ దేశాల సార్వభౌమత్వాలు కోల్పోకుండా అప్రమత్తతో వ్యవహరించక తప్పడం లేదు. దేశభద్రత, సమగ్రత, జన శ్రేయస్సు ప్రతీ దేశానికి అత్యంత ముఖ్యమైన అంశాలు అయ్యాయి. అమెరికా, చైనా, రష్యా, ఇండియా... ఇలా ఏ దేశమైనా అణ్వాయుధ సంపత్తి సమకూర్చుకోవడంలో పోటీ పడటం లేదా సహకారం పొందటం, ఆశ్రయ దేశాలను ఆదుకోవడం ప్రస్తుత వర్తమానాంశం.

ప్రస్తుతం మన దేశంలో శ్రీరామ నామం ప్రతిధ్వనిస్తోంది. స్వయంగా దేశ ప్రధాని, అయోధ్య ఆధ్యాత్మిక సుసంపన్నత ప్రచారానికి సారథ్యం వహిస్తున్నారు. ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. చారిత్రక చీకటి కోణాలలో ప్రభవించిన దుష్టపాలనా శక్తి కారణంగా తలఎత్తిన చారిత్రక పరిణామాలలో అయోధ్య ఒక అధ్యాయం సృష్టించింది. చారిత్రక దుష్కృతికి ఉపశమనం, ఊరట లభించింది. భవ్య మహా మందిరంలో చిన్నారి రాముడు ప్రవేశించడం భారతీయ ఆధ్యాత్మిక పునరుజ్జీవనకు ప్రాణ ప్రతిష్ఠ చేసినట్టే. శాంతి, అహింస, సహనం, సమానత్వం, సర్వజన సంక్షేమం శ్రీరామరాజ్యం లక్ష్యంగా జాతిపిత మహాత్ముడు అభిలషించారు. ఆధ్యాత్మిక దీప్తి ప్రసరింప చేస్తున్న అయోధ్య పునరుజ్జీవనం... అణు విధ్వంసక శత్రు సమరాంగణాలలో చిక్కుకున్న ప్రపంచ మానవాళికి సందేశం అందిస్తోంది.

– జయసూర్య, సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 90149 48336



# భారత్ దశ, దిశ మారిన రోజు

అభిప్రాయం



బి.ఎస్. రాములు

భారత్‌కు స్వాతంత్య్రం వచ్చిన తర్వాత మన పరిపాలన, న్యాయ వ్యవస్థ, రాజకీయ ప్రతినిధులు, చట్టసభలు ఎలా ఉండాలో... పౌరుల హక్కులు, బాధ్యతలు ఏమిటో అని నిర్ణయించిన రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు 1950 జనవరి 26. స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం, అందరికీ ఓటు; కుల, మత, ప్రాంతీయ, జాతుల వివక్షలు వంటివాటిని తొలగించుకొని భారత ప్రజలు నూతన సమాజంగా రూపుదిద్దు కోవడానికి రాజ్యాంగ బద్ధంగా కృషి చేయాలని నిర్ణయించుకున్న రోజు అది. అందువల్ల పౌరులందరూ రాజ్యాంగాన్ని తెలుసుకోవాలి. అర్థం చేసుకోవాలి. తమ హక్కులేమిటో, కర్తవ్యాలేమిటో తెలుసుకోవడం అవసరం.

భారత రాజ్యాంగంలో మొత్తం 395 ఆర్టికల్స్ ఉన్నాయి. ప్రభుత్వాలు ఎలా ఏర్పడుతున్నాయి, ఎలా పని చేస్తున్నాయి, ఓటు హక్కు ద్వారానే ఈ మొత్తం పరిపాలన వ్యవస్థ ఎలా నిర్దేశించబడుతున్నదో రాజ్యాంగం చదివితే తెలుస్తుంది.

భారత రాజ్యాంగం విశిష్టతను ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు సరిగ్గా గుర్తించడం లేదు. భారత రాజ్యాంగం మనుషులందరినీ సమానం చేసింది. ప్రతి మనిషికీ ఒకే విలువ, ఒకే ఓటు అని స్థిరపర్చింది. 1950 జనవరి 26 నుంచి ఇది మన తాత్విక భూమికగా మారింది. దాంతో రాజ్యాంగ బద్ధంగా మనుషులందరూ సమానమయ్యారు. అంతకుముందు భారతీయులందరూ విభిన్న కులాలుగా, వర్ణాలుగా, వర్గాలుగా, తెగలుగా, జాతులుగా అనేక అసమానతలకూ, వివక్షలకూ, వెలివేతలకూ, పీడనలకూ, అణచివేతలకూ గురయ్యేవారు. ఇందుకు తత్వశాస్త్రాలూ, పురాణ– ఇతిహాసాలూ, మనుస్మృతిలో పేర్కొన్న అంశాలను ప్రాతిపదికలుగా భావించారు.

ప్రతి మనిషికీ ఒకే విలువ, ఒకే ఓటు అనేది ఎంతో గొప్ప తాత్వికతతో కూడిన అంశం. దీన్ని బలంగా జీవితమంతా అన్ని రంగాల్లోకీ విస్తరింప జేసిన దార్శనికుడు డా॥ బీఆర్ అంబేడ్కర్. వేల ఏళ్ళుగా ఎందరో తత్వవేత్తలు ఎన్నో సిద్ధాంతాలు ప్రతిపాదించారు. వాటన్నిటి కన్నా అత్యంత వాస్తవికమైన తాత్వికత కలది భారత రాజ్యాంగం. దీని ప్రాధాన్యతను బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలు గుర్తించాలి. ఇతర దేశాల్లో అనేక ఉద్యమాల తర్వాత సార్వత్రిక వయోజన ఓటు హక్కు కల్పించబడింది. మరీ ముఖ్యంగా మహిళలకు ఎంతో ఆలస్యంగా ఓటు హక్కు కల్పించారు. కానీ భారత దేశంలో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల నుంచే సార్వ జనీన ఓటు హక్కు ఇచ్చింది భారత రాజ్యాంగం.

ప్రభుత్వ ఉద్యోగ, విద్యా రంగాలలో వెనుకబడిన సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కల్పించింది. విద్య ప్రాముఖ్యతను గుర్తించి అందరికీ చదువుకోవడానికి అవకాశం కల్పిస్తూ చదువుకోవడాన్ని ప్రాథమిక హక్కుగా ప్రకటించింది రాజ్యాంగం. 'లార్డ్ మౌంట్ బాటన్ ప్రణాళిక'ను అనుసరించి బ్రిటిష్ పార్లమెంట్ భారత స్వాతంత్య్ర చట్టాన్ని 1947 జులై 5న ఆమోదించింది. ఇది 1947 జులై 18న బ్రిటిష్ రాణి ఆమోదాన్ని పొందింది. చివరకు ఈ చట్టం 1947 ఆగష్టు 15 నుంచి అమలులోకి వచ్చింది. భారత స్వాతంత్య్ర చట్టాన్ని పురస్కరించుకొని, ఇండియా, పాకిస్తాన్ అనే రెండు స్వతంత్ర దేశాలు అవతరించాయి. అప్పటికే భారత రాజ్యాంగ సభ ఏర్పడి రాజ్యాంగ రచనకు శ్రీకారం చుట్టింది.



రాజ్యాంగ పరిషత్ సమావేశంలో చర్చలు

అంబేడ్కర్ రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా 1948, జనవరి నెలలో తొలి ముసాయిదా ప్రతి (చిత్తు ప్రతి) విడుదల అయ్యింది. ఆ ముసాయిదాకు వివిధ వర్గాల నుండి, ప్రజల నుండి వేలకొలది సవరణల ప్రతిపాదనలు వచ్చాయి. వాటిపై రాజ్యాంగ ఉప సంఘం చర్చించి కొన్ని సవరణలకు ఆమోదం తెలిపింది. చివరకు 1949 నవంబర్ 26న నూతన రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. 1950 జనవరి 26 నుండి రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ఆ రోజునే గణతంత్ర దినం అంటున్నాం. ఇది భారత్ దశ, దిశలను మార్చిన రోజు.

వ్యాసకర్త తెలంగాణ బీసీ కమిషన్ తొలి చైర్మన్
మొబైల్: 83319 66987

# వైరాగ్యం

సామాన్యుడి ఆరాటాలకూ, ఆందోళనలకూ మంచి మందు ఒకింత వైరాగ్యం. కానీ ప్రాపంచిక విషయాల మీద 'రక్తి'లో మునిగి తేలే వాడికి, రమ్మనగానే విరక్తి రాదు కదా? అది గట్టి సాధన ద్వారా సాధించాల్సిన స్థితి. కొన్ని సందర్భాలలో మాత్రం, మనుషులకు వద్దన్నా వైరాగ్యం కలుగుతుంది. కానీ అది తాత్కాలికం. చూస్తుండగానే ఆ విరక్తి కాస్తా ఆవిరయిపోతుంది. అలాంటివి ముఖ్యంగా మూడు సందర్భాలు చెప్తారు పెద్దలు: ప్రసూతి వైరాగ్యం, శ్మశాన వైరాగ్యం, పురాణ వైరాగ్యం.

జ్యోతిర్మయం

ప్రసూతి వైరాగ్యం పాత కాలం మాట. నూరేళ్ళ క్రితం, వైద్య సదుపాయాలేవీ లేని రోజుల్లో, స్త్రీలకు ప్రసవమంటే ప్రాణగండంగా ఉండేది. ఎన్నో ప్రసవాలు తల్లికో, బిడ్డకో ప్రాణ హాని కలిగించేవి. ప్రసవ సమయపు యాతనలూ, దుఃఖాంతమైన ప్రసవాలూ, ప్రసవానంతరం తలెత్తే ఆరోగ్య సమస్యలూ అనుభవించే వారికే కాక, వాళ్ళ కుటుంబీకులకు గూడా జీవితమంటే విరక్తి కలిగించేవి. కానీ ఆ వైరాగ్యాలు నిలిచేవి కావు. అందుకే సంవత్సరం తిరక్కుండా మళ్ళీ సీమంతాలూ, సంబరాలూ, ప్రసవాలూ!

సన్నిహిత బంధువుల మృతదేహాలనూ, శ్మశానంలో జరిగే శవదహన కాండలనూ చూసినప్పుడు కూడా వైరాగ్యం ముసురుకొంటుంది. 'బతికున్నన్నాళ్లూ ఆరాట పడటమే గానీ, అసలు జీవితంలో ఏముంది? ఇది క్షణ భంగురం, వెంట వెళ్ళేదేమీ ఉండదు' అనిపిస్తుంది. కానీ త్వరలోనే ఈ వైరాగ్యం మనల్ని వీడుతుంది.

అంతదాకా ఎందుకు? గుడికి వెళ్ళి, అక్కడ ఏ పాండవ వనవాస ఘట్టమో, పాదుకా పట్టాభిషేకమో పురాణంగా వింటేనే, శ్రోతలకు ప్రాపంచిక జీవితం పట్ల కొంత విరక్తి కలుగుతుంది. గుడి నుంచి ఇంటికి తిరిగొచ్చేదాకా 'ఏది శాశ్వతం?' అంటూ వైరాగ్యపు మాటలూ, ఆలోచనలూ నడుస్తాయి. కానీ స్వగృహం చేరేసరికల్లా, ఈ 'పురాణ వైరాగ్యం' చల్లబడి సెలవు పుచ్చుకొంటుంది.

అశాశ్వతమని తెలిసిన విషయాల గురించి మితిమీరి తాపత్రయపడేవాడికి దుఃఖం తప్పదు. ప్రాపంచిక వ్యవహారాలలో తామరాకు మీద నీటిబొట్టులా, నిర్లిప్తంగా ఉండే ధన్యుడే ఆనందంగా ఉండగలడు అని చెప్పేది వేదాంతులే కాదు, జీవితానుభవం కూడా!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.12.03 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** పుష్యమి ఉ.9.55 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** రా.11.54 నుండి 1.38 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.49 నుండి 9.37 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.23 వరకు, **అమృతఘడియలు:** లేవు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.48.

# టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి

- మరో ఐదుగురు సభ్యుల నియామకం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు గవర్నర్ ఆమోదం
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి




సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ (టీఎస్‌పీఎస్సీ)గా రాష్ట్ర మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి నియమితులయ్యారు. అదేవిధంగా కమిషన్‌లో పది మంది సభ్యుల నియామకానికి అవకాశం ఉండగా.. ప్రభుత్వం చేసిన ప్రతిపాదనల మేరకు ఐదుగురిని సభ్యులుగా నియమించడానికి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ఆమోదం తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా నియమితులైన చైర్మన్, సభ్యుల పదవీ కాలం ఆరేళ్ల పాటు ఉంటుంది. అయితే 62 ఏళ్లు పైబడిన వారు పదవీ విరమణ పొందాల్సి ఉంటుంది.

### దరఖాస్తులు స్వీకరించి.. సెర్చ్ కమిటీ వేసి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన దిశగా చర్యలు వేగవంతం చేసింది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం, తదనంతర పరిణామాల నేపథ్యంలో గతంలో కమిషన్ చైర్మన్‌గా వ్యవహరించిన బి.జనార్ధన్‌రెడ్డి డిసెంబర్‌లో రాజీనామా చేశారు. ఆ తర్వాత ఐదుగురు సభ్యులు కూడా రాజీనామా చేయడంతో కొత్తగా చైర్మన్, సభ్యుల నియామకం అనివార్యమైంది. ఈ నేపథ్యంలోనే వివిధ రాష్ట్రాల్లో పీఎస్సీల పనితీరును అధ్యయనం చేయాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తాను స్వయంగా యూపీఎస్సీ చైర్మన్‌తో సమావేశమై టీఎస్‌పీఎస్సీ నిర్వహణకు సలహాలు సూచనలు కోరారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల ఎంపిక ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. వాటి పరిశీలనకు సెర్చ్ కమిటీని ఏర్పాటు చేసింది. దరఖాస్తుల వడపోత అనంతరం సెర్చ్ కమిటీ చైర్మన్, సభ్యుల కోసం కొన్ని పేర్లను ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు సమాచారం. కాగా ఈ మేరకు రాష్ట్ర సర్కారు చేసిన ప్రతిపాదనలకు గవర్నర్ తమిళిసై ఆమోదం తెలిపారు.

### 36 ఏళ్ల సుదీర్ఘ అనుభవం

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా నియమితులైన మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. 1962 డిసెంబర్ 3న ఆయన జన్మించారు. దాదాపు 36 సంవత్సరాల పాటు సర్వీసులో కొనసాగిన మహేందర్‌రెడ్డి 2022 డిసెంబర్ నెలాఖరులో పదవీ విరమణ చేశారు.

### టీఎస్‌పీఎస్సీ టీమ్ ఇదే

చైర్మన్: ఎం.మహేందర్‌రెడ్డి(రిటైర్డ్ ఐపీఎస్)
సభ్యులు: అనితా రాజేంద్ర (రిటైర్డ్ ఐఏఎస్), అమిర్ ఉల్లా ఖాన్, (రిటైర్డ్ ఇండియన్ పోస్టల్ సర్వీస్), ప్రొఫెసర్ నర్రి యాదయ్య, యరబడి రామ్మోహన్‌రావు, పాల్వాయి రజినీకుమారి

## టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల బయోడేటాలు



పేరు: ఎం.మహేందర్ రెడ్డి
స్వస్థలం : ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం కిష్టాపురం గ్రామం
పుట్టిన తేదీ : 1962 డిసెంబర్ 3
సామాజికవర్గం: రెడ్డి (ఓసీ)
విద్యార్హతలు: ఆర్ఈసీ వరంగల్ నుంచి బీటెక్ (సివిల్), ఐఐటీ ఢిల్లీ నుంచి ఎంటెక్
హోదా: రిటైర్డ్ డీజీపీ (2022 డిసెంబర్) (1986 బ్యాచ్ ఐపీఎస్)



పేరు: అమిర్ ఉల్లా ఖాన్ స్వస్థలం : హైదరాబాద్
సామాజికవర్గం : ముస్లిం వయస్సు: 58 ఏళ్లు
అనుభవం: యూఎన్‌డీపీలో పనిచేస్తున్నారు. ఉర్దూ వర్సిటీ, నల్సార్, ఐఎస్‌బీ, ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో విజిటింగ్ ప్రొఫెసర్.
హోదా: ఇండియన్ పోస్టల్ ఉద్యోగానికి రాజీనామా



పేరు: వై.రామ్మోహన్‌రావు
స్వస్థలం : హైదరాబాద్
పుట్టిన తేదీ : 1963 ఏప్రిల్ 4
సామాజికవర్గం : ఎస్టీ–ఎరుకల
విద్యార్హతలు: బీఈ, ఎంబీఏ
హోదా: ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తెలంగాణ జెన్‌కో



పేరు: అనితా రాజేంద్ర
స్వస్థలం : రంగారెడ్డి జిల్లా కిస్మత్‌పూర్
పుట్టిన తేదీ : 1963 ఫిబ్రవరి 04, బీసీ–బీ (గౌడ)
విద్యార్హతలు: బీకాం, ఎంఏ, ఎల్‌ఎల్‌ఎం
హోదా: రిటైర్డ్ ఐఏఎస్



పేరు: పాల్వాయి రజినీకుమారి
స్వస్థలం : సూర్యాపేట
పుట్టిన తేదీ: 06–05–1972, ఎస్సీ మాదిగ
విద్యార్హతలు: ఎంఏ, బీఈడీ, ఎల్‌ఎల్‌బీ
హోదా: టీచర్, వీడీఓ, మున్సిపల్ కమిషనర్



పేరు: డాక్టర్ నర్రి యాదయ్య
స్వస్థలం: మల్లారెడ్డిగూడెం, యాద్రాది భువనగిరి జిల్లా
పుట్టిన తేదీ : 1964–4–10
సామాజికవర్గం: బీసీ–బీ(కురుమ)
విద్యార్హతలు: ఎంటెక్ , పీహెచ్‌డీ
హోదా: సీనియర్ ప్రొఫెసర్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి

# అత్యంత పారదర్శకంగా టీఎస్‌పీఎస్సీ నియామకాలు

రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకంలో అత్యంత పారదర్శకంగా వ్యవహరించినట్టు ప్రభుత్వం ప్రకటించింది. సెర్చ్‌కమిటీకి పూర్తి అధికారాలను అప్పగించి సమర్థులకు అవకాశం కల్పించినట్టు పేర్కొంది. 'సుదీర్ఘ అనుభవం కలిగిన సివిల్ సర్వెంట్లు, విద్యావేత్తలకు ఈసారి బోర్డులో ప్రభుత్వం అవకాశం కల్పించింది. సామాజిక సమతుల్యతను పాటించింది. గతంలో ఎన్నడూ అవకాశం దక్కని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా నియామకాలు చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచే టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. రాజకీయ ప్రమేయం లేకుండా నియామకాలను ప్రభుత్వం పూర్తి చేసింది..' అని వివరించింది. చైర్మన్ పదవికి తొలుత రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పేరును ప్రభుత్వం పరిశీలించినా, చైర్మన్ పదవికి గరిష్ఠ వయస్సు 62 ఏళ్లు కాగా, ఆయన వయోపరిమితి అనుకూలంగా లేకపోవడంతో వీలు పడలేదు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేరు కూడా పరిశీలనకు రాగా, ఆయన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండటం, రాజకీయాల్లో కొనసాగాలని నిర్ణయించుకోవడంతో చివరకు రిటైర్డ్ డీజీపీ మహేందర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది.

# వైద్య, ఆరోగ్యశాఖ బీసీ ఉద్యోగుల సంఘ కార్యవర్గం

రాష్ట్ర అధ్యక్షునిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నారాయణ

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్యశాఖ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా బి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా టి.నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని వైద్య, ఆరోగ్యశాఖ డైరెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని వైద్య ఆరోగ్యశాఖ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు 19 మందితో కూడిన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. అనంతరం జాజుల మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని, బీసీ ఉద్యోగులకు పదోన్నతులు, రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీలపై విధించిన క్రీమీలేయర్‌ను ఎత్తివేయాలని, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను 50 శాతం పెంచాలని, వైద్య ఆరోగ్యశాఖలో రేషనలైజేషన్ పేరుతో తీసుకువచ్చిన 142వ జీవోను రద్దు చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల హక్కుల కోసం సంఘటితంగా ముందుకు వెళ్తామని చెప్పారు.


# 29, 30 తేదీల్లో 'అంబేడ్కర్' బీఎడ్ కౌన్సెలింగ్



బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) అడ్మిషన్ కౌన్సెలింగ్ ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయం నిర్వహించిన బీఎడ్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు, రెండు తెలుగు రాష్ట్రాల్లోని అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ కోసం హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయం ప్రాంగణంలో అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. 29వ తేదీన వీఐ, హెచ్ఐ, 30వ తేదీన ఐఆర్, అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ పోర్టల్‌ను సందర్శించాలన్నారు.

# 'వ్యూహం'పై 30న వాదనలు పూర్తి

హైకోర్టు స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: రాంగోపాల్ వర్మ దర్శకత్వం వహించిన 'వ్యూహం' చిత్రం విడుదలకు సంబంధించి దాఖలైన అప్పీల్‌పై ఈ నెల 30న వాదనలు ప్రారంభించి.. అదేరోజు పూర్తి చేస్తామని సీజే ధర్మాసనం స్పష్టం చేసింది. వ్యూహం చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఇచ్చిన సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఈ నెల 22న తీర్పునివ్వడం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ తెలంగాణ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సినిమా విడుదల కాకుండానే, ట్రైలర్ చూసి అడ్డుకునే ప్రయత్నం చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఎలాంటి జ్యుడీషియల్ ఎంటిటీ(న్యాయ సంస్థ) లేని రాజకీయ పార్టీకి అసలు పిటిషన్ వేసే అర్హతే లేదని వాదించారు. సింగిల్ జడ్జి తీర్పు సినిమాటోగ్రఫీ చట్టానికి విరుద్ధంగా ఉందని చెప్పారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. పూర్తి వాదనలను 30న వింటామని స్పష్టం చేసింది. దీనికి వాద, ప్రతివాదుల తరఫు న్యాయవాదులు అంగీకరించడంతో వాదనలను వాయిదా వేసింది. సీబీఎఫ్‌సీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నరసింహ శర్మ వాదనలు వినిపిస్తూ.. చట్ట ప్రకారం అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే సీబీఎఫ్‌సీ ఏర్పాటు చేసిన రివైజింగ్ కమిటీ 'వ్యూహం' చిత్రానికి ఏకగ్రీవంగా సర్టిఫికెట్ జారీ చేసిందని వివరించారు.

# బీజేపీ వైపు... నితీశ్ చూపు!

## ఇండియా కూటమికి గుడ్‌బై!

- మళ్లీ బీజేపీతో జేడీ(యూ) జట్టు?
- అదే జరిగితే కూటమి విచ్ఛిన్నమే!
- బిహార్లో అధికార కూటమికీ షాక్
- లాలూ, నితీశ్ పోటాపోటీ భేటీలు
- అసెంబ్లీ రద్దు దిశగా పరిణామాలు!



**పట్నా/న్యూఢిల్లీ:** కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమికి రెండు రోజుల్లోనే మూడో భారీ ఎదురుదెబ్బ! కీలక భాగస్వామి అయిన జేడీ(యూ) అధ్యక్షుడు, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ కూటమికి కటీఫ్ చెప్పేలా కన్పిస్తున్నారు. అవసరార్థపు గోడ దూకుళ్లకు పెట్టింది పేరైన ఆయన 2024 లోక్‌సభ ఎన్నికల ముంగిట యూ టర్న్ తీసుకుని మళ్లీ బీజేపీతో జట్టు కట్టే దిశగా సాగుతున్నారు. ఈ దిశగా బుధవారం నుంచీ జరుగుతున్న వరుస పరిణామాలతో బిహార్లో ఆర్జేడీ, జేడీ(యూ), కాంగ్రెస్, వామపక్షాల మహాఘట్‌బంధన్ సంకీర్ణ సర్కారు కూడా కుప్పకూలేలా కన్పిస్తోంది. ఘట్‌బంధన్‌తో 18 నెలల కలహాల కాపురానికి ఫుల్‌స్టాప్ పెట్టి బీజేపీ మద్దతుతో మరోసారి సీఎం పీఠం కాపాడుకునే ప్రయత్నాలకు నితీశ్ పదును పెట్టారంటూ వార్తలు వస్తున్నాయి. ప్రతిగా ఆర్జేడీ కూడా జేడీ(యూ)తో నిమిత్తం లేకుండా మెజారిటీ సాధనకు ప్రయత్నాలకు పదును పెట్టింది. ఈ దిశగా జేడీ(యూ) సీనియర్ నేతలతో నితీశ్ ఇంట్లో, ఘట్‌బంధన్‌లోని ఇతర పక్షాలతో ఆర్జేడీ చీఫ్ లాలుప్రసాద్ నివాసంలో పోటాపోటీ సమావేశాలతో గురువారం బిహార్ రాజధాని పట్నాలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. నితీశ్ నివాసంలో భేటీలో జేడీ(యూ) ఎమ్మెల్యేలంతా పాల్గొన్నారు. ఇక లాలు ఒకవైపు తన నివాసంలో భేటీ జరుగుండగానే మరోవైపు ఆర్జేడీకే చెందిన అసెంబ్లీ స్పీకర్ అవధ్ బిహారీ చౌధరితో కూడా ఫోన్లో మంతనాలు జరిపారు. దాంతో నితీశ్ మరింత అప్రమత్తమయ్యారు. ఆర్జేడీకి ప్రభుత్వ ఏర్పాటుకు చాన్సివ్వకుండా అవసరమైతే అసెంబ్లీని రద్దు చేయాలని కూడా ఆయన యోచిస్తున్నట్టు చెబుతున్నారు!

లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్లో కాంగ్రెస్‌తో పొత్తుండబోదని, ఒంటరిగానే పోటీ చేస్తామని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, పంజాబ్‌లో ఆప్‌దీ ఒంటరి పోరేనని ఆ రాష్ట్ర సీఎం భగవంత్ మాన్ బుధవారం ప్రకటించడం తెలిసిందే. దాంతో ఒక్కసారిగా డీలా పడ్డ ఇండియా కూటమిలో బిహార్ తాజా పరిణామాలు మరింత కలవరం రేపుతున్నాయి. నితీశ్ బీజేపీ గూటికి చేరితే విపక్ష కూటమి దాదాపుగా విచ్ఛిన్నమైనట్టేనని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్ జోడో న్యాయ్ యాత్రకు రెండు రోజుల విరామమిచ్చి ఢిల్లీ చేరిన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఈ పరిణామాలన్నింటిపై పార్టీ నేతలతో మంతనాల్లో మునిగిపోయారు. మరోవైపు బిహార్ బీజేపీ చీఫ్ సమ్రాట్ చౌదరి, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి అశ్వినీ చౌబేతో పాటు జేడీ(యూ) రాజకీయ సలహాదారు కేసీ త్యాగి కూడా ఒకే విమానంలో హుటాహుటిన ఢిల్లీ చేరుకున్నారు. దాంతో హస్తినలోనూ రాజకీయ వేడి తారస్థాయికి చేరుతోంది.



పావులు కదుపుతున్న లాలూ

### ఆదినుంచీ కలహాల కాపురమే...

బిహార్లో 2020లో ఏర్పాటైన మహాఘట్‌బంధన్ సంకీర్ణ సర్కారు నిత్యం కలహాలమయంగానే సాగుతూ వస్తోంది. ముఖ్యంగా తేజస్విని సీఎం చేసి తప్పుకోవాలని లాలు కొంతకాలంగా పట్టుబడుతుండటంపై నితీశ్ గుర్రుగా ఉన్నారు. జేడీ(యూ) తాజా మాజీ అధ్యక్షుడు లలన్ సింగ్ సాయంతో ఆ పార్టీ నుంచి డజను మంది ఎమ్మెల్యేలను లాగేసేందుకు లాలు ఇటీవల గట్టి ప్రయత్నమే చేశారు. దాన్ని సకాలంలో పసిగట్టిన నితీశ్ లలన్‌కు ఉద్వాసన పలికి తానే పార్టీ అధ్యక్ష పదవి చేపట్టారు. ఈ ఉదంతంతో ఆర్జేడీతో విభేదాలు తారస్థాయికి చేరాయి. లాలు, నితీశ్‌లిద్దరికీ రాజకీయ గురువైన బిహార్ దివంగత సీఎం కర్పూరి ఠాకూర్ శత జయంత్యుత్సవాల సందర్భంగా బుధవారం నితీశ్ చేసిన వ్యాఖ్యలు విభేదాలకు మరింతగా ఆజ్యం పోశాయి. పార్టీల్లో కుటుంబాల పెత్తనాన్ని కర్పూరి తీవ్రంగా వ్యతిరేకించేశారన్న నితీశ్ వ్యాఖ్యలు ఆర్జేడీని ఉద్దేశించినవేనంటూ లాలు కుటుంబం మండిపడింది. నితీశ్ అవకాశవాది అని తూర్పారబడుతూ లాలు కుమార్తె రోహిణీ ఆచార్య ఎక్స్‌లో పెట్టిన పోస్టులతో పరిస్థితి రసకందాయంలో పడింది. నితీశ్‌పై ఆమె విమర్శలను రాష్ట్ర బీజేపీ అగ్ర నేతలు తీవ్రంగా ఖండించడం, ఆ వెంటనే ఆ పార్టీతో జేడీ(యూ) దోస్తీ అంటూ వార్తలు రావడం... నితీశ్, లాలు నివాసాల్లో పోటాపోటీ సమావేశాల తదితర పరిణామాలు వెంటవెంటనే జరిగిపోయాయి.

### గిరిరాజ్ చెణుకులు

పదేపదే ఆర్జేడీపై అలగడం నితీశ్‌కు పరిపాటేనంటూ కేంద్ర మంత్రి, బీజేపీ అగ్ర నేత గిరిరాజ్‌సింగ్ విసిరిన చెణుకులు గురువారం వైరల్‌గా మారాయి. ''నే పుట్టింటికి వెళ్లిపోతా. నువ్వు చూస్తూ ఉండిపోతావ్ అని పాడుతూ లాలును నితీశ్ చీటికీమాటికీ బెదిరిస్తుంటారు. కానీ పుట్టింటి (బీజేపీ) తలుపులు తనకు శాశ్వతంగా మూసుకుపోయాయన్న వాస్తవాన్ని మాత్రం దాస్తుంటారు'' అంటూ తాజా పరిణామాలపై గిరిరాజ్ స్పందించారు.

### తెరపైకి మెజారిటీ లెక్కలు...

నితీశ్ బీజేపీ గూటికి చేరతారన్న వార్తల నేపథ్యంలో బిహార్ అసెంబ్లీలో బలాబలాలు మరోసారి తెరపైకొచ్చాయి. 243 మంది సభ్యుల అసెంబ్లీలో మెజారిటీ మార్కు 122. మహాఘట్‌బంధన్ ప్రస్తుత బలం 159. 45 మంది ఎమ్మెల్యేలున్న జేడీ(యూ) నిష్క్రమిస్తే ఆర్జేడీ (79), కాంగ్రెస్ (19), వామపక్షాల (16)తో కూటమి బలం 114కు పడిపోతుంది. అప్పుడు మెజారిటీకి మరో 8 మంది ఎమ్మెల్యేలు అవసరమవుతారు. జితిన్‌రాం మాంఝీ సారథ్యంలోని హెచ్ఏఎం (4), మజ్లిస్ (1), స్వతంత్ర ఎమ్మెల్యే (1) మద్దతు కూడగట్టినా 120కే చేరుతుంది. మెజారిటీకి మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కావాలి. ఈ నేపథ్యంలో మాంఝీ తదితరులతో పాటు జేడీ(యూ) అసంతృప్త ఎమ్మెల్యేలతో కూడా ఆర్జేడీ చీఫ్ లాలు జోరుగా మంతనాలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్జేడీకి చెందిన స్పీకర్ పాత్ర కూడా కీలకంగా మారేలా కన్పిస్తోంది. మరోవైపు బీజేపీ, జేడీ(యూ) కలిస్తే 123 మంది ఎమ్మెల్యేలతో మెజారిటీ మార్కును అలవోకగా దాటేస్తాయి. తద్వారా తానే సీఎంగా కొనసాగాలని నితీశ్ భావిస్తున్నట్టు సమాచారం. కానీ అందుకు బీజేపీ సుముఖంగా లేదని, తమకే సీఎం చాన్సివ్వాలని భావిస్తోందని చెబుతున్నారు. అందుకు నితీశ్ అంగీకరించే పక్షంలో ఆయనను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**బిహార్ అసెంబ్లీలో ప్రస్తుత బలాబలాలు**

| మొత్తం స్థానాలు | 243 |
|---|---|
| ఆర్జేడీ | 79 |
| బీజేపీ | 78 |
| జేడీ(యూ) | 45 |
| కాంగ్రెస్ | 19 |
| వామపక్షాలు | 16 |
| హెచ్ఏఎం(ఎస్) | 4 |
| మజ్లిస్ | 1 |
| స్వతంత్రుడు | 1 |

### గోడదూకుళ్లలో ఘనాపాఠి

రాజకీయ గాలికి స్వీయ ప్రయోజనాలకు అనుగుణంగా మంచినీళ్ల ప్రాయంగా కూటములను మార్చడంలో నితీశ్‌కుమార్ సిద్ధహస్తుడు. దాంతో ఆయన్ను పల్టూ (పిల్లి మొగ్గల) కుమార్‌గా పిలవడం పరిపాటిగా మారింది. బీజేపీ వాజ్‌పేయీ, అద్వానీల సారథ్యంలో సాగినంత కాలం ఆ పార్టీతో నితీశ్ బంధం అవిచ్ఛిన్నంగా సాగింది. వారి శకం ముగిసి నరేంద్ర మోదీ తెరపైకి రావడంతో పొరపొచ్చాలు మొదలయ్యాయి. ఆయన్ను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడంతో బీజేపీతో 17 ఏళ్ల బంధానికి 2013లో తొలిసారిగా గుడ్‌బై చెప్పారు. 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత బిహార్ సీఎంగా తప్పుకుని జితిన్‌రాం మాంఝీని గద్దెనెక్కించారు. తన బద్ధ విరోధి అయిన లాలు సారథ్యంలోని ఆర్జేడీతో పొత్తు ద్వారా సర్కారును కాపాడుకున్నారు. 2015లో ఆర్జేడీ, కాంగ్రెస్‌లతో మహాఘట్‌బంధన్‌గా అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లారు. ఘనవిజయం సాధించి మళ్లీ సీఎం అయ్యారు. కానీ సంఖ్యాబలంలో ఆర్జేడీ పెద్ద పార్టీగా అవతరించడంతో నితీశ్ ప్రాధాన్యం తగ్గుతూ వచ్చింది. లాలు కుమారుడు తేజస్విని అయిష్టంగానే డిప్యూటీ సీఎం చేయాల్సి వచ్చింది. రెండేళ్లలోపే కూటమిలో పొరపొచ్చాలు పెద్దవయ్యాయి. సరిగ్గా అదే సమయంలో లాలు, తేజస్విలపై సీబీఐ కేసులు నితీశ్‌కు అందివచ్చాయి. డిప్యూటీ సీఎం పోస్టుకు రాజీనామా చేసేందుకు తేజస్వి ససేమిరా అనడంతో తానే సీఎం పదవికి రాజీనామా చేసి 2017లో కూటమి సర్కారును కుప్పకూల్చారు. గంటల వ్యవధిలోనే బీజేపీ మద్దతుతో మళ్లీ గద్దెనెక్కి ఔరా అనిపించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ విజయంతో నితీశ్ మళ్లీ సీఎం అయ్యారు. కానీ ఈసారి బీజేపీ పెద్ద పార్టీగా అవతరించడంతో ఏ విషయంలోనూ తన మాట సాగక ఉక్కపోతకు గురయ్యారు. చివరికి జేడీ(యూ)ను చీల్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందంటూ 2022 ఆగస్టులో దానికి గుడ్‌బై చెప్పారు. మర్నాడే ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో మహాఘట్‌బంధన్ సర్కారు ఏర్పాటు చేసి సీఎం పీఠం కాపాడుకున్నారు. తాజాగా నితీశ్ మళ్లీ బీజేపీ వైపు చూస్తున్నారన్న వార్తలు నిజమైతే ఇది ఆయనకు ఐదో పిల్లిమొగ్గ అవుతుంది!



గురువారం జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

# వారసత్వ ప్రతీక రామమందిరం

**రామమందిర నిర్మాణ ఘట్టం చరిత్రలో నిలిచిపోతుంది**
**గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ప్రసంగం**

**న్యూఢిల్లీ:** భారత్ తన పురాతన నాగరికత వారసత్వాన్ని పునరుజ్జీవింపజేసుకున్న అద్భుత ఘడియగా 'రామ మందిర నిర్మాణ ఘట్టం' నిలిచిపోతుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వ్యాఖ్యానించారు. భారతదేశ 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశిస్తూ రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. ''అయోధ్యలో రామమందిర దివ్యధామం ప్రజల విశ్వాసాలను మాత్రమే కాదు న్యాయవ్యవస్థ పట్ల ప్రజలకున్న అచంచల విశ్వాసానికీ నిలువెత్తు నిదర్శనం'' అని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల పనితీరునూ ఆమె ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల మధ్య రగులుతున్న ఘర్షణలు, మానవీయ సంక్షోభాలు, యుద్ధాలపై ఆందోళన వ్యక్తంచేశారు. ఘర్షణలకు మూలాలను వెతక్కుండా భయాలు, విద్వేషంతో ఆయా దేశాల ప్రజలు కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ముఖ్యాంశాలు కొన్ని ఆమె మాటల్లోనే..

### జీ20 ఆతిథ్యం ఎన్నో నేర్పింది

''న్యాయ ప్రక్రియ, సుప్రీంకోర్టు సముచిత తీర్పుల తర్వాతే అయోధ్యలో రామమందిర నిర్మాణానికి బాటలు పడ్డాయి. ఈ ఆలయం నిర్మాణం ద్వారా భారత్ తన నాగరికత వారసత్వ పరంపరను కొనసాగిస్తున్నట్లు మరోమారు ప్రపంచానికి చాటింది. ప్రజల విశ్వాసం మాత్రమే కాదు వారు న్యాయవ్యవస్థ మీద వారికున్న నమ్మకానికి నిదర్శనం ఈ ఆలయం. ఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సదస్సును విజయవంతంగా నిర్వహించి భారత్ తన పౌరుల భాగస్వామ్యంలో ఎంతటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలనైనా నిర్వహించగలదని రుజువు చేసింది. వ్యూహాత్మక, దౌత్య అంశాలపై ఏకాభిప్రాయాన్ని సాధించి చూపింది. ప్రజలు తమ సొంత భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోగలరో ప్రపంచ దేశాలకు నేర్పింది. గ్లోబల్ సౌత్‌కు భారత్ గొంతుకగా నిలిచింది. ఆర్థిక వ్యవస్థ పరిపుష్టితో ధృఢ విశ్వాసంతో భారత్ అభివృద్ధి దిశగా వడివడిగా అడుగులేస్తోంది'' అని అన్నారు.

### అభివృద్ధి భారత్ బాధ్యత పౌరులదే

'' స్వతంత్రభారతావని 75 వసంతాలు పూర్తిచేసుకుని శత స్వాతంత్రోత్సవాల దిశగా అడుగులేస్తోంది. రాబోయే పాతికేళ్ల అమృత్‌కాలంలో సర్వతోముఖాభివృద్ధి సాధించి అభివృద్ధి చెందిన భారత్‌గా దేశాన్ని నిలపాల్సిన బాధ్యత పౌరులదే. ఇప్పుడు మహాత్ముని మాటలు గుర్తొస్తున్నాయి. దేశంలో ప్రజలు ప్రాథమిక హక్కులు గురించి మాత్రమే మాట్లాడితే సరిపోదు. ప్రాథమిక విధులు సైతం ఖచ్చితంగా నిర్వర్తిస్తూ బాధ్యతగా మెలిగినప్పుడే భారత్ అభివృద్ధి చెందుతుందని గాంధీజీ ఉపదేశించారు'' అని ముర్ము గుర్తుచేశారు.

## మమతా బెనర్జీతో మాట్లాడిన ఖర్గే

**న్యూఢిల్లీ:** వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో ఒంటరిగానే బరిలోకి దిగుతామని సీఎం మమతా బెనర్జీ బుధవారం పేల్చిన బాంబుతో కాంగ్రెస్ అధిష్ఠానం అప్రమత్తమైంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం టీఎంసీ చీఫ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో ఫోన్‌లో మాట్లాడి ఆమెను బుజ్జగించేందుకు ప్రయత్నించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ధ్రువీకరించారు. 'కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఈ రోజు మమతా బెనర్జీతో మాట్లాడారు. ఎన్నికల్లో టీఎంసీతో కలిసి ముందుకు సాగేందుకు గల మార్గాలను అన్వేషిస్తాం. ఆమె లక్ష్యమే ఇండియా కూటమి లక్ష్యం. అదే బీజేపీని చిత్తుగా ఓడించడం'అని జైరాం రమేశ్ పీటీఐకి చెప్పారు.

## 2 నిమిషాల్లోనే ప్రసంగం ముగిసింది

**ప్రభుత్వంతో కేరళ గవర్నర్ విభేదాలు మరోసారి బట్టబయలు**

**తిరువనంతపురం:** కేరళలోని వామపక్ష ప్రభుత్వం, గవర్నర్ మధ్య విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. గురువారం కేరళ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా సంప్రదాయం ప్రకారం ప్రభుత్వ విధివిధానాలను వివరించాల్సిన గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ప్రసంగ పాఠంలోని చివరి పేరాను మాత్రమే చదివి కేవలం రెండు నిమిషాల్లోనే ప్రసంగం ముగించారు. ఉదయం 9 గంటలకు అసెంబ్లీకి చేరుకున్న గవర్నర్ 9.02 గంటలకల్లా ప్రసంగం ముగించారు. 9.04 గంటలకు అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. కొన్ని బిల్లుల పెండింగ్, యూనివర్సిటీల నిర్వహణకు సంబంధించిన అంశాలపై గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య విభేదాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

## మళ్లీ బీజేపీ గూటికి శెట్టర్

**శివాజీనగర:** కర్ణాటక రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. గతేడాది ఏప్రిల్‌లో ఎన్నికలకు ముందు బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ముఖ్యమంత్రి జగదీష్ శెట్టర్ తిరిగి సొంత గూటికి చేరారు. గురువారం ఆయన ఢిల్లీలో బీజేపీ అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డా, బీ.ఎస్.యడియూరప్ప సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనుండగా ఆయన బీజేపీలోకి చేరడం కన్నడనాట అధికార కాంగ్రెస్‌లో కలకలం రేగింది.

## ఆస్ట్రేలియా బీచ్‌లో ప్రమాదం.. నలుగురు భారతీయులు మృతి

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రంలోని ఓ బీచ్‌లో బుధవారం జరిగిన ప్రమాదంలో నలుగురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ఫిలిప్ దీవిలోని ఎటువంటి కాపలా ఉండని ఈ బీచ్‌లో 20 ఏళ్లలో జరిగిన మొదటి ప్రమాదం ఇదేనని అధికారులు చెప్పారు. మృతులను జగ్జీత్ సింగ్ ఆనంద్(23), సుహానీ ఆనంద్(20), కీర్తి బేడి(20), రీమా సోంధి(43)గా గుర్తించారు. పంజాబ్‌కు చెందిన రీమా సోంధి రెండు వారాల క్రితం క్లైడ్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. అందరూ కలిసి సరదాగా గడిపేందుకు ఫిలిప్ దీవికి వచ్చి అనూహ్యంగా ప్రమాదానికి గురయ్యారు.

## 12 మందిని బలిగొన్న పొగమంచు

**షాజహాన్‌పూర్:** ఉత్తరప్రదేశ్‌లో కురుస్తున్న దట్టమైన పొగమంచు ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైంది. కంటెయినర్ ట్రక్కు రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొనడంతో ఆటోలోని ముగ్గురు మహిళలు సహా 12 మంది మృత్యువాతపడ్డారు. బరేలీ–ఫరుకాబాద్ రహదారిలోని సుగ్సుగి గ్రామ సమీపంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. బాధితులంతా ఫరుకాబాద్ సమీపంలోని గంగా నదిలో పవిత్ర స్నానాలాచరించేందుకు వస్తున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ మీనా చెప్పారు. ప్రమాద తీవ్రతకు ఆటో ట్రక్కు కింద ఇరుక్కుపోయింది.

# జ్ఞానవాపి అడుగున భారీ ఆలయం ఆనవాళ్లు

**తెలుగు, దేవనాగరి, కన్నడ భాషల్లో శాసనాలు**
**ఏఎస్ఐ సర్వేలో తేలిందన్న హిందూ పక్షం లాయర్**

**వారణాసి:** ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలోని జ్ఞానవాపి మసీదు కాంప్లెక్స్ స్థానంలో భారీ హిందూ ఆలయ నిర్మాణం ఉండేదని భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) నివేదిక పేర్కొంది. హిందూ పక్షం న్యాయవాది విష్ణు శంకర్ జైన్ గురువారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో నివేదికలోని అంశాలను చదివి వినిపించారు. గ్రౌండ్ పెన్‌ట్రేటింగ్ రాడార్(జీపీఆర్) సర్వేలో వెల్లడైన అంశాలు కూడా ఈ నివేదికలో ఉన్నాయి. ప్రస్తుత నిర్మాణం అంతకుముందున్న నిర్మాణంపైన కట్టిందేనని కూడా సర్వేలో తేలింది. 'మసీదులో చేసిన మార్పులను ఈ సర్వే గుర్తించింది. పూర్వమున్న స్తంభాలను, ప్లాస్టర్‌ను చిన్న చిన్న మార్పులతో తిరిగి ఉపయోగించినట్లు కనిపిస్తున్నాయి. హిందూ ఆలయం నుంచి తీసుకున్న కొన్ని స్తంభాలను కొద్దిగా మార్చి వేసి కొత్త నిర్మాణంలో ఉపయోగించారు. స్తంభాలపై ఉన్న చెక్కడాలను తొలగించే ప్రయత్నం చేశారు'అని ఏఎస్ఐ నివేదిక పేర్కొన్నట్లు జైన్ వివరించారు. దేవనాగరి, తెలుగు, కన్నడ, ఇతర లిపిలలో రాయబడిన పురాతన హిందూ దేవాలయానికి చెందిన మొత్తం 34 శాసనాలు ప్రస్తుత, పూర్వపు నిర్మాణాలపై ఉన్నాయని జైన్ పేర్కొన్నారు. 'ఇవి వాస్తవానికి పూర్వం ఉన్న హిందూ దేవాలయంలో ఉన్న శాసనాలు. ఇవి ప్రస్తుతం ఉన్న నిర్మాణంలోనూ మరమ్మత్తు సమయంలో ఇవి ఉపయోగించబడ్డాయి. దీనిని బట్టి పూర్వం అక్కడ ఉన్న హిందూ ఆలయాన్ని ధ్వంసం చేసి, దానికి సంబంధించిన భాగాలను తిరిగి వాడినట్లుగా రుజువవుతోంది. ఈ శాసనాల్లో జనార్థన, రుద్ర, ఉమేశ్వర వంటి దేవతల పేర్లు కూడా ఉన్నాయి'అని నివేదికలో ఉన్నట్లు జైన్ చెప్పారు. కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదు సముదాయాన్ని హిందూ, ముస్లిం పక్షాలకు ఇవ్వాలంటూ వారణాసి కోర్టు బుధవారం తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఈ నివేదిక వెలుగులోకి రావడం గమనార్హం. జ్ఞానవాపి మసీదు అంతకు ముందున్న హిందూ ఆలయ నిర్మాణంపైనే నిర్మితమయిందా అన్న విషయం తేల్చేందుకు గత ఏడాది వారణాసి కోర్టు అక్కడ ఏఎస్ఐ సర్వే జరపాలంటూ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.



గురువారం జైపూర్ రోడ్‌షోలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, ప్రధాని మోదీ

## జైపూర్‌లో మోదీ, మేక్రాన్ రోడ్ షో

**జైపూర్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఫ్రాన్సు అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మేక్రాన్ గురువారం జైపూర్‌లో రోడ్ షోలో పాల్గొన్నారు. మోదీ ఆయనకు అయోధ్య రామాలయం ప్రతిమను కానుకగా అందజేశా రు. ఇద్దరు నేతలు జైపూర్‌లో మసాలా చాయ్ రుచిని ఆస్వాదించారు. ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ప్రధాన అతిథిగా హాజరుకానున్న ఫ్రాన్సు అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మేక్రాన్ భారత్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం జైపూర్‌కు చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా, ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఫ్రాన్సు అధ్యక్షుడికి రెడ్ కార్పెట్ పరిచి, అందంగా అలంకరించిన గజరాజులతో స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు నుంచి మేక్రాన్ అంబర్ కోటకు వెళ్లారు. జంతర్‌మంతర్ వద్ద ప్రధాని మోదీ ఆయన్ను కలిశారు. పరస్పర కరచాలనం, ఆత్మీయ ఆలింగనాల అనంతరం ఓపెన్ టాప్ కారులో జంతర్‌మంతర్ నుంచి రోడ్ షోకు బయలుదేరారు. ప్రజలకు అభివాదం తెలుపుతూ హవా మహల్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి తాజ్ రామ్‌బాగ్ ప్యాలెస్‌కు చేరుకుని, ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

# అభివృద్ధి నినాదమే సమర నాదం

**నా తరఫున ప్రజలే ఎన్నికల శంఖం పూరిస్తారు: ప్రధాని మోదీ**

**బులంద్‌షహర్/రేవారీ:** ఉత్తరప్రదేశ్ పర్యటనలో ప్రధాని మోదీ లేదు లేదంటూనే ఎన్నికల ఊసెత్తి పరోక్షంగా ప్రచారాన్ని ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో రూ.19,100 కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన సందర్భంగా ప్రధాని మోదీ అక్కడి ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగం యావత్తూ ప్రచారధోరణిలోనే కొనసాగింది. '' నేను ప్రత్యేకంగా ఎన్నికల సమర నినాదం ఇవ్వాల్సిన పని లేదు. ప్రజలే నా కోసం ఆ పని చేస్తారు. మోదీ గ్యారెంటీల బండి ప్రతి ఒక్క లబ్ధిదారుని చెంతకొస్తుంది. ప్రభుత్వ పథకాలు చిట్టచివరి లబ్ధిదారునికి చేరిన నాడు సమాజంలో వివక్ష, అవినీతి అనేవే ఉండవు. అదే అసలైన లౌకికవాదం. అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాకారమైనట్లు లెక్క. మీరే నా కుటుంబం. మీ కలలే నాకు సంకల్పాలు. మీలాంటి సాధారణ కుటుంబాలు ఆర్థికాభివృద్ధితో సాధికారత సాధించినప్పుడే నా 'ఆస్తి' మరింత పెరిగినట్లు సంతోషిస్తా. మా ప్రభుత్వం ఏం చెబుతోందో దానిని చేసి చూపిస్తుంది. మీరు సంతృప్తి చెందే గ్యారెంటీ నాది. 100 శాతం లబ్ధిదారులకు పథకాలు చేరేలా నేను కృషిచేస్తా'' అని మోదీ ప్రకటించారు.

### కాంగ్రెస్‌పై విమర్శలు

'' చాన్నాళ్ల క్రితం ఒకరు గరీబీ హఠావో అని గట్టిగానే నినదించారు. కానీ సామాజిక న్యాయం కలగానే మిగిలిపోయింది. కొందరు మాత్రమే సంపన్నులై, వారి రాజకీయాలు మాత్రమే నడవడం పేదలు కళ్లారా చూశారు'' అని కాంగ్రెస్‌ను విమర్శించారు. '' ఈ రోజు కార్యక్రమం ద్వారా ఎన్నికల ప్రచారానికి నేను శ్రీకారం చుడుతున్నానని మీడియాలో ప్రచారం జరిగింది. నేను ఆ పని అస్సలు చేయను. నాకు అవసరం లేదు కూడా. బీజేపీకి భవిష్యత్తులో కూడా ఆ అవసరం పడదు. ప్రజలే నా కోసం ఆ పని చేస్తారు. ప్రజలే నా కోసం ఎన్నికల సమర శంఖం పూరిస్తున్నపుడు నేను ప్రత్యేకంగా ప్రచారానికి సమయం కేటాయించాల్సిన అవసరం లేదు. నా సమయమంతా ప్రజాసేవకే కేటాయిస్తాను. అభివృద్ధి నినాదం మాత్రమే నేను ఇస్తా. దానిని ప్రజలే ఎన్నికల సమర నినాదంగా దేశవ్యాప్తంగా మార్మోగిస్తారు' అని సభికుల హర్షధ్వానాల మధ్య మోదీ అన్నారు.

### కుటుంబ పార్టీలను ఓడించండి

మరోవైపు, జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా యువ ఓటర్లతో మాట్లాడారు. '' లోక్‌సభ ఎన్నికల్లో కుటుంబ పార్టీలను ఓడించండి. భారత దేశ దశ, దిశలను నిర్ణయించే సత్తా యువ ఓటర్లకు ఉంది. పది, పన్నెండేళ్ల క్రితం నాటి ప్రభుత్వాల పాలనలో నాటి యువత అంధకారంలో మగ్గిపోయింది. మేమొచ్చాక దేశాన్ని అంధకారం నుంచి బయటికి తెచ్చాం. ఇప్పుడు యువతరానికి అవకాశాలు మెరుగయ్యాయి. బీజేపీ మేనిఫెస్టోకు మీరూ సలహాలు, సూచనలను నమో యాప్ ద్వారా పంపండి. మీ చక్కని ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తుంది'' అని యువ ఓటర్లకు మోదీ సూచించారు.

# ఐక్యంగానే పోరాడతాం: రాహుల్

**కూచ్ బిహార్(పశ్చిమ బెంగాల్):** దేశవ్యాప్తంగా విపక్షాల 'ఇండియా' కూటమి ఐక్యమత్యంగానే దేశవ్యాప్తంగా అన్యాయంపై పోరాటం కొనసాగిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. పశ్చిమబెంగాల్‌లో ఒంటరిగానే బరిలో దిగుతామని తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ ప్రకటించిన వేళ రాహుల్ కూటమి ఐక్యతపై మరోసారి స్పష్టతనివ్వడం గమనార్హం. అస్సాంలో గువాహటి నగరంలోకి భారత్ జోడో న్యాయ్ యాత్ర అడుగుపెట్టకుండా పోలీసులు అడ్డుకోవడం, కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసుల ఘర్షణల నడుమ అస్సాంలో ఉద్రిక్తంగా కొనసాగిన యాత్ర గురువారం పశ్చిమబెంగాల్‌లోకి అడుగుపెట్టింది. బక్షీర్‌హాట్ గుండా రాష్ట్రంలోని కూచ్ బెహార్ జిల్లాలో రాహుల్ యాత్రను మొదలుపెట్టి అక్కడ మద్దతుదారులు, కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. ''దేశంలో అన్యాయం రాజ్యమేలు తున్నందుకే యాత్రకు న్యాయ్ అనే పదం జతచేశాం'' అని అన్నారు. మరోవైపు బెంగాల్‌లో యాత్రలో సీపీఎం, వామపక్ష పార్టీలు పాలుపంచుకునే అవకాశం ఉంది.

**బస్సులో ఉన్నది రాహుల్ కాదేమో: అస్సాం సీఎం హిమంత**

అస్సాంలో న్యాయ్ యాత్ర సందర్భంగా బస్సు లోపలి వైపు రాహుల్ సేదతీరుతూ ముందువైపు డూప్‌ను కూర్చోబెట్టి యాత్ర చుట్టేస్తున్నారని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆరోపించారు. ''అస్సాంలో న్యాయ్ యాత్ర ప్రభావం శూన్యం. యాత్ర కొనసాగిన అన్ని నియోజకవర్గాల్లో బీజేపీనే విజయం సాధిస్తుంది. రాహుల్ ప్రచారం చేసిన చోటల్లా బీజేపీనే గెలుస్తుంది. ఆ కోణంలో చూస్తే బీజేపీకి రాహుల్ అవసరం ఎంతైనా ఉంది'' అని వ్యంగ్యంగా మాట్లాడారు. కొన్ని చోట్ల రాహుల్ అస్సలు బస్సు దిగట్లేరని, బస్సులో ముందువైపు కనిపించేది రాహుల్ కాదని కొన్ని మీడియాకథనాలు వచ్చాయన్నారు.

# గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

**న్యూఢిల్లీ:** దేశ సైనిక శక్తిని, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ఘనంగా చాటే 75వ గణతంత్ర వేడుకలకు ఢిల్లీ సిద్ధమైంది. కర్తవ్యపథ్‌లో గంటన్నరపాటు సాగే పరేడ్‌కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సారథ్యం వహించనున్నారు. ఈ ఏడాది వేడుకలకు ముఖ్య అతిథిగా ఫ్రాన్సు అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మేక్రాన్ హాజరుకానున్నారు. పరేడ్‌లో క్షిపణులు, డ్రోన్‌జామర్లు, నిఘా వ్యవస్థలు, సైనిక వాహనాలపై అమర్చిన మోర్టార్లు, పోరాట వాహనాలను ప్రదర్శించనున్నారు. మొట్టమొదటిసారిగా పూర్తిగా మహిళా అధికారులతో కూడిన త్రివిధ దళాల కంటింజెంట్ కవాతులో పాల్గొననుంది. గత ఏడాది ఆర్టిలరీ రెజిమెంట్‌లో విధుల్లో చేరిన 10 మహిళా అధికారుల్లో లెఫ్టినెంట్లు దీప్తి రాణా, ప్రియాంక సెవ్దా సహా మొట్టమొదటిసారిగా స్వాతి వెపన్ లొకేటింగ్ అండ్ పినాక రాకెట్ సిస్టమ్‌కు సారథ్యం వహించనున్నారు. సంప్రదాయ మిలటరీ బ్యాండ్లకు బదులుగా ఈసారి భారతీయ సంగీత పరికరాలైన శంఖ, నాదస్వరం, నాగడ వంటి వాటితో 100 మంది మహిళా కళాకారుల బృందం పరేడ్‌లో పాల్గొననుంది. భారత వైమానిక దళానికి చెందిన 15 మంది మహిళా పైలట్లు వైమానిక విన్యాసాల్లో పాల్గొంటారు. ఉదయం 10.30 గంటలకు మొదలయ్యే పరేడ్ 90 నిమిషాల పాటు కొనసాగనుంది.

## ఇద్దరు తెలుగువారికి 'జీవన్ రక్ష పతక్'

• జాబితాకు రాష్ట్రపతి ఆమోదం

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ఏటా అందించే 'జీవన్ రక్ష పతక్' పురస్కారాలు ఇద్దరు తెలుగువారిని వరించాయి. జీవన్ రక్ష పతక్ సిరీస్ అవార్డు–2023లో భాగంగా జీవన్ రక్ష పతకానికి తెలంగాణ నుంచి డి.నవీన్‌కుమార్ ఉత్తమ్, జీవన్ రక్ష పతకానికి ఆంధ్రప్రదేశ్ నుంచి జితం పరమేశ్వరరావు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా మొత్తం 31 మంది ఈ పతకాలకు ఎంపికవగా గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. ఒక వ్యక్తికి మానవతా దృక్పథంతో అందించే సాయం, కృషికి 'సర్వోత్తమ్ జీవన్ రక్ష పతక్, ఉత్తమ్ జీవన్ రక్ష పతక్, జీవన్ రక్ష పతక్ అనే మూడు కేటగిరీల్లో ఈ పురస్కారాలను అందజేస్తారు. పురస్కార గ్రహీతలకు పతకం, కేంద్ర హోం మంత్రి సంతకంతో కూడిన సర్టిఫికెట్, నగదును అందజేస్తారు.

**40 మందిని కాపాడిన నవీన్**



గత ఏడాది వేసవిలో ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడులో బీఆర్‌ఎస్ గ్రామసభలో పాల్గొనడానికి పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు వస్తున్నప్పుడు బాణసంచా పేల్చారు. దీంతో అవి సభాస్థలికి దగ్గర్లోనే ఉన్న ఓ పూరిగుడిసెపై పడడం.. అందులోని సిలిండర్లు పేలడంతో కొందరు ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. ఆ సమయంలో అక్కడే ఉన్న పోలీసు జీపు డ్రైవర్ నవీన్‌కుమార్ మరింత మంది ఆ ప్రమాదం బారిన పడకుండా దాదాపు 40 మందిని రక్షించినందుకు ఈ అవార్డుకు కేంద్రం ఎంపిక చేసింది.

# రాష్ట్రానికి 2 రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకాలు

**దేవేంద్ర సింగ్ చౌహాన్, సౌమ్యా మిశ్రాకు ప్రకటించిన కేంద్ర హోంశాఖ**
• మరో ఆరుగురికి శౌర్య పతకాలు, 14 మందికి ప్రతిభాసేవా పతకాలు
• దేశవ్యాప్తంగా మొత్తం 1,132 మందికి పతకాలు ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ

75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, సివిల్ డిఫెన్స్ సేవల్లోని మొత్తం 1,132 మంది అధికారులకు కేంద్రప్రభుత్వం నాలుగు కేటగిరీల్లో పతకాలను ప్రకటించింది. ఇందులో తెలంగాణకు 2 రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకాలు, 12 మంది పోలీసులకు ప్రతిభా సేవాపతకాలు, ఇద్దరు జైలు అధికారులకు ప్రతిభా సేవా పతకాలు, ఆరుగురికి మెడల్ ఫర్ గ్యాలెంట్రీ లభించాయి. అడిషనల్ డీజీపీలు దేవేంద్ర సింగ్ చౌహాన్, సౌమ్యా మిశ్రాకు ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకాలు దక్కాయి.

**మెడల్ ఫర్ గ్యాలెంట్రీ వీరికే**

వాడిచెర్ల శ్రీనివాస్, నలివేణి హరీశ్, గడ్డిపోగుల అంజయ్య, బూర్క సునీల్ కుమార్, ఎండీ.అయూబ్, పి.సతీష్‌లు గ్యాలెంట్రీ పతకాలకు ఎంపికయ్యారు.

**ప్రతిభా సేవా పతకాలు వీరికి**

డీఐజీ జాకబ్ పరిమళ హన నూతన్, ఏఎస్పీ డి.చంద్రయ్య, 8వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ కొక్కు వీరయ్య, కమాండెంట్ నరుకుళ్ల త్రినాథ్, ఎస్పీ నూకల వెంకటేశ్వర్లు, ఏసీపీ పింగిళి నరేష్ రెడ్డి, ఏసీపీ శ్రీరాముల మోహన్ కుమార్, ఎస్ఐ బెల్లం జయచంద్ర, అసిస్టెంట్ రిజర్వ్ ఎస్ఐ ఎనుముల వెంకట్‌రెడ్డి, అసిస్టెంట్ రిజర్వ్ ఎస్ఐ గండిపూడి ఏసుపాదం, హెడ్ కానిస్టేబుల్ జంగయ్య, ఎస్ఐ మంచిరేవుల సురేందర్ రెడ్డికు పోలీసు ప్రతిభా సేవా పతకాలు లభించాయి. తెలంగాణకు చెందిన ఇద్దరు.. కరెక్షనల్ సర్వీసు కేటగిరీలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్ అర్కోట్ శ్రీధర్, జైలర్ యాదరి రమణయ్య ప్రతిభా సేవా పతకాలకు ఎంపికయ్యారు.



వెంకటేశ్వర్లు

**మొత్తం 1,133 పతకాలు:** కాగా ఈఏడాది ప్రకటించిన మొత్తం 1,132 పతకాల్లో బీఎస్ఎఫ్‌కు చెందిన ఇద్దరు పోలీసు అధికారులకు రాష్ట్రపతి శౌర్య పతకాలు వారి మరణానంతరం లభించాయి. మిగతా 275 మందికి శౌర్యపతకాలు, 102 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 753 మందికి ప్రతిభా సేవా పతకాలను గురువారం కేంద్ర హోంశాఖ ప్రకటించింది. గ్యాలెంట్రీ పతకాలు దక్కించుకున్న 275 మందిలో అత్యధికంగా జమ్మూకశ్మీర్ నుంచి 72 మంది, ఛత్తీస్‌గఢ్ నుంచి 26, ఝార్ఖండ్ నుంచి 23, మహారాష్ట్ర నుంచి 18 మంది పోలీసులు ఉన్నారు. సీఆర్పీఎఫ్ నుంచి 65, సశస్త్ర సీమాబల్ నుంచి 21 మంది శౌర్య పతకాలకు ఎంపికయ్యారు.



సౌమ్యా మిశ్రా



దేవేంద్ర సింగ్ చౌహాన్

**ఏపీకి చెందిన 9మంది అధికారులకు ప్రతిభా సేవా పతకాలు**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తొమ్మిదిమంది పోలీసు అధికారులకు ప్రతిభా సేవా పతకాలు లభించాయి. కమాండెంట్ కోటనాని వెంకట ప్రేమ్‌జిత్, ఆర్ఎస్ఐ ఆవుల చెన్నయ్య, ఏఎస్ఐ ఆర్.రమణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అద్దంకి, ఏఎస్ఐ బి.ప్రకాశ్‌రావు, ఏఎస్ఐ కరి మస్తాన్‌రావ్, అసిస్టెంట్ కమాండెంట్ పుల్లభొట్ల వెంకట సత్య అనంత దుర్గ ప్రసాద్ రావు, ఇన్‌స్పెక్టర్ అక్కిశెట్టి శ్రీహరి రావు, డీఎస్పీ కోటిరెడ్డి పోలీసు ప్రతిభా సేవా పతకాలకు ఎంపికయ్యారు. వీరితో పాటు ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ పెనికలపాటి వెంకట రమణ, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ జాస్తి రమణయ్య, లీడింగ్ ఫైర్‌మ్యాన్ షేక్ ఘనీలకు ఫైర్ సర్వీసెస్ కేటగిరీలో ప్రతిభా సేవా పతకాలు దక్కాయి.

### చౌహాన్‌కు డబుల్ ధమాకా

**రాష్ట్రపతి మెడల్‌తో పాటు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు**

**సాక్షి, హైదరాబాద్:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీనియర్ పోలీస్ అధికారి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు ఒకేసారి రెండు అవార్డులు లభించాయి. రిపబ్లిక్ డే సందర్భంగా ప్రతి సంవత్సరం కేంద్రం ప్రకటించే రాష్ట్రపతి మెడల్‌కు డీఎస్ చౌహాన్ ఎంపికయ్యారు. దీంతోపాటు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు(2024) కూడా ఆయనకు లభించింది. రాచకొండ పోలీస్ కమిషనర్‌గా 2023 శాసన సభ ఎన్నికలు సజావుగా సమర్థవంతంగా నిర్వహించినందుకు గానూ ఎన్నికల సంఘం ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డును గురువారం జేఎన్‌టీయూలో జరిగిన ఓటర్స్‌డే సెలబ్రేషన్స్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చేతులమీదుగా డీఎస్ చౌహాన్ అందుకున్నారు. ఒకే రోజు రెండు అవార్డులు రావడం పట్ల పౌరసరఫరాల శాఖ ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. సమిష్టి కృషి వల్లే ఇది సాధ్యం అయిందని ఈ సందర్భంగా డీఎస్ చౌహాన్ వ్యాఖ్యానించారు.

# మూసీ సుందరీకరణే లక్ష్యం

• ఔటర్, ట్రిపుల్ మధ్య 13 క్లస్టర్ల ఏర్పాటు
• పీపీపీ విధానంలో టౌన్‌షిప్‌ల నిర్మాణం
• సీఐఐ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**సాక్షి, హైదరాబాద్:** మూసీ నది సుందరీకరణ, స్థిరమైన అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ''రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుస్తుందా? అని ఎన్నికల వేళ మాట్లాడుకున్నారు, గెలిచి చూపించాం. ఇప్పుడు ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేస్తుందా? అని హేళనగా మాట్లాడుతున్నారు. మూసీ పరీవాహక ప్రాంతాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నాం'' అని ఆయన వెల్లడించారు. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో గురువారం నగరంలో జరిగిన ఇన్‌ఫ్రా అండ్ రియల్ ఎస్టేట్ సమ్మిట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), రీజినల్ రింగ్ రోడ్ (ట్రిపుల్ ఆర్) మధ్య 13 క్లస్టర్ల ఏర్పాటుతో ఆయా ప్రాంతాలలో సాంస్కృతిక వ్యాపారాలకు అవకాశం ఉంటుందని వివరించారు. పీపీపీ విధా నంలో టౌన్‌షిప్‌ల నిర్మాణం చేపడతామని చెప్పారు. ప్రభుత్వం అనేది.. కేవలం వ్యాపారాన్ని సులభతరం చేసే ఒక వేదిక మాత్రమే నని, మౌలిక వసతుల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తల సహకారం అవసరమని ఆయన పునరుద్ఘాటించారు. మూడు దశాబ్దాలుగా స్థిరాస్తి రంగం పుంజుకుందని, సుస్థిరమైన విధానాలతో స్థిరాస్తి రంగంలో మరింత అభివృద్ధి కోసం కృషి చేస్తామని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వం చేపట్టిన ప్రగతి పనులను ఆపబోమని స్పష్టం చేశారు.

**మూసీనదిలో పడవ రవాణా సదుపాయం: దాన కిషోర్**

గ్రేటర్ హైదరాబాద్‌కు మూసీ నది చోదక శక్తికి మారనుందని హెచ్ఎండీఏ పిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ తెలిపారు. గ్రేటర్‌లో దాదాపు 55 కిలోమీటర్లు మేర ఉన్న మూసీ నది వెంట గోల్కొండ, సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, హైకోర్టు, ఉస్మానియా వంటి ఎన్నో వారసత్వ ప్రదేశాలు కొలువై ఉన్నాయని, అందుకే మూసీ రివర్ ఫ్రంట్ కోసం ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని తెలిపారు. మూసీ ప్రవాహంలో సగ భాగం మెట్రో, సగం భాగం రోడ్డు మార్గం ఉంటుందని, దీంతో పాటు మూసీలో పడవ రవాణా ప్రయాణ సదుపాయం వచ్చేలా పటిష్టమైన ప్రణాళికలుంటాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు పశ్చిమ ప్రాంతంలోనే కేంద్రీకృతమైన అభివృద్ధిని మూసీ రివర్ ఫ్రంట్‌తో నగరం నడిబొడ్డుకు తీసుకొస్తామని దాన కిషోర్ హామీ ఇచ్చారు. ఇందుకోసం మూసీ పరివాహం వెంట వాక్ టు వర్క్ ప్రాజెక్ట్‌లను నిర్మించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువతకు నైపుణ్యం పెంపొందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని దాన కిషోర్ తెలిపారు. ఇప్పటివరకు ఉన్న డిప్లమో కోర్సులు నేర్చుకుంటే ఉద్యోగ అవకాశాలు, వేతనాలు తక్కువ అని అందుకే ఈ కోర్సులను గ్రాడ్యుయేషన్ స్థాయికి తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించుకుందని ఆయన వెల్లడించారు.

## వచ్చేవారంలో బీజేపీ ఎంపీ అభ్యర్థుల ప్రకటన

• కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక పూర్తి చేసి, ఆ జాబితాను వచ్చేవారంలో ప్రకటిస్తామని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు పూర్తి సమయం ఇచ్చి పనిచేయాలని, పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ నెల 28న కేంద్రహోంమంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం హైదరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌పై నిర్వహించిన సన్నాహక సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28న సాయంత్రం 5 గంటలకు జేఆర్‌సీ కన్వెన్షన్‌లో మహిళా వృత్తినిపుణులు, ప్రొఫెషనల్స్‌తో నిర్వహించే భేటీలో అమిత్‌షా పాల్గొంటారని తెలిపారు. బీఆర్ఎస్– బీజేపీ ఒకటేనని, కాంగ్రెస్–బీజేపీ ఒకటేనని మాట్లాడేవారిని చెప్పుతో కొట్టే రోజులు వస్తాయని హెచ్చరించారు. బీజేపీ అగ్గిలాంటి పార్టీ అని, ఏ పార్టీతోనూ కలవదని స్పష్టం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ ఎలా ఒక్కటి అవుతాయో బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఏదోరకంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. హైదరాబాద్‌లో బీజేపీ పోటీచేయడం కోసం కాదు..అసదుద్దీన్‌ను ఓడించడం కోసమే పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సెగ్మెంట్‌లో మజ్లిస్ గెలుస్తుందనే కాలం పోయిందని చెప్పారు. ముస్లిం మహిళలు వద్దన్నా, బీజేపీకి ఓటేయడానికి ముందుకు వస్తున్నారన్నారు. ముస్లిలంతా మజ్లిస్ పార్టీకి మద్దతు ఇచ్చే పరిస్థితి లేదని, అసెంబ్లీ ఎన్నికల్లో యాకత్‌పురా, కార్వాన్‌లలో చావుతప్పి..కన్ను లొట్టబోయినట్టు ఎంఐఎం గెలిచిందని చెప్పారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్‌ను బుజ్జగించే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యాయన్నారు.కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒక్కటేనని చెప్పారు. లక్షమంది అసదుద్దీన్‌లు వచ్చినా మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిపై విచారణ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన లేదని తెలిపారు.

## జాన్‌పహాడ్ సైదన్న ఉర్సు ప్రారంభం



దర్గాలో బాబా సమాధుల వద్ద గంధం కలశాన్ని ఎత్తుకుని ప్రార్థనలు చేస్తున్న ముజావర్

**పాలకవీడు:** సూర్యా పేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్ పహాడ్ సైదన్న దర్గా ఉర్సు ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవా ల్లో భాగంగా గురువా రం తొలిరోజు గుసుల్ షరీఫ్ కార్యక్రమం నిర్వహించారు. ముజావర్ అలీ ఇంటి వద్ద నుంచి గంధం, దట్టీలు, పూలమాలలు తీసుకొచ్చి బాబా సమాధులను అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబాకు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో శుక్రవారం జాన్‌పహాడ్ పురవీధుల్లో గంధం ఊరేగింపు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నట్లు పార్టీ నేతలు తెలిపారు.

## విజేతలకు డీజీపీ అభినందనలు



**సాక్షి, హైదరాబాద్:** పోలీస్ సంస్మరణ దినం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన పోలీస్ సిబ్బందిని డీజీపీ రవిగుప్త అభినందించారు. డీజీపీ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేశారు. డీజీపీ మాట్లాడుతూ ఈ పోటీలలో 12 మందిని విజేతలుగా నిర్ణయించామని వెల్లడించారు. ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులకు రూ.15 వేలు, రూ.10 వేలుగా అందజేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో పోలీసు సంక్షేమ విభాగపు ఐజీ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## దిగుబడి రాలేదని రైతు ఆత్మహత్య



ఎల్మల స్వామి


**తాంసి:** ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన రైతు ఎల్మల స్వామి(38) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామశివారులో తనకున్న 4.10 ఎకరాల్లో పత్తిపంట సాగు చేశాడు. పెట్టుబడి కోసం కప్పర్ల గ్రామీణ బ్యాంకులో రూ.1.60 లక్షల రుణం తీసుకోవడంతోపాటు బయట వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. పత్తి పంట ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతోపాటు అప్పులు తీర్చేదెలా అని మనోవేదన చెందాడు. బుధవారం కుమారుడు శివతేజ్‌తో కలిసి పంట చేను వద్దకు వెళ్లాడు. చేనులో పనులు చేస్తూనే పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు తీసుకొచ్చి చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం ఉదయం స్వామి చనిపోయాడు. అతడి భార్య కవిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రూ.500 అప్పు తీర్చమంటోందని వృద్ధురాలి హత్య



తేజావత్ ఈరమ్మ

**గూడూరు:** రూ.500 అప్పును తిరిగి ఇవ్వమని అడిగిన వృద్ధురాలిని ఓ వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలో బుధవారంరాత్రి చోటు చేసుకుంది. గూడూరు మండలం కోబల్‌తండా శివారు మూడుగుడిసెల లైన్ తండాకు చెందిన తేజావత్ ఈరమ్మ(58) అదే తండాకు చెందిన తేజావత్ స్వామి అనే మరో వృద్ధుడికి కొద్దిరోజుల క్రితం రూ.500 అప్పుగా ఇచ్చింది. తిరిగి ఇస్తానన్న సమయం దాటడంతో ఈరమ్మ కొన్నిరోజులుగా అతడిని డబ్బులు ఇవ్వాలని అడుగుతోంది. దీంతో కోపం పెంచుకున్న స్వామి బుధవారంరాత్రి ఈరమ్మ ఇంటికి వెళ్లాడు. అప్పటికే నిద్రిస్తున్న ఆమె ముఖంపై దిండుపెట్టి, గొంతు నులిమి చంపాడు. గురువారం మృతురాలి కుమారుడు వీరన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## క్లుప్తంగా...

### ఎమ్మెల్యేల కొనుగోలు కేసు వాయిదా..

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల కొనుగోలు కేసు విచారణను సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ కోర్టు మార్చి 6వ తేదీకి వాయిదా వేసింది. భారతీయ జనతా పార్టీపై తెలంగాణ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ శశిధర్ శెట్టి విచారించారు. సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వ ప్యానెల్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా మారిందని ఈ నేపథ్యంలో విచారణ వాయిదా వేయాలని పోలీసుల తరపు న్యాయవాది కోరారు. ఈ మేరకు రిజిస్ట్రార్ విచారణను వాయిదా వేశారు.

### సచివాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం

**ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించిన సీఎస్ శాంతికుమారి**



సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ప్రతిజ్ఞ చేయించారు. యువ ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోవడంతోపాటు ఓటు వినియోగాన్ని విధిగా పరిగణించడానికి జాతీయ ఓటర్ల దినోత్సవం జరుకుంటారని సీఎస్ తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే జాతీయ ఓటర్ల దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో అసంతృప్తుల లొల్లి

**కేసీ.వేణుగోపాల్‌ను కలిసిన పలువురు ఆశావహులు**

సాక్షి, హైదరాబాద్: నామినేటెడ్ పదవుల పందేరంతో కాంగ్రెస్‌లో అసంతృప్తుల లొల్లిషురూ అయ్యింది. పదవులు దక్కుతాయని..అధిష్టానం ఆశీస్సులు లభిస్తాయని అనుకుంటున్న ఆశావహులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ క్రమంలో ఓ వైపు నామినేటెడ్ పోస్టులు, మరోవైపు ఎమ్మెల్సీ పదవులు భర్తీ అవుతున్నాయి. దీంతో ఈ పదవులు ఆశిస్తున్న ముఖ్య నేతలు, ఏళ్ల తరబడి పార్టీని అంటుపెట్టుకొని పనిచేస్తున్న తమకు గుర్తించడం లేదని విమర్శలకు దిగుతున్నారు. తాజాగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. గవర్నర్ కోటాలో తనకు ఎమ్మెల్సీ పదవి దక్కకపోవడంపై అజారుద్దీన్ అసంతృప్తిని వెళ్లగక్కారు. నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్న పలువురు నేతలు ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ.వేణుగోపాల్‌ను కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**హామీ ఇచ్చినా పదవి ఇవ్వలేదు: అజారుద్దీన్**



గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చినా, ఇప్పటివరకు పదవులు ఇవ్వలేదని అజారుద్దీన్ విమర్శించారు. పార్టీ కోసం పనిచేసిన వారికి కాకుండా ఇతరులకు ఎమ్మెల్సీ పదవులు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. 18 ఏళ్లుగా తాను పార్టీ కోసం పని చేస్తున్నానని, ఏఐసీసీ పెద్దలతో మాట్లాడిన తర్వాత నిర్ణయం ప్రకటిస్తానని స్పష్టం చేశారు. అయితే ఇప్పటి వరకు పదవి దక్కకపోవడంపై గుర్రుగా ఉన్న అజారుద్దీన్ కాంగ్రెస్‌ను వీడే యోచనలో ఉన్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### అయోధ్యలో... తిరుమల తరహా సేవలు!

- టీటీడీ చైర్మన్‌ను సంప్రదించిన పీఎంవో, అయోధ్య కమిటీ

సాక్షి, తిరుపతి: అయోధ్యలో బాలరాముని దర్శనం కోసం వచ్చే లక్షలాది మందికి ఇబ్బందులు లేకుండా చూడటంపై ఆలయ కమిటీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తులకు అందుతున్న సేవలు, టీటీడీ తీసుకుంటున్న చర్యలు, వసతి, సంతృప్తికరమైన దర్శనాలు, భద్రత ప్రమాణాలు, క్యూలైన్ సిస్టం తదితర ఏర్పాట్లపై కమిటీ అధ్యయం చేయనుంది. ఈ విషయాలపై టీటీడీ చైర్మన్ భూమనతో పీఎంవో, అయోధ్య కమిటీ సభ్యులు ఇటీవల చర్చించారు. త్వరలో ఈ కమిటీ తిరుమలకు వచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టనుందని భూమన గురువారం తెలిపారు. అయోధ్యకు వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా టీటీడీ ఇంజనీరింగ్ బృందాన్ని ఇప్పటికే అయోధ్యకు పంపించామని, మరింత సహకారం అందించేందుకు టీటీడీ సిద్ధంగా ఉందని కమిటీకి ఆయన హామీ ఇచ్చారు.

### ఐహెచ్ఆర్‌సీ ఉపాధ్యక్షుడిగా అసద్



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్(ఐహెచ్ఆర్‌సీ) తెలంగాణ రాష్ట్ర విభాగానికి ఉపాధ్యక్షుడిగా మెదక్ జిల్లాకు చెందిన అసద్‌ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐహెచ్ఆర్‌సీ ప్రధానకార్యదర్శి అయినల్ హాస్సేన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో మానవ హక్కుల పరిరక్షణకు ఐహెచ్ఆర్‌సీ తరఫున అసద్ కృషి చేస్తారని తెలిపారు.

# 'టౌన్ ప్లానింగ్' శివబాలకృష్ణ అరెస్టు

- ఏసీబీ కోర్టులో హాజరుపర్చిన ఏసీబీ అధికారులు
- ఆదాయానికి మించి భారీగా ఆస్తులున్నట్టు గుర్తింపు
- వంద ఎకరాల వరకు వ్యవసాయ భూమి, విల్లాలు, ఫ్లాట్లు, ఫ్లాట్ల పత్రాలు స్వాధీనం
- 2 కిలోల బంగారు ఆభరణాలు, ఆరు కిలోల వెండి, వజ్రాలు, రూ.99.60 లక్షల నగదు కూడా..
- పదుల సంఖ్యలో ఐఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సీజ్



సాక్షి, హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు దొరికిన పురపాలక శాఖ పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) విభాగం ఉన్నతాధికారి శివబాలకృష్ణ ఆస్తులు లెక్కకు మించి బయటపడుతున్నాయి. సోదాల్లో గుర్తించిన ఆస్తుల విలువను మదింపు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. గురువారం ఆయనను అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వచ్చే నెల 8వరకు రిమాండ్ విధించడంతో.. చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇక బాలకృష్ణకు బినామీలుగా వ్యవహరించిన మూర్తి, సత్యంల కోసం గాలిస్తున్నారు. శివబాలకృష్ణ అవినీతి, అక్రమాల సంపాదనతో నాలుగైదు ప్రాంతాల్లో వంద ఎకరాల వరకు వ్యవసాయ భూమి, ప్లాట్లు, ఫ్లాట్లు, విల్లాలు కొనుగోలు చేశారని పురపాలక శాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వాటి ప్రస్తుత మార్కెట్ విలువ దాదాపు ఐదు వందల కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

**సుమారు రెండు కిలోల బంగారం.. కోటి నగదు..**

శివబాలకృష్ణ ఇల్లు, కార్యాలయం, బంధువుల ఇళ్లల్లో ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో స్థిరాస్తి పత్రాలను అధికారులు సీజ్ చేశారు. హైదరాబాద్‌లో విల్లాలు, ఫ్లాట్లు, నగర శివారు ప్రాంతాల్లో భారీగా భూముల పత్రాలు వీటిలో ఉండటం గమనార్హం. మొత్తంగా వంద ఎకరాల వరకు ఈ భూములు ఉన్నట్టు తెలిసింది. వీటితోపాటు కోటి వరకు నగదు, దాదాపు రెండు కిలోల బంగారు ఆభరణాలు, ఆరు కిలోలకుపైగా వెండి వస్తువులు, 80కిపైగా అత్యంత ఖరీదైన వాచీలు, పదుల సంఖ్యలో ఐఫోన్లు, ల్యాప్‌టాప్‌లను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా బ్యాంకు లాకర్లను తెరిస్తే ఇంకా ఎంత స్థాయిలో ఆస్తులు బయట పడతాయోనని అధికారులు పేర్కొంటున్నారు.

**బినామీల పేరిట భూములు**

సోదాల్లో కొడకండ్లలో 17 ఎకరాలు, కల్వకుర్తిలో 26 ఎకరాలు, యాదాద్రిలో 23 ఎకరాలు, జనగామలో 24 ఎకరాల స్థిరాస్తి భూముల పత్రాలను ఏసీబీ అధికారులు గుర్తించారు. వాటిలో చాలా వరకు బినామీల పేరిట ఉన్నట్టు చెప్తున్నారు. బినామీలుగా వ్యవహరించిన సత్యం, మూర్తి కోసం అధికారులు గాలిస్తున్నట్టు తెలిసింది.

**ప్రభుత్వ లెక్కల ప్రకారమే..**

హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ ఇంట్లో, మరో 16 చోట్ల జరిపిన దాడుల్లో ఇప్పటివరకు స్థిరాస్తులు, చరాస్తుల డాక్యుమెంట్లలోని ప్రభుత్వ విలువ ప్రకారం రూ.8.26 కోట్ల ఆస్తులను గుర్తించినట్టు ఏసీబీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వీటి విలువ బహిరంగ మార్కెట్లో ఎన్నోరెట్లు అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇంకా ఆస్తుల మదింపు జరుగుతోందని తెలిపారు. సోదాల్లో రూ.99,60,850 నగదు, 1,988 గ్రాముల బంగారు ఆభరణాలు, ఆరు కిలోల వెండి ఆభరణాలు/వస్తువులు, డాక్యుమెంట్ల లెక్కల ప్రకారం రూ.5,96,27,495 విలువైన స్థిర, చరాస్తులను గుర్తించినట్టు తెలిపారు. బాలకృష్ణను అరెస్టు చేసి ఏసీబీ కోర్టు అదనపు స్పెషల్ జడ్జి ముందు హాజరుపర్చినట్టు వివరించారు. అవినీతికి పాల్పడే ప్రభుత్వ అధికారులకు సంబంధించి ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేయాలని సమాచారం ఇవ్వాలని కోరారు.

# పుర 'ప్లానింగ్' అంతా ఆయనదే!

- విధానాల రూపకల్పనలో చక్రం తిప్పిన శివబాలకృష్ణ
- ఆయన కోసం పురపాలక శాఖలో డైరెక్టర్ (ప్లానింగ్) పోస్టు సృష్టి
- హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, మెట్రో రైల్ విధాన నిర్ణయాల్లో ప్రభావం
- రెరా నిబంధనలు, ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్, టీఎస్–బీపాస్‌ల రూపకల్పనలోనూ కీలక పాత్ర
- అనుమతులు, మినహాయింపులు, అలైన్‌మెంట్ మార్పుల పేరిట అవినీతి
- శివబాలకృష్ణ ఏసీబీకి చిక్కడంపై రియల్ ఎస్టేట్ రంగంలో తీవ్ర చర్చ

సాక్షి, హైదరాబాద్: ఏసీబీకి చిక్కి అరెస్టయిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ.. రాష్ట్ర అర్బన్ ప్లానింగ్ పాలసీల రూపకల్పనలో చక్రం తిప్పారని పురపాలకశాఖ వర్గాలు చెప్తున్నాయి. పట్టణ ప్రణాళికకు సంబంధించిన విధానాల రూపకల్పన, రచన (డ్రాఫ్టింగ్)లో దిట్టకావడంతో ఆయన హవా కొనసాగిందని అంటున్నాయి. 2014లో రాష్ట్ర సచివాలయంలోని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో డైరెక్టర్ (ప్లానింగ్) పేరుతో కొత్త పోస్టును సృష్టించి మరీ ఆయనకు అదనపు బాధ్యతలను అప్పగించడం గమనార్హం. దీనితో ఆయన హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హైదరాబాద్ మెట్రోరైల్, భూవిని యోగ మార్పిడి, ఎలివేటెడ్ కారిడార్లు, ఆకాశ హర్మ్యాలు, మాస్టర్ ప్లాన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో విధానపర నిర్ణయాలు తీసుకోవడంలో కీలకంగా వ్యవహరించారు. పురపాలక శాఖ లో ఈ వ్యవహారాలను పర్యవేక్షించే కీలకమైన ప్లానింగ్-1, ప్లానింగ్-2, ప్లానింగ్-3 అనే మూడు సెక్షన్లకూ శివబాలకృష్ణ మకుటం లేని మహా రాజుగా వ్యవహరించారని.. హెచ్ఎండీఏ డైరెక్టర్ (ప్లానింగ్)గా ఆ సంస్థ అంతర్గత వ్యవహారాల్లోనూ ప్రభావం చూపినట్టు చర్చ జరుగుతోంది. ఈ సమయంలోనే ఆయన పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడి ఆస్తులు పోగేసుకున్నట్టు ఆరోపణలు విని పిస్తున్నాయి. శివబాలకృష్ణ ఇంట్లో సోదాల్లో లభించిన విలువైన వాచీలు, సెల్‌ఫోన్లు, ఆభరణాలు వంటివన్నీ బహుమతులుగా అందుకున్నవేనని పురపాలక శాఖలో చర్చ జరుగుతోంది.

**కీలక విధాన నిర్ణయాలన్నీ..**

గత పదేళ్లలో రాష్ట్ర పురపాలక శాఖ తీసుకొచ్చిన పాలసీల రూపకల్పనలో శివబాలకృష్ణ ముఖ్యపాత్ర పోషించారు. రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి ముఖ్యమైన తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ అథారిటీ (టీఎస్ రెరా) నిబంధనలను సైతం శివబాలకృష్ణ రూపొందించారు. ఈ క్రమంలో రెరా అమల్లోకి వచ్చిన తేదీ నాటికే నిర్మాణం ప్రారంభమైన ప్రాజెక్టులకు మినహాయింపు ఇచ్చి, బిల్డర్లకు ప్రయోజనం కల్పించినట్టు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఇక అనుమతి లేని కట్టడాలు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం సర్కారు తెచ్చిన ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్‌ల జీవోలు శివబాలకృష్ణ ఆధ్వర్యంలోనే సిద్ధం చేశారు. టౌన్‌షిప్ పాలసీ, పాడియం పార్కింగ్ పాలసీ, పార్కింగ్ ఫీజు విధానం, సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో భవన అనుమతుల జారీ కోసం తెచ్చిన టీఎస్–బీపాస్ పాలసీ, కూల్‌రూఫ్ పాలసీ, రాష్ట్ర బిల్డింగ్ రూల్స్ (జీవో 168)కు సవరణలతో వేర్వేరు సందర్భాల్లో జారీ చేసిన జీవోలు, లేఅవుట్ రూల్స్‌కు సవరణలతో వేర్వేరు సందర్భాల్లో ఇచ్చిన జీవోలను సైతం ఆయన నేతృత్వంలోనే రూపొందించినట్టు పురపాలక శాఖ వర్గాలు చెప్తున్నాయి.

**దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టి..**

హెచ్ఎండీఏ, ఇతర పట్టణాల మాస్టర్ ప్లాన్లకు సవరణలు/మినహాయింపులు, మాస్టర్ ప్లాన్ల నుంచి రోడ్లను తొలగించడం/పార్కులను మార్చడం, హెచ్ఎండీఏ పరిధిలో భూవినియోగ మార్పిడి దరఖాస్తుల పరిష్కరణ, హెచ్ఎండీఏ పరిధి విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్, ఓఆర్ఆర్ వ్యవహారాలు, ఆకాశహర్మ్యాల నిర్మాణానికి ప్రత్యేకంగా నిబంధనల మినహాయింపులు, భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు/గేటెడ్ సొసైటీలు/టౌన్‌షిప్‌ల నిర్మాణానికి అనుమతులు, మెట్రో అలైన్‌మెంట్ మార్పులు వంటి అంశాల్లోనూ శివబాలకృష్ణ కీల కంగా వ్యవహరించారని సమాచారం. ఈ క్రమంలో ఆయా అంశాల్లో అనుమతులు, మినహాయింపులు కోరుతూ వచ్చే దరఖాస్తులను పెండింగ్ ఉంచేవా రని.. కొన్నింటికి మాత్రమే వేగంగా పురపాలకశాఖ నుంచి అనుమతులు లభించేవని విమర్శలు ఉన్నా యి. ఈ క్రమంలోనే భారీగా సొమ్ము, బహుమ తులు అందుకునేవారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# మొత్తం ఒకేసారి చెల్లించక్కర్లేదు

- ఆర్ఆర్ఆర్ భూపరిహారంపై కిషన్‌రెడ్డికి కోమటిరెడ్డి లేఖ
- ఇటీవల సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి రాసిన లేఖకు ప్రత్యుత్తరం విడుదల
- రాష్ట్రంలో హైవే పనులు వేగం అయ్యేలా సహకరించాలని వినతి



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణలో రాష్ట్ర ప్రభుత్వం వాటా మొత్తాన్ని ఒకేసారి చెల్లించాల్సిన అవసరం లేదని, ఈమేరకు ఇది వరకే కేంద్ర రాష్ట్రప్రభుత్వాల మధ్య అంగీకారం కుదిరిందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సవివర లేఖ రాశారు. రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి చెల్లించాల్సిన భూపరిహారంలో 50 శాతంగా రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2585 కోట్లను చెల్లించాలంటూ ఇటీవల కిషన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖకు ప్రత్యుత్తరం విడుదల చేశారు. రివాల్వింగ్ ఫండ్ రూపంలో రూ.100 కోట్లు చెల్లించటంతోపాటు, భూసేకరణకు సంబంధించి అవార్డు వారీగా, అవార్డు జారీ అయిన పక్షం రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా జమ చేసేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఇది వరకు అంగీకారం కుదిరిందని అందులో ప్రస్తావించారు. దాని ప్రకారం భూపరిహారంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా ఒకేసారి చెల్లించాల్సిన అవసరం లేదని గుర్తు చేస్తున్నట్టు కోమటిరెడ్డి పేర్కొన్నారు.

**యుటిలిటీ షిఫ్టింగ్ చార్జీలను మేమే చెల్లిస్తామన్నాం కదా..:** యుటిలిటీ షిఫ్టింగ్ చార్జీలను చెల్లించే పరిస్థితి లేదని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేర్కొన్నా, ఆ మొత్తాన్ని చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని జనవరి 11న రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ఏఐకి లేఖ రాసిన విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి గుర్తు చేశారు. ఈమేరకు యుటిలిటీ చార్జీలకు సంబంధించి రెండు ప్రభుత్వాల మధ్య పరిష్కరించుకోవాల్సిన సమస్యలు లేనట్టేనని స్పష్టం చేశారు. భారతమాల పరియోజన పథకం కింద నిర్మిస్తున్న 11 జాతీయ రహదారులకు సంబంధించి 284 హెక్టార్లు మినహా భూసేకరణ చేయలేదని కిషన్ రెడ్డి పేర్కొన్నారని కోమటిరెడ్డి ఆ లేఖలో ప్రస్తావించారు. కానీ ఇప్పటి వరకు రీజినల్ రింగ్‌రోడ్డు మినహా మిగతా ప్రాజెక్టులకు సంబంధించి 2377 హెక్టార్లకు గానూ 1531 హెక్టార్ల భూమిని సేకరించినట్టు గుర్తు చేశారు. తెలంగాణలో జాతీయ రహదారుల పనులు వేగంగా జరిగేలా తెలంగాణ బిడ్డగా సహకరించాలని ఆయన కిషన్‌రెడ్డికి సూచించారు.

# పోలీసుల తీరు అమానుషం

- విద్యార్థిని జుట్టుపట్టుకుని ఈడ్చుకెళ్లిన ఘటనను సుమోటోగా స్వీకరించిన మహిళా కమిషన్
- డీజీపీకి లేఖ... మహిళా పోలీసులపై చర్యలకు ఆదేశం
- ఘటనను ఖండించిన బీజేపీ నేతలు
- కఠిన చర్యలు తీసుకోవాలి: మాజీ మంత్రి సబితారెడ్డి



మాట్లాడుతున్న రుద్రమదేవి

సాక్షి, హైదరాబాద్/కరీంనగర్ టౌన్/ ఏజీ వర్సిటీ: హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని జుట్టు పట్టుకుని మహిళా కానిస్టేబుళ్లు ఈడ్చుకెళ్ళిన ఘటనను రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. విద్యార్థినిపై పోలీసుల చర్య అమానుషమని కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి కమిషన్‌కు నివేదిక సమర్పించాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను ఆదేశించింది.

**ప్రభుత్వ ప్రోత్సాహం ఉంది: బీజేపీ ఆగ్రహం**

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై పోలీసుల దాడిని బీజేపీ ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు రాణీ రుద్రమ, బండారు విజయలక్ష్మి తీవ్రంగా ఖండించారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే వారికి ప్రభుత్వ ప్రోత్సాహం ఉన్నట్టు స్పష్టం అవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ విధానాన్ని విడనాడి, ఈ ఘటనపై వెంటనే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. మహిళా నాయకురాలి జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్ళిన పోలీసులపై ఇప్పటిదాకా సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ధర్నా చౌక్‌ను మూసేసి, ప్రశ్నించే గొంతుకలను నొక్కేసిన దొర పాలనను అంతం చేసి ఒక ప్రత్యా మ్నాయాన్ని కోరుకున్న తెలంగాణ ప్రజల ఆశల మీద నీళ్లు చల్లి రేవంత్‌రెడ్డి మరో కొత్త దొరలా తయారయ్యారని వారు ఆరోపించారు. మహిళా కానిస్టేబుల్స్ వ్యవహరించిన తీరుతో సభ్యసమా జం తలదించుకుంటోందన్నారు. దాడికి పాల్పడిన మహిళా పోలీసులపై చట్టపరంగా చర్యలు తీసుకో వాలని వారు ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు.

**కఠిన చర్యలు తీసుకోవాల్సిందే: బండి**

- ఏబీవీపీ మహిళా నాయకురాలిపై పోలీసులు వ్యవహరించిన తీరును సభ్యసమాజం అసహ్యించుకుంటోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. గురువారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజల కోసం నిజాయితీగా, శాంతియుతంగా పోరాడుతున్న నాయకురాలిని జుట్టు పట్టుకుని స్కూటీపై ఈడ్చుకుంటూ లాక్కుపోతారా? ఇంతకన్నా హేయమైన చర్య ఉంటుందా అని మండిపడ్డారు. తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని బండి డిమాండ్ చేశారు.

**ఇది అత్యంత అమానుషం: సబిత**

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా వచ్చిన మహిళా నేత పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు అత్యంత అమానుష చర్య అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రంగా ఖండించారు. విద్యార్థినిపై జులుం ప్రదర్శించిన కానిస్టేబుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజధానికి అత్యంత సమీపంలోనే ఈ ఘటన జరగడం ప్రభుత్వ వైఫల్యాన్ని చాటుతోందన్నారు.

# ఓటర్లపై ఒత్తిడి తెస్తే.. చర్యలు తీసుకోవాల్సిందే!

- తనకు ఓటేయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని ఇటీవల ఓ అభ్యర్థి అన్నారు
- అలాంటి వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోకుండా వదిలేయడం సరికాదు: గవర్నర్ తమిళిసై
- సరైన వ్యక్తిని ఎంపిక చేసుకునే అవకాశం ఓటుతోనేనని వ్యాఖ్య




కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై

కూకట్‌పల్లి (హైదరాబాద్): ''ప్రజలు స్వేచ్ఛాపూరిత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉండాలి. ఓటర్లను ప్రలోభపెట్టేలా, ఒత్తిడి చేసేలా అభ్యర్థులు వ్యవహరిస్తే వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ బాగా పనిచేసింది. కానీ ఓ అభ్యర్థి తనకు ఓటేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ ప్రచార మాధ్యమాలలోకెక్కారు. అది విచారకరం. ప్రజలను ఒత్తిడికి గురిచేసి గెలవడానికి అభ్యర్థి ప్రయత్నిస్తే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోకపోవడం సరికాదు..''అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ విమర్శించారు. గురువారం మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ ఆడిటోరియంలో జరిగిన 14వ జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో గవర్నర్ ప్రసంగించారు. ప్రజలు ఓటు హక్కును ఆయుధంలా ఉపయోగించుకుని తమ జీవన పరిస్థితులకు మార్చుకోవచ్చని.. ఆ మార్పే దేశ భవిష్యత్తుకు దిక్సూచిగా మారుతుందని స్పష్టం చేశారు.

**మంచి వారికి ఓటేయాలి..**

తమ సమస్యలను వినడంతోపాటు అభివృద్ధి చేయగల సరైన వ్యక్తిని ఎంపిక చేసుకునే అవకాశం ఓటు ద్వారానే లభిస్తుందని.. అభ్యర్థుల గుణగణాలను పూర్తిగా విశ్లేషించాకే ఓటేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. గుంతల రోడ్లను చూసి ఎమ్మెల్యేలు, ఎంపీలను తిట్టేకంటే ముందు మంచివారికి ఓటు వేయటం మంచి నిర్ణయమన్నారు. ఓటింగ్ సమయంలో వచ్చిన సెలవులను ఉపయోగించుకొని కుటుంబంతో కలసి విహార యాత్రలకు వెళ్తున్నారని.. ఆ ఆలోచన సరికాదని స్పష్టం చేశారు. యువత ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు.

**గెలవకుంటే శవయాత్ర అంటూ..**

గతంలో కేసీఆర్ సర్కారు పాడి కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీగా సిఫార్సు చేయగా గవర్నర్ పెండింగ్‌లో పెట్టడం, దీంతో కౌశిక్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం అప్పట్లో కలకలం రేపింది. ఇక ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తనను గెలిపించకపోతే కుటుంబమంతా ఆత్మహత్య చేసుకుంటామని పాడి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఫలితాల తర్వాత తాను గెలిస్తే జైత్రయాత్ర, లేకుంటే శవయాత్ర జరుగుతుందని ఆయన పేర్కొనడం కూడా తీవ్ర దుమారం రేపింది. ప్రస్తుతం కౌశిక్‌రెడ్డిని ఉద్దేశిస్తూ గవర్నర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

## ప్రజాస్వామ్యంలో యువత పాత్ర కీలకం

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి**



సాక్షి, హైదరాబాద్: ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత పాత్ర కీలకమని రాష్ట్ర ఎన్నికల కమిష నర్ పార్థసారథి తెలిపారు. యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రతి ఏడాది జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తు న్నట్టు చెప్పారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్స వం సందర్భంగా దేశవ్యాప్తంగా అర్హులైన యువత ఓటు నమోదుతో పాటు ప్రతిఎన్నిక లోనూ ఓటు హక్కు వినియోగించుకునేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురు వారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్థసారథి మాట్లా డుతూ కేంద్ర ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి గల రాజ్యాంగసంస్థగా అవతరించినందుకు ''నేషనల్ ఓటర్స్ డే''జరుపుకుంటున్నామని చెప్పారు. అనంతరం ఆయన సిబ్బందితో కలిసి జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు.


## యువ ఓటర్లు నమోదు చేసుకోండి

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపు**

సాక్షి, హైదరాబాద్: యువ ఓటర్లు, కొత్తగా ఓటు హక్కుకు అర్హులైన వారంతా కూడా తమ సమీప పోలింగ్ బూత్‌ల్లో, నివాస ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశమైనందున.. యువత చురుకై న పాత్ర నిర్వహించాల్సి ఉందని అభిప్రాయపడ్డా రు. కేంద్ర ఎన్నికల సంఘం గురువారం దేశవ్యా ప్తంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని ఓటర్ జాబితాలో నమోదు చేసేందుకు యంగ్ ఓటర్స్ డే నిర్వహించిందని పేర్కొన్నారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్‌లో తాను గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌తో కలిసి పాల్గొన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులు, ఎన్జీవోలు, విద్యాసంస్థలు కూడా భాగస్వాములవుతున్నారని కిషన్ రెడ్డి వెల్లడించారు.

# ఆ పిల్‌కు నంబర్ చేయండి: హైకోర్టు

**బీఆర్ఎస్‌కు 11 ఎకరాల కేటాయింపుపై పిటిషన్**



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేటలో బీఆర్ఎస్ పార్టీకి 11 ఎక రాలు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)కు నంబర్ చేయాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. అనంతరం విచారణ చేపడతామని స్పష్టం చేసింది. గత సంవత్సరం కోకాపేట సర్వే నంబర్ 239, 240లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ నిర్మాణం కోసం బీఆర్ఎస్‌కు 11 ఎకరాలను రూ.3.41 కోట్లకే కట్టబెట్టారని, అక్కడ మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి రూ.550 కోట్లు విలువ చేస్తుందని పేర్కొంటూ హైకోర్టులో న్యాయవాది ఎ.వెంకట్రామిరెడ్డి పిల్ దాఖలు చేశారు. అత్యంత విలువైన భూమిని అదే పార్టీ అధికారంలో ఉండగా స్వల్ప ధరకు కేటాయించడం ప్రజాధనం దుర్వినియోగం కిందకే వస్తుందని పేర్కొన్నారు. ఈ భూమి కేటాయింపు అంతా చట్టవిరుద్ధంగా జరిగిందని, గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణ యాన్ని రద్దు చేయాలని న్యాయస్థానాన్ని విజ్ఞప్తి చేశారు. అయితే పిటిషన్‌పై పలు అభ్యంతరాలు తెలుపుతూ నంబర్ కేటాయించేందుకు రిజిస్ట్రీ తిరస్కరించింది. ఫైల్ నంబర్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. రిజిస్ట్రీ అభ్యంతరాలపై పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వివరణ ఇవ్వడంతో.. నంబర్ కేటాయించాలని ధర్మాసనం ఆదేశించింది. కాగా, ఇదే అంశంపై గతంలోనూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. గత ఆగస్టులో దీనిపై విచారణ చేపట్టిన నాటి ధర్మాసనం ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీకి నోటీసులు జారీ చేసింది. ఇకపై ఈ రెండు పిల్‌లను కలిపే సీజే ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

# కక్షపూరితంగా కేసులు పెడితే ఊరుకోం

**ఎమ్మెల్సీ కవిత**



జైలు బయట విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

జగిత్యాలజోన్: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కక్షపూరితంగా కేసులు పెడితే చూస్తూ ఊరుకోమని, చట్టపరంగా ఎదుర్కొంటామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఓ కేసులో అరెస్టయి జగిత్యాల స్పెషల్ సబ్ జైల్లో ఉన్న హబ్సీపూర్ గ్రామ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డిని గురువారం కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె జైలు బయట విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ఓర్వలేక, అధికారం మారగానే ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తమ కార్యకర్తలు, నాయకులపై కక్షపూరితంగా కేసులు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో ప్రజలను పువ్వుల్లో పెట్టుకుని చూసుకున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'కాంగ్రెస్ రాజ్యమా.. ఖాకీల రాజ్యమా'అనే విధంగా వ్యవహారం నడుస్తోందని దుయ్యబట్టారు. 'అలవికాని వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు, ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రయత్నించండి'అని హితవు పలికారు. వ్యవసాయ యూనివర్సిటీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థినులను జుట్టు పట్టి మహిళా పోలీసులు లాక్కెళ్లిన సంఘటనలు జరగడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత పోలీసులు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట విద్యాసాగర్‌రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




# సాక్షి హైదరాబాద్

శుక్రవారం ׀ 26 ׀ జనవరి ׀ 2024








భారత్, ఇంగ్లండ్ జట్లు









పిచ్‌లోకి దూసుకువచ్చిన అభిమాని



స్టేడియాన్ని ఆర్ట్ వేస్తున్న చిత్రకారుడు

## ఆబాల గోపాలం

**ఆహ్లాదకర వాతావరణం..** కొత్త రంగులతో ఆకర్షణీయంగా మారిన స్టేడియం.. మొదటిసారి నాలుగు వైపుల నుంచి పూర్తిస్థాయిలో పైకప్పు రావడంతో ఎండ బెడద నుంచి ఉపశమనం.. ఆపై మైదానంలో మన ఆటగాళ్ల జోరు... మొత్తంగా భారత్, ఇంగ్లండ్ టెస్టు మ్యాచ్ తొలిరోజు అభిమానుల అంచనాలకు తగినట్లుగా సరైన వినోదాన్ని పంచింది. గురువారం పెద్ద సంఖ్యలో అభిమానులు మ్యాచ్‌కు హాజరయ్యారు. హెచ్‌సీఏ ప్రత్యేక ఏర్పాటుతో నగరంలోని వేర్వేరు స్కూళ్ల నుంచి వచ్చిన విద్యార్థులు కూడా ఇందులో ఉన్నారు. ఉదయం టాస్‌కు ముందు ప్రాక్టీస్ సమయం నుంచే కోలాహలం కనిపించింది. 90 డెసిబుల్స్‌తో స్టేడియం హోరెత్తింది. ఇంగ్లండ్ వికెట్ పడినప్పుడల్లా మైదానం మార్మోగింది. లోకల్ ప్లేయర్ సిరాజ్ బౌలింగ్‌కు వచ్చినప్పుడు అంతా ఉత్సాహపరిచారు. భారత్ బ్యాటింగ్ సమయంలో కూడా యశస్వి చక్కటి షాట్లు అందరినీ అలరించాయి. రోహిత్ ఔటైనప్పుడు మాత్రమే కాస్త నిశ్శబ్దం కనిపించింది. ఇంగ్లండ్ తమ మూడు రివ్యూలు వృథా చేసుకున్నప్పుడు అభిమానులంతా గోల చేశారు. హెచ్‌సీఏ లెక్కల ప్రకారం మ్యాచ్‌కు దాదాపు 25 వేల మంది వచ్చారు. కాగా.. రోహిత్ శర్మ బ్యాటింగ్‌కు వచ్చిన కొద్దిసేపటికే ఒక అభిమాని పిచ్ వరకు దూసుకొచ్చి అతని కాళ్లకు నమస్కరించడం కొంతసేపు గందరగోళం రేపింది. కోహ్లి నంబర్ 18 జెర్సీతో అతడు కనిపించాడు. సెక్యూరిటీ సిబ్బంది ఆ తర్వాత అతడిని బయటికి లాక్కెళ్లారు. ఈ ఘటన భద్రత లోపాన్ని ఎత్తి చూపించింది.

– సాక్షి, హైదరాబాద్

## న్యూస్‌రీల్

### జైలర్ రామయ్యకు రాష్ట్రపతి మెడల్



**చంచల్‌గూడ:** తెలంగాణ జైళ్ల శాఖలో అత్యుత్తమ సేవలకు గాను జైలర్ యదారి రామయ్యను ప్రతిష్టాత్మక రాష్ట్రపతి పతకం వరించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన రామయ్య ఎకనామిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి 1999లో డిప్యూటీ జైలర్‌గా ఎంపికయ్యారు. ప్ర స్తుతం ఆయన నగరంలోని జైళ్ల శాఖ ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్నారు. ఈ సందర్భంగా రామయ్యను డీజీ సౌమ్యా మిశ్రా అభినందించారు.

### నేటి నుంచి ఆనంద్ ఉత్సవ్

**సాక్షి, సిటీబ్యూరో:** ప్రతిష్టాత్మక ఆనంద్ ఉత్సవ్‌కు హైదరాబాద్ వేదికగా నిలిచింది. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా ఈ ఉత్సవాలు ఇక్కడ నిర్వహిస్తున్నామని శ్రీనాథ్ జీ ధ్వజాజీ ఆనంద్ ఉత్సవ్ కమిటీ వెల్లడించింది. సనాతన ధర్మం విలువలు సమాజంలో మరింత మందికి తెలియజెప్పేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపింది. ఆనంద్ ఉత్సవ్ వేడుకలు నెక్లెస్‌రోడ్ జలవిహార్‌లో నేటి నుంచి ఈ నెల 28 వరకు జరగనున్నాయి. వేడుకలకు విశిష్టతను వివరించే పుస్తకాన్ని నిర్వాహకులు ఆవిష్కరించారు. రాజస్థాన్ ఉదయ్‌పూర్ శ్రీకృష్ణ ఆలయం నుంచి తెచ్చిన ధ్వజాజీని భక్తుల దర్శనం కోసం ఇక్కడ ఏర్పాటు చేయనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు చైతన్య తెలిపారు.

### పబ్లిక్ గార్డెన్స్ కేంద్రంగా నేడు ట్రాఫిక్ మళ్లింపులు

**రాజ్‌భవన్ రోడ్డులోనూ నిర్ణీత సమయంలో..**

**సాక్షి, సిటీబ్యూరో:** గణతంత్ర వేడుకలు జరిగే పబ్లిక్ గార్డెన్స్ కేంద్రంగా శుక్రవారం ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు గురువారం అదనపు సీపీ పి.విశ్వప్రసాద్ పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయి. ఈ సమయంలో తాజ్ ఐలాండ్, చాపెల్ రోడ్ జంక్షన్, ఓల్డ్ సైఫాబాద్ పీఎస్ చౌరస్తా, బషీర్‌బాగ్ జంక్షన్, ఇక్బాల్ మీనార్, ఏఆర్ పెట్రోల్ పంప్, ఆదర్శనగర్ కేంద్రంగా సాధారణ వాహనాల రాకపోకలను మళ్లిస్తారు. గవర్నర్ అధికారిక నివాసం రాజ్‌భవన్‌లోనూ శుక్రవారం ఎట్ హోమ్ జరగనుంది. ఈ నేపథ్యంలో సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల మధ్య రాజ్‌భవన్ రోడ్డులోకి వచ్చే వాహనాలను మళ్లిస్తారు.

### లిటరరీ ఫెస్టివల్‌కు సర్వం సిద్ధం

**నేటి నుంచి 3 రోజుల పాటు హెచ్‌ఎల్‌ఎఫ్**

**సాక్షి, సిటీబ్యూరో:** నగరం వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్'కు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి ఆదివారం వరకు హైటెక్ సిటీలోని సత్త్వ నాలెడ్జ్ సిటీ వేదికగా ఫెస్ట్ కొనసాగనుంది. సాహిత్యం, సంస్కృతి, సామాజిక అంశాలపైన పలు చర్చా కార్యక్రమాలు, ప్రముఖ సాహితీవేత్తల ప్రసంగాలు, ఆయా రంగాల్లోని ఔత్సాహికుల విభిన్న కార్యక్రమాలతో మూడు రోజుల పాటు వైవిధ్యభరిత సాహితీ పండగను నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు పుస్తక పరిచయాలు, ఆవిష్కరణలు, యువ రచయితల అవగాహన చర్చలు, సాహితీ వైభవం తదితర కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయి.

# వీళ్లు మారరు!



## మరో ప్రాణం తీసిన డ్రంకన్ డ్రైవింగ్

- సిబ్బంది కొరతతో డ్రైవ్‌లకు ఇబ్బందులు
- కేసులు పెడుతున్నా మారని మందుబాబులు
- జూబ్లీహిల్స్ తారక్ ఉదంతంలో ఉద్రిక్తత సైతం
- రానున్న రోజుల్లో మరిన్ని కఠిన చర్యలకు ట్రాఫిక్ పోలీసుల నిర్ణయం

**సాక్షి, సిటీబ్యూరో:** కొన్నిరోజుల క్రితం డీకే నగర్‌లో స్టూడెంట్ దేవి.. ఆ మధ్య పంజగుట్ట వద్ద చిన్నారి రమ్య కుటుంబం.. తాజాగా జూబ్లీహిల్స్‌లో బౌన్సర్ తారక్.. సంచలనం సృష్టించి, రికార్డులకెక్కిన 'డ్రంక్ డ్రైవింగ్' ప్రమాదాలు ఇవి. వీటికి తోడు వెలుగులోకి రాని ఉదంతాలెన్నో. గతంలో ప్రమాదాలకు భిన్నంగా.. బుధవారం నాటి ప్రమాదం ఉద్రిక్తతలకు దారి తీసింది. సీసీ కెమెరాలకు కూడా నంబర్ ప్లేట్ చిక్కని వేగంతో కారు నడిపి, బౌన్సర్ తారక్ మృతికి కారణమైన రిత్విక్ రెడ్డి కూడా మద్యం మత్తులో ఉన్నట్లు జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం ప్రకటించారు. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఏటా ఎందరు జైలుకు వెళ్తున్నా, నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా మందుబాబుల్లో మాత్రం మార్పు రావడంలేదు.

### వేధిస్తున్న సిబ్బంది కొరత..

రాత్రి వేళల్లో మద్యం తాగేవారికి, ఆ స్థితిలో వాహనాలు నడిపే వారికి సమయం, సందర్భం అంటూ ఉండదు. డ్రంక్ డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు మాత్రం ఇవి ఉంటాయి. ప్రధానంగా వీకెండ్స్‌గా పిలిచే శుక్ర, శనివారాల్లో రెగ్యులర్‌గా, మిగిలిన సమయాల్లో ఆకస్మికంగా ఈ తనిఖీలు చేపడుతున్నారు. ఈ డ్రైవ్స్ నిర్వహణకూ నిర్ణీత సమయం ఉంటోంది. ఎప్పుడైనా కానీ కొన్ని గంటలు మాత్రమే చేపట్టగలుగుతున్నారు. ఈ విధులు నిర్వర్తించిన, పర్యవేక్షించిన వారే మరుసటి రోజూ విధులకు హాజరు కావాల్సి ఉండటంతో ఇలా చేయాల్సి వస్తోంది. ట్రాఫిక్ విభాగంలో ఉన్న సిబ్బంది కొరత నేపథ్యంలో ప్రతి రోజూ, రాత్రంతా డ్రంక్ డ్రైవింగ్ తనిఖీలు చేపట్టలేకపోతున్నారు. దీన్నే మందుబాబులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

**గత ఏడాది డ్రంక్ డ్రైవింగ్ కేసులు..**

- మొత్తం కేసులు: 37,866
- చార్జ్‌షీట్ దాఖలు చేసినవి: 37,956 (పాత వాటితో కలిపి)
- మందుబాబులకు విధించిన జరిమానా: రూ.8,22,83,024
- జైలుశిక్ష పడినవాళ్లు: 3,782
- డ్రైవింగ్ లైసెన్స్ రద్దయినవాళ్లు: 556

### తెలివిమీరుతున్న మందుబాబులు..

ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించే రోజులు, సమయాలు, స్థలాలను గమనిస్తున్న మందుబాబులు తెలివిమీరి ప్రవర్తిస్తున్నారు. డ్రంక్ డ్రైవింగ్‌పై తనిఖీలు ఉండని రోజుల్లో, సమయాల్లో రెచ్చిపోతున్నారు. అవి జరిగే వారాంతాల్లోనూ గల్లీలు, ఇతర మార్గాలను అనుసరిస్తూ పోలీసులకు చిక్కట్లేదు. కొందరైతే ఏకంగా వాట్సాప్ గ్రూపుల్లో డ్రంక్ డ్రైవింగ్ జరిగే ప్రాంతాలు, సమయాలకు సంబంధించిన సమాచార మార్పిడి చేసుకుంటూ వాహనాలపై దూసుకుపోతున్న సందర్భాలూ ఉన్నాయి. ఇదే అనేక సందర్భాల్లో ప్రమాదహేతువుగా మారుతోంది. మద్యం తాగి వాహనం నడుపుతూ తామంతట తాము ప్రమాదానికి లోనైన ఉదంతాలు అసలు వెలుగులోకే రావడం లేదు. ఎదుటి వారిని ఢీకొట్టినప్పుడో, సంచలనాత్మక ఉదంతం జరిగినప్పుడో మాత్రమే ఈ విషయం వెల్లడవుతోంది.

### తీవ్రమైన సెక్షన్లతో కేసులు..

సాధారణంగా రోడ్డు ప్రమాద సంబంధ ఉదంతాలు చోటు చేసుకున్నప్పుడు పోలీసులు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)లోని సెక్షన్ 304 (ఎ) కింద కేసు నమోదు చేస్తారు. డ్రంక్ డ్రైవింగ్ చేస్తూ ఎదుటి వారి మరణానికి కారణమైన వారిపై ఐపీసీలోని సెక్షన్ 304 (పార్ట్–2) కింద కేసు నమోదు చేయడం ప్రారంభించారు. '304 ఏ' అంటే నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ఓ ప్రాణం పోవడానికి కారణం కావడం. అయితే మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదుకు ఐపీసీలోని 304 పార్ట్ 2 సెక్షన్ సరిగా సరిపోతుందని పోలీసులు నిర్ణయించారు. అంటే మద్యం తాగిన సదరు వ్యక్తి తన డ్రైవింగ్ వల్ల ఎదుటి వారికీ ప్రాణహాని ఉంది అని తెలిసీ పట్టించుకోకపోవడమని అర్థం. ఇలాంటి కేసుల్లో బెయిల్ సైతం తొందరగా లభించదు. న్యాయస్థానంలో నిరూపితమైతే గరిష్టంగా పదేళ్ల నుంచి జీవిత ఖైదు లేదా జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది. ఈ సెక్షన్ కింద నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ సైతం లభించదు.



### ప్రమాదం జరిగితే పక్కా చర్యలు..

తాజా పరిణామాల నేపథ్యంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వ్యక్తి వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలతో పాటు ఇతర ప్రమాదాల్లోనూ మద్యం పరీక్షలు తప్పనిసరి చేస్తున్నారు. దాదాపు ప్రతి రోడ్డు ప్రమాదం కేసులోనూ దానికి బాధ్యులైన వ్యక్తికి శాంతిభద్రతల విభాగం అధికారులు ట్రాఫిక్ పోలీసుల సాయంతో తక్షణమే బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. దీంతో పాటు ఈ ఏడాది ప్రారంభం నుంచి డ్రగ్ పరీక్షలు, అవసరమైన సందర్భాల్లో రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేయించడం ద్వారా వైద్యులు ఇచ్చే పత్రాలను కేసు ఫైల్‌లో చేరుస్తున్నారు. సదరు వ్యక్తి మద్యం తాగి ఉన్నట్లు తేలితే... 304 పార్ట్ 2 తదితర సెక్షన్లను జోడిస్తున్నారు. ప్రమాదం 21 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న వారి వల్ల జరిగితే.. వారు మద్యం తాగిన బార్/పబ్, విక్రయించిన వైన్ షాపు లైసెన్సు రద్దుకు సిఫార్సు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తి/డ్రంకన్ డ్రైవ్‌లో చిక్కిన ఉల్లంఘనులు డ్రైవింగ్ లైసెన్స్ లేని వాడైతే ఆ వాహనం ఎవరి పేరిట ఉందో ఆ యజమానిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

# రూ. 2,100 కోట్లు

**ఈ ఏడాది ఆస్తిపన్ను వసూలు లక్ష్యం ఇది..**

**ఇప్పటికి వసూలైంది రూ.1,270 కోట్లు**

**సాక్షి, సిటీబ్యూరో:** ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) జీహెచ్‌ఎంసీ ఆస్తి పన్ను వసూలు లక్ష్యం రూ.2,100 కోట్లు. కానీ ఇప్పటి వరకు వసూలైంది రూ. 1270 కోట్లే. అంటే దాదాపు 60 శాతం. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మార్చి నెలాఖరు వరకు గడువున్నప్పటికీ, ఈలోగా పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే ఈ శాఖలోని సిబ్బంది ఎన్నికల పనుల్లో నిమగ్నమవుతారు. అప్పుడు వసూళ్లు కష్టం. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే త్వరితగతిన ఆస్తిపన్ను లక్ష్యాన్ని పూర్తిచేయాలని కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశించినప్పటికీ వసూళ్లు జరగలేదు. ఈ నేపథ్యంలో లక్ష్యం సాధ్యమేనా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

### పట్టింపులేని ఉన్నతాధికారులు

సర్కిళ్లు, జోన్లవారీగా భారీగా ఆస్తిపన్ను బకాయి ఉన్న వారిని లక్ష్యంగా చేసుకొని వసూళ్లు చేయాలని కమిషనర్ ఆదేశించినప్పటికీ, జోనల్.. సర్కిల్‌ల స్థాయిలో జోనల్, డిప్యూటీ కమిషనర్లు ఆ పని చేయలేదని తెలుస్తోంది. ట్యాక్స్ సిబ్బందిపైనే విరుచుకుపడుతున్న ఉన్నతాధికారులు తమ స్థాయిలో చేయాల్సిన పనులు చేయడం లేరని సిబ్బంది చెబుతున్నారు. గతంలో జోనల్, డిప్యూటీ కమిషనర్లతో పాటు కమిషనర్ సైతం భారీ బకాయిలున్న సంస్థలతో సంప్రదింపులు జరిపి వసూళ్లయ్యేందుకు కృషి చేసేవారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలోని ఉన్నతాధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ జోన్లలో 60 శాతానికి పైగా ఆస్తిపన్ను వసూలైనప్పటికీ, మిగతా జోన్లలో ఆమాత్రం కూడా కాలేదు. ఉప్పల్, హయత్‌నగర్ వంటి సర్కిళ్లలోనూ దాదాపు యాభై శాతం మాత్రమే ఆస్తిపన్ను వసూళ్లు జరిగాయంటే పరిస్థితిని అంచనా వేసుకోవచ్చు. జనవరి నెల వసూళ్ల లక్ష్యం రూ.250 కోట్లు కాగా ఇప్పటి వరకు వసూలైంది రూ.25 కోట్లే అంటే మిగతా లక్ష్యం ఎలా సాధ్యమో అధికారులకే తెలియాలి.

# ఒకే కాన్పులో నలుగురు పిల్లలు





**మేడ్చల్ రూరల్:** ఓ మహిళ ఒకే కాన్పులో నలుగురికి పిల్లలకు జన్మనిచ్చింది. ఏడో నెలలో పురిటి నొప్పులు రావడంతో ఆస్పత్రికి వెళ్లిన గర్భిణికి వైద్యులు సాధారణ ప్రసవం చేయగా ఇద్దరు మగ, ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలం రాజబొల్లారం తండాకు చెందిన సులోచన, మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన అనిల్‌కుమార్ దంపతులు. వీరు ఇదే జిల్లాలోని కుత్బుల్లాపూర్ డివిజన్ జగద్గిరిగుట్టలో నివాసం ఉంటున్నారు. సులోచన 7 నెలల గర్భిణి. గురువారం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఘనాపూర్ గ్రామ పరిధిలోని మెడిసిటి ఆస్పత్రిలో చేర్పించారు. గైనకాలజిస్టులు డాక్టర్ కల్పన, నిషి వైద్య బృందం సులోచనకు సాధారణ ప్రసవం చేశారు. మొదట 800, 500 గ్రాముల బరువున్న ఇద్దరు మగపిల్లలు, అయిదు నిమిషాల తర్వాత 600, 900 గ్రాముల బరువులో మరో ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. తల్లీ పిల్లల ఆరోగ్యం నిలకడగా ఉందని, పిల్లలు తక్కువ బరువుతో పుట్టడంతో నగరంలోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.



సెక్రటేరియట్





అసెంబ్లీ భవనం



గన్‌పార్క్ అమరవీరుల స్తూపం

## త్రివర్ణ వెలుగులు

గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలను మువ్వన్నెల విద్యుద్దీపాలతో అలంకరించారు. హుస్సేన్‌సాగర్ తీరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం, నాంపల్లిలోని అసెంబ్లీ భవనం, గన్‌పార్క్ అమర వీరుల స్తూపం గురువారం రాత్రి ఇలా మూడు రంగుల శోభతో తళుకులీనుతూ కనిపించాయి. కాగా.. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో భారత మాతకు మహా హారతి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గురువారం భారత మాత విగ్రహాన్ని ప్రసాద్ ఐమ్యాక్స్ మీదుగా కళా సాంస్కృతిక ప్రదర్శనల నడుమ పీపుల్స్ ప్లాజా వరకు తీసుకువచ్చారు.

# అతివేగం..అదే నిర్లక్ష్యం.!

నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ఎదుటివారి ప్రాణాలు బలిగొంటున్నారు కొందరు. దీనికి తోడు తాగుతూ.. ఊగుతూ రోడ్డుపై వెళ్లేవారి ప్రాణాలు తీస్తున్నారు. నగరంలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు..



వివరాలు వెల్లడిస్తున్న జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, డీఐ వీరశేఖర్

### కారులోనే పార్టీ.. బైక్‌ను ఢీకొట్టి...

**బంజారాహిల్స్:** తాగి అతి వేగంతో కారులో దూసుకెళ్తూ ఓ యువకుడి ప్రాణాలను బలిగొన్న ఘటనలో నిందితులను అరెస్ట్ చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. అరెస్టైన వారిలో ఓ యువతి కూడా ఉంది. ఏసీపీ హరిప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుకారాంగేట్‌కు చెందిన కొవ్వూరి రుత్విక్‌రెడ్డికి ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం వచ్చింది. బుధవారం డ్యూటీలో జాయిన్ కావాల్సి ఉంది. దీంతో తన స్నేహితులు.. ఓ యువతి పాలసాని లోకేశ్వరరావు, బుల్లా అభిలాశ్, మొగదంపల్లి అనికేత్‌లకు ఆఫీస్ చూపించాలనుకున్నాడు. స్నేహితులను తీసుకుని తన బావ నాగచరణ్ రెడ్డికి చెందిన వెర్నా కారులో మంగళవారం రాత్రి అడ్డగుట్ట నుంచి బయలుదేరాడు. అక్కడే ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం కొనుగోలు చేసి కారులోనే తాగుతూ అర్ధరాత్రి గచ్చిబౌలి చేరుకుని తన ఆఫీస్ చూపించాడు. అనంతరం కేబుల్ బ్రిడ్జి వద్దకు వెళ్లిన వారు కాసేపు అక్కడ డ్యాన్స్ చేసి తెల్లవారుజామున(బుధవారం) 4 గంటల ప్రాంతంలో మాదాపూర్ వచ్చారు. అక్కడ ఓ బిర్యానీ పాయింట్‌లో బిర్యానీ తిని.. 4.30 గంటలకు మళ్లీ కేబుల్ బ్రిడ్జి వద్దకు వచ్చారు. కాసేపు అక్కడే ఉండి.. ఇంటికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మాదాపూర్ మీదుగా రుత్విక్‌రెడ్డి అతి వేగంగా కారు నడుపుతూ జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి కమాన్ వద్ద ఓ స్కూటర్‌ను ఢీకొట్టి ఆగకుండా ఉడాయించాడు. ఈ ఘటనలో స్కూటర్ నడుపుతున్న తారక్‌రామ్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు యశోద ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. దర్యాప్తు చేపట్టిన జూబ్లీహిల్స్ పోలీసులు 100కు పైగా కెమెరాలను జల్లెడ పట్టగా.. పంజగుట్టలో ఓ సీసీ కెమెరాలో నిందితుల ఆచూకీ గుర్తించి గురువారం వారిని అరెస్ట్ చేశారు. రుత్విక్‌రెడ్డి బీహెచ్‌ఈఎల్‌లో దాచిపెట్టిన కారును సైతం స్వాధీనం చేసుకున్నారు. కాగా, కారులో ఉన్న యువతి మాస్టర్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సు పూర్తి చేయగా.. అభిలాష్ జాబ్ అన్వేషణలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

### పరారీలో సురేశ్‌రెడ్డి..

రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత రుత్విక్‌రెడ్డి బాలానగర్‌లో ఉంటున్న తన బంధువు గుడిమెట్ల సురేశ్‌రెడ్డి ఇంటికి వెళ్లాడు. అనంతరం వీరిద్దరూ కలిసి ప్రమాదానికి కారణమైన కారులోనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు ఉండటంతో అక్కడి నుంచి పరారయ్యారు. సురేశ్‌రెడ్డి తన కారులో యువతితో పాటు మిగతా ముగ్గురిని వారి ఇళ్లల్లో దింపేసి వెళ్లిపోయాడు. రుత్విక్‌రెడ్డి మాత్రం వెర్నా కారును తీసుకెళ్లి బీహెచ్‌ఈఎల్ దాచాడు. ఈ ఘటనలో సురేశ్‌రెడ్డిపైనా కేసు నమోదు కాగా.. నిందితుడు పరారీలో ఉన్నాడు.

### కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం..



రవి(ఫైల్)

**మణికొండ:** ఓఆర్ఆర్‌పై బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు.. రామచంద్రాపురం మండలం, వెలిమల గ్రామానికి చెందిన బి.రవి(43) హెచ్‌సీయూలో పనిచేస్తున్నాడు. బుధవారం ఎల్‌బీనగర్ కోర్టుకు వెళ్లిన అతను తిరిగి వస్తుండగా పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన టాటా నెక్సాన్ అతడి బైక్‌ను వేగంగా ఢీ కొట్టింది. దీంతో రవి పక్కనున్న సైకిల్ ట్రాక్‌పై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

### మరో ఘటనలో..



**బంజారాహిల్స్:** అదుపుతప్పిన వేగంతో ఆగి ఉన్న బీఎండబ్ల్యూ కారును ఢీకొట్టిన ఘటనలో మాజీ మంత్రి డ్రైవర్‌పై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అమీర్‌పేటలో నివసించే శ్రీనివాసులు తన యజమానికి చెందిన బీఎండబ్ల్యూ కారును గురువారం మధ్యాహ్నం ఎమ్మెల్యే కాలనీ బ్యాంక్ ఎదుట నిలిపాడు. అదే సమయంలో స్కార్పియో కారు వేగంగా వచ్చి ఆగి ఉన్న బీఎండబ్ల్యూను ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ స్కార్పియో కారును అక్కడే వదిలేసి పారిపోయాడు. ప్రమాద సమయంలో తాను కారులోనే ఉన్నానని, భుజానికి గాయమైందని శ్రీనివాస్ ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా నిందితుడు మాజీ మంత్రి చంద్రశేఖర్ కారు డ్రైవర్ ప్రభాకర్‌గా గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీసీఎస్ పోలీస్ స్టేషన్ ప్రారంభం



సీసీఎస్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

**జీడిమెట్ల:** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీఎస్ పోలీస్ స్టేషన్‌ను సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి గురువారం ప్రారంభించారు. బాలానగర్ జోన్‌లో నేరాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలతో మమేమకమవుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో బాలానగర్ డీసీపీ శ్రీనివాస్ రావు, క్రైమ్స్ డీసీపీ నర్సింహ, అడిషనల్ డిసిపి నర్సింహరెడ్డి, క్రైమ్ ఏసీపీ అసీముల్లా, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## నడుస్తున్న కారులో మంటలు



**పంజగుట్ట:** నడుస్తున్న కారులో నుండి ఒక్కసారిగా మంటలు రావడంతో వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గురువారం రాత్రి తెలుగుతల్లి ఫ్లైఓవర్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సెక్రటేరియట్‌లో జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో విధులు నిర్వహించే రవీందర్ గురువారం రాత్రి డ్యూటీ ముగిసిన అనంతరం మరో వ్యక్తితో కలిసి స్విఫ్ట్ కారులో ఇంటికి బయలుదేరాడు. తెలుగుతల్లి ఫ్లైఓవర్ వద్దకు రాగానే కారులో నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో భయాందోళనకు గురైన వారు కారుదిగి బయటికి పరుగులు తీశారు. వాహనదారుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఫైర్ సిబ్బంది సహకారంతో మంటలను అదుపులోకి తెచ్చారు.

## కుమార్తెతో అసభ్య ప్రవర్తన

నిందితుడికి యావజ్జీవ శిక్ష

**అబ్దుల్లాపూర్‌మెట్:** మద్యం మత్తులో కన్న కూతురి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధించింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మండల పరిధిలోని గండిచెరువుకు చెందిన దేశగోని ఆనంద్‌గౌడ్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్యానికి బానిసైన ఆనంద్ తరచూ కుటుంబ సభ్యులను కొడుతుండేవాడు. గత ఏడాది అక్టోబర్ 22న ఇంట్లో ఎవరూ లేని సమయంలో కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఈ విషయాన్ని తల్లికి చెప్పడంతో ఆమె పోసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సాక్ష్యాధారాలను సేకరించి నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో అనంతరం ఎల్‌బీనగర్‌లోని 9వ అదనపు న్యాయమూర్తి, స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి హరీష గురువారం నిందితుడికి జీవిత ఖైదు, రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి, నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందికి రాచకొండ సీపీ సుధీర్‌బాబు రివార్డులు ప్రకటించినట్లు సీఐ మన్మోహన్ తెలిపారు.

## నమ్మించి ముంచేశాడు..

వృద్ధురాలికి సాయం చేస్తున్నట్లు నటించి రూ. 35 లక్షలు టోకరా

**వెంగళరావునగర్:** వృద్ధులకు సేవ చేస్తున్నట్లు నటిస్తూ వారి నుంచి ఓ యువకుడు రూ. 35 లక్షలకు పైగా కాజేసిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కె.రాజేశ్వరి అనే మహిళ భర్త జస్వంత్ సింగ్‌తో కలిసి రహమత్‌నగర్‌లో నివాసం ఉంటోంది. అదే ప్రాంతానికి చెందిన కోనేరు విక్రమాదిత్య ఎలియాస్ కె.సందీప్ గత పదేళ్లుగా తరచూ వారి ఇంటికి వచ్చిపోతూ ఉండేవాడు. వృద్ధులైన వీరికి ఇంటి పనుల్లో సాయం చేసేవాడు. ఈ క్రమంలో 2020లో సందీప్ జస్వంత్ సింగ్ నుంచి రూ.10 లక్షలు అప్పు తీసుకుని తిరిగి ఇవ్వలేదు. అంతేగాకుండా కరోనా సమయంలో తమకు తెలియకుండా ఆన్‌లైన్ అకౌంట్ ద్వారా పలు దఫాలు దాదాపు రూ. 35.52 లక్షలు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన రాజేశ్వరి సందీప్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు గురువారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నాగార్జున సాగర్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య

**విజయపురిసౌత్:** నాగార్జున సాగర్‌లో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. విజయపురిసౌత్ ఎస్ఐ డి.వెంకట కొండారెడ్డి కథనం మేరకు... రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, బొంగుళూరుకు చెందిన ఆటో డ్రైవర్ బండ మల్లేష్(49) ఆస్తి విషయంలో కుటుంబ సభ్యులతో మనస్పర్థలు రావడంతో మూడు రోజుల కిందట నాగార్జున సాగర్ వచ్చాడు. అనంతరం సాగర్ డ్యామ్ స్పిల్ వే సమీపంలోని దిగువ కృష్ణా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం మృతదేహం జలాశయంపై తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కొండారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిబ్బంది సహాయంతో ఒడ్డుకు చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# ఇక్కడ అమ్మాయి.. అక్కడ అబ్బాయి..

ఒకే రోజు ఇద్దరి ఆత్మహత్య

**జీడిమెట్ల:** వేర్వేరు ప్రాంతాల్లో ఓ యువతి, యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. జీడిమెట్ల ఎస్సై నాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..శ్రీకాకుళం జిల్లాకు చెందిన దుర్గవ్ కుటుంబంతో సహా నగరానికి వలస వచ్చి కుత్బుల్లాపూర్‌లోని అయోధ్యనగర్‌లో ఉంటున్నారు. వీరి కుమార్తె అఖిల(20) కొన్ని నెలలపాటు సుచిత్రలోని పీఎస్‌కే మార్ట్‌లో పనిచేసేది. ఆ సమయంలో ఆమెకు మధుగౌడ్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. మూడు నెలల క్రితం అఖిల మార్ట్‌లో పనిమానేసి మరో ప్రైవేట్ సంస్థలో చేరింది. కాగా గురువారం అఖిల సోదరుడు సాయికుమార్‌కు పీఎస్‌కే మాల్‌లో పని చేసే ఓ వ్యక్తి ఫోన్ చేసి మీ అక్క ఫోన్ తీయడం లేదని ఇంటికి వెళ్లి చూడమని చెప్పాడు. దీంతో సాయికుమార్ తన మేనత్త బుజ్జితో కలిసి ఇంటికి వెళ్లి చూడగా లోపలి నుండి గడియ పెట్టి ఉంది. కిటికీ అద్దాలు పగులగొట్టి చూడగా అఖిల ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని కనిపించింది. చుట్టు పక్కల వారి సహాయంతో కిందకు దించి చూడగా అప్పటికే ఆమె మృతి చెంది ఉంది.

### భువనగిరిలో మధుగౌడ్.

కాగా గతంలో అఖిలతో పరిచయం ఉన్న మధు గౌడ్ సైతం భువనగిరి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరి మధ్య ప్రేమ వ్యవహారం ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. అఖిల మేనత్త బుజ్జి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దర్శకుడు సాయిరాజేష్‌కు హెచ్.ఎం.రెడ్డి అవార్డు ప్రదానం



దర్శకుడు సాయిరాజేష్‌కు అవార్డును అందజేస్తున్న తమ్మారెడ్డి భరద్వాజ, బండారు సుబ్బారావు

**గన్‌ఫౌండ్రీ:** తెలుగులో తొలి టాకీ చిత్రాన్ని రూపొందించిన మహానుభావుడు హెచ్ఎం రెడ్డి అని ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో తొలి టాకీ దర్శక నిర్మాత హెచ్ఎం రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ దర్శకుడు సాయిరాజేష్‌కు హెచ్ఎంరెడ్డి అవార్డును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..... తెలుగు సినిమాలు మంచి ఇతివృత్తాలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు తెచ్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. యువతను మంచిమార్గంలో నడిపించే చిత్రాలు రావాలని ఆకాంక్షించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, ఐ డ్రీమ్ ఛానల్ చీఫ్ ఎడిటర్ నాగేంద్రకుమార్, బ్రిలియంట్ మోడల్‌స్కూల్స్ చైర్మన్ ఎస్.సత్యనారాయణ, శ్రీనివాస్, సంస్థ వ్యవస్థాపకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స చేసిన 24 గంటల్లోనే డిశ్చార్జ్

- ఒమెగాలో 60 ఏళ్ల మహిళలకు అరుదైన మోకాలి చికిత్స
- '3డి అగ్మెంటెడ్ రియాలిటీ–గ్లాసెస్' టెక్నాలజీతో చికిత్స



**సాక్షి, సిటీబ్యూరో:** దీర్ఘకాలిక మోకాలి నొప్పులతో బాధపడుతున్న ఓ 60 ఏళ్ల మహిళలకు ఒమెగా వైద్యులు విజయవంతంగా చికిత్స చేశారు. ఇప్పటి వరకు ఫ్రాన్స్‌లో మాత్రమే అందుబాటులో ఉన్న '3డి అగ్మెంటెడ్ రియాలిటీ గ్లాసెస్' సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ సర్జరీ చేశారు. చికిత్స చేసిన మరుసటి రోజే బాధితురాలిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయడం విశేషం. అంతేకాదు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ తరహా చికిత్స చేయడం ఇదే తొలిదని ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగం వైద్యుడు డాక్టర్ ఆదిత్య కపూర్ తెలిపారు. ఈ మేరకు గురువారం చికిత్స వివరాలను మీడియాకు వెల్లడించారు. సర్జరీ చేసిన 24 గంటల్లోనే డిశ్చార్జ్ చేయడంతో పాటు స్వయంగా నడవగలుగుతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఆపరేషన్ థియేటర్‌లోని మానిటర్‌ను చూస్తూ సర్జరీలు చేస్తుంటారు. ఈ నూతన విధానంలో 'గ్లాసెస్'ను ధరించి సర్జరీ విజయవంతంగా చేయవచ్చని తెలిపారు. తద్వారా నిర్దిష్ట ప్రదేశంలో సర్జరీ చేసేందుకు వీలవుతుందని చెప్పారు. శరీరంపై కత్తి గాట్లతో పాటు సర్జరీ సమయంలో రక్తస్రావం వంటి సమస్యలు ఉండవని, ఇన్‌ఫెక్షన్‌కు ఆస్కారం ఉండదన్నారు. గాయం త్వరగా మానిపోవడంతో పాటు ఆస్పత్రి ఖర్చులు కూడా భారీగా తగ్గుతాయని ఆయన వివరించారు.

# బైక్‌ల దొంగ అరెస్ట్

20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితుడు

**నాగోలు:** మెట్రో స్టేషన్ వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న పాత నేరస్తుడిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు..ఒంగోలు జిల్లా, కొండపి మండలం, కొయ్యవారి పాలెం గ్రామానికి చెందిన పాలెపోగు సిద్దయ్య ఒంగోలు, మర్రిపూడి, సింగరాయికొండ, కావలి, టంగుటూరు తదితర పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లాడు. 2020లో జైలు నుంచి విడుదలైన అనంతరం అతను కుటుంబంతో సహా మేడ్చల్ జిల్లా, సుభాష్‌నగర్ కాలనీకి వలస వచ్చి తాపీ మేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే జల్సాలకు అలవాటు పడిన అతడికి ఆదాయం సరిపోకపోవడంతో ద్విచక్ర వాహనాల చోరీకి పథకం పన్నాడు. ఈ క్రమంలో నగరంలో మెట్రో స్టేషన్ల వద్ద ఉన్న పార్కింగ్‌లో ఉంచిన బైక్‌ల చోరీకు పాల్పడుతున్నాడు. చోరీ చేసిన వాహనాలను కొన్ని రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో దాచి పెట్టి ఆ తర్వాత తన స్వస్థలానికి తరలించి విక్రయించేవాడు. బైక్‌ల చోరీపై ఫిర్యాదులు అందడంతో ఎల్‌బీనగర్ పోలీసులు మెట్రో స్టేషన్ వద్ద నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు చోరీ కోసం వచ్చిన సిద్దయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా ఎల్‌బీనగర్ పీఎస్ పరిధిలో 5, ఉప్పల్‌లో 5, కూకట్‌పల్లిలో 3, మియాపూర్‌లో 2, కేపీహెచ్‌బీలో 1 గుంటూరులో 1, ఇతర ప్రాంతాల్లో 3 చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి 20 ద్విచక్ర వాహనలను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎల్‌బీనగర్ ఏసీపీ జానకిరెడ్డి, ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డి, డిఐ వీరాస్వామి, డీఎస్ఐ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హతలు లేకుండా క్లినిక్ నిర్వహణ

- గుర్తించిన టీఎస్ఎంసీ విజిలెన్స్ అధికారి
- నిందితుడు మహేష్‌పై జూబ్లీహిల్స్‌లో కేసు నమోదు

**సాక్షి, సిటీబ్యూరో:** వైద్యం చేయడానికి అవసరమైన అర్హతలు లేకుండా జూబ్లీహిల్స్‌లో క్లినిక్ నిర్వహిస్తున్న కె.మహేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) విజిలెన్స్ అధికారి ఎం.రాము ఫిర్యాదుతో రెండు చట్టాల్లోని మూడు సెక్షన్ల కింద అతడిపై కేసులు నమోదు చేశారు. నగరానికి చెందిన మహేష్ కమ్యూనిటీ పారామెడిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నుంచి ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికేట్ పొందాడు. ఇవి కలిగిన ఉన్న వారిని డాక్టర్‌గా పరిగణించరు. వీరు సొంతంగా క్లినిక్ నిర్వహించడానికి అర్హులు కాదు. అయితే మహేష్ మాత్రం తన పేరు ముందు డాక్టర్ చేర్చుకుని జూబ్లీహిల్స్‌లోని ఏపీఎస్ఎఫ్‌సీ కాలనీలో ఫస్ట్ ఎయిడ్ సురక్షిత క్లినిక్ పేరుతో ఆస్పత్రి ఏర్పాటు చేశాడు. రోగులను పరీక్షించడంతో పాటు వారికి మందులు కూడా రాస్తున్నాడు. టీఎస్ఎంసీ ఏర్పాటు చేసిన విజిలెన్స్ అధికారి రాము ఈ విషయం గుర్తించాడు. ఆధారాలు సేకరించిన ఆయన బుధవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మహేష్‌పై కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. జాతీయ వైద్య మండలి జారీ చేసిన ఆదేశాల ప్రకారం అర్హత లేని వ్యక్తి అల్లోపతి వైద్యం చేయడం, క్లినిక్ నిర్వహించడం నేరమని అధికారులు తెలిపారు.

## 'లైసెన్సింగ్ బోర్డు సభ్యుడి ఎంపికలో అవకతవకలు'

**సాక్షి, సిటీబ్యూరో:** లైసెన్సింగ్ బోర్డు సభ్యుల నియామకంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, మాజీ విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి ఆదేశంతో కనీస అర్హత, అనుభవం లేని వ్యక్తిని సభ్యుడిగా నియమించి అర్హులకు తీరని అన్యాయం చేశారని తెలంగాణ 'ఏ' గ్రేడ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కందుకూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మద్దునూరి వెంకటేష్, 'బి' గ్రేడ్ లైసెన్సింగ్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జీ, మాజీ సభ్యుడు నక్క యాదగిరి ఆరోపించారు. ఎన్నికల్లో కనీసం పోటీ చేయని వ్యక్తికి ఏ విధంగా బోర్డు సభ్యుడిగా నియమిస్తారని వారు ప్రశ్నించారు. బోర్డు సభ్యుల నియామకంలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఇందుకు సహకరించిన ఉన్నతాధికారులను తప్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రవేటు విద్యుత్ కాంట్రాక్టర్లంతా ఆందోళనలు చేపట్టడానికి కూడా వెనుకాడబోరని వారు హెచ్చరించారు.

## ఎన్.కన్వెన్షన్‌లో ఫ్యూజన్ ఫ్లీ మార్కెట్

- ఆదివారం నిర్వహణ
- 20 ఫుడ్ స్టాల్స్, 70కి పైగా షాపింగ్ స్టాల్స్.
- నియాన్ ప్లే రూం, కిడ్స్ ప్లే జోన్, ఫైర్ వర్క్స్

**మాదాపూర్:** నగరవాసులను ఆకట్టుకునేందుకు మాదాపూర్‌లోని ఎన్.కన్వెన్షన్‌లో ఆదివారం ఫ్యూజన్ ఫ్లీ మార్కెట్‌ను నిర్వహించనున్నారు. ఉర్రూతలు గించే లైవ్ బ్యాండ్స్, విస్మయపరిచే ఫైర్ వర్క్స్‌తో , డబుల్ హెడెడ్ ప్రదర్శనలతో అలరించనున్నారు. నాన్‌స్టాప్ జుంబా, నియాన్ ప్లేరూం తదితర అద్భుతమైన అంశాలతో , నోరూరించే వంటకాలతో , అభిరుచికి తగ్గ షాపింగ్ వినోదంతో పిల్లల్లో ఉత్సాహాన్ని పెంపొందించే విధంగా కిడ్స్‌జోన్ వినోదాలు ఆకట్టుకోనున్నాయి. హ్యాపీ అవర్స్ షాపింగ్ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సందర్శకులు నచ్చిన విధంగా డిజైనర్స్ అవుట్ పుట్స్‌ను అతి తక్కువ ధరకే కొనుగోలు చేసుకోవచ్చు. ప్రతి అరగంటకు సరికొత్త వినోద భరిత నియాన్ ప్లే రూం, కిడ్స్‌ప్లేజోన్ ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. దాదాపు 20 రకాల ఫుడ్‌స్టాల్స్, 70పైగా షాపింగ్ స్టాల్స్ అందుబాటులో ఉంచనున్నారు. ప్రవేశ రుసుం రూ.350.

## ఓటు హక్కు.. బాధ్యత కూడా...


ప్రధాని యువ ఓటర్ల సమ్మేళనాన్ని వర్చువల్‌గా వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

బంజారాహిల్స్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా నిర్వహించిన నవ యువ ఓటర్ల సమ్మేళనం కార్యక్రమాన్ని బీజేపీ నేతలు వర్చువల్‌గా వీక్షించారు. ఖైరతాబాద్ వాసవి ఐఐఎం కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచంలో అతి పెద్దదైన భారత ప్రజాస్వామ్య సాధానికి ఓటు హక్కే ఆయువు పట్టు అన్నారు. ఓటు వేయడం మన హక్కు మాత్రమే కాదని, బాధ్యత కూడా అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి పౌరుడు తమ బాధ్యతను సమగ్రంగా నిర్వర్తించేందుకు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతిన బూనాలని యువ ఓటర్లకు మార్గనిర్దేశం చేయడమైనదన్నారు.

## కాంగ్రెస్ బెస్ట్ పోలింగ్ ఏజెంట్‌కు అవార్డు


కాంగ్రెస్ పోలింగ్ ఏజెంట్‌ను సత్కరిస్తున్న నేతలు

బంజారాహిల్స్: కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం గురువారం ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించగా ఖైరతాబాద్ డీసీసీ పరిధి కిందికి వచ్చే పోలింగ్ బూత్‌లో అత్యధికంగా కాంగ్రెస్‌కు ఓట్లు వేయించడంలో కృషి చేసిన పోలింగ్ ఏజెంట్‌ను అవార్డుతో సత్కరించినట్లు ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లు అందరూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఇదే స్ఫూర్తిగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ఏజెంట్ మురళి అంకితభావంతో, పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేశారని, ఆయన అందరికీ ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. నాంపల్లి కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఫిరోజ్‌ఖాన్ చేతుల మీదుగా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మురళికి ఈ అవార్డును అందజేయడం పట్ల కాంగ్రెస్ ఏజెంట్లందరూ మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు అవకాశం కల్పించామన్నారు.

## క్రీడాపోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

రహమత్‌నగర్: విద్య విజ్ఞానాన్ని పెంపొందిస్తే, క్రీడలు శారీర దారుఢ్యాన్ని సమకూరుస్తాయని న్యూటన్ విద్యాసంస్థల చైర్మన్ పీజే రెడ్డి అన్నారు. గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గురువారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మారుతున్న సమాజంలో విద్యార్థులు ఆటలకు దూరం అవుతుండటం బాధాకరమన్నారు. ఆటల ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. సరైన ప్రోత్సాహం లేక ఎంతోమంది నైపుణ్యం గల విద్యార్థులు ఆటలకు దూరం అవుతున్నారని తెలిపారు. డైరెక్టర్లు రాజేష్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుభాషిణిరెడ్డి, పీఈటీలు శ్రీనివాస్, గిరి, అమనగంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి


అభివాదం చేస్తున్న గాలి వినోద్‌కుమార్ తదితరులు

హిమాయత్‌నగర్: దళిత క్రైస్తవులకు షెడ్యూల్డ్ కులాలతో సమానంగా ఎస్సీ హోదా కల్పించాలని దళిత్ క్రిస్టియన్ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే 'న్యాయ యాత్ర'లో ఈ అంశాన్ని ప్రస్తావించాలన్నారు. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆర్టికల్ 341 సవరణ ప్రధాని నరేంద్రమోదీకి అసాధ్యమని, 371–డి జోనల్ సిస్టం ద్వారా మాత్రమే ఎస్సీ వర్గీకరణ సాధ్యం అవుతుందన్నారు. దళిత క్రైస్తవ దండోరా అభ్యర్థులు రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఏడు స్థానాల్లో పోటీ చేస్తారని తెలిపారు. జాతీయ కో కన్వీనర్లు బెజవాడ రవి, తేడం ప్రకాష్, సౌత్ ఇండియా కన్వీనర్ రఘు ముద్రి పీటర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరుకల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో ప్రకటించిన ఎస్టీ డిక్లరేషన్‌లో భాగంగా ఎరుకల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎరుకల, గిరిజనులను ఆదుకోవాలని తెలంగాణ ఎరుకల, గిరిజన హక్కుల ఐక్య పోరాట సాధన సమితి (టీవైజీహెచ్‌ఐపీఎస్ఎస్), తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం (టీపీవైఎస్) అధ్యక్షుడు కోనేరు సాయికుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో పెట్టిన గిరిజన తెగలో ఉన్న కులాలకు ముఖ్యంగా ఎరుకల గిరిజన అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సొసైటీలకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఎ.సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ

హిమాయత్‌నగర్: రాజేంద్రనగర్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయ భూములను హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థినుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దుర్మార్గమని ప్రజాస్వామ్యవాదులు దీనిని ఖండించాలని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి తెలిపారు. ప్రభుత్వాలు మారిన పోలీసుల తీరు మారడం లేదని, ఉద్యమకారుల పట్ల అత్యంత అమానుషమైన వైఖరిని, దురుసు ప్రవర్తనను చూపిస్తూ తమ ఆధిపత్యాన్ని చలాయించాలనుకుంటున్న పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు.

## కుంగిన రోడ్డుకు మరమ్మతు చేయాలి

హిమాయత్‌నగర్: హైదర్‌గూడ స్ట్రీట్ నెం–7లో హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్ పర్యటించారు. మినర్వా హోటల్ సమీపంలో కుంగిపోయిన రోడ్డును ఆమె గురువారం పరిశీలించారు. అక్కడ నూతనంగా నిర్మించిన మ్యాన్‌హోల్ వల్లే రోడ్డు కుంగిందని తెలుసుకొని వెంటనే ఆ రోడ్డు మరమ్మతుల పనులను చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. పలు బస్తీలలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ ఏఈ దివ్య, సూపర్‌వైజర్ రాము, వాటర్ వర్క్స్ డీజీఎం సన్యాసి రావు, మేనేజర్ మహేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు సీతారాంరెడ్డి, జగదీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు.. ఉజ్వల భవితకు మెట్టు!

- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం
- క్రమం తప్పకుండా ఓటు వేస్తున్న సీనియర్స్‌కు సన్మానం
- ఓటు తప్పక వేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ

బంజారాహిల్స్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఓటు వజ్రాయుధమని.. అర్హులందరూ ఓటు హక్కును పొందాలని సూచించారు. తమ ఉజ్వల భవిష్యత్ కోసం సమాజ శ్రేయస్సు, ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేసే వారిని ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక చేసుకునేందుకు ఓటు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా తప్పనిసరిగా ఓటు వేస్తామంటూ సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను క్రమం తప్పకుండా ప్రతి ఎన్నికల్లోనూ బాధ్యతగా ఓటు వేస్తున్నందుకు గాను సత్కరించారు. అలాగే ఓటర్ల నమోదు, ప్రత్యేక ఓటరు శిబిరాల్లో అంకితభావంతో పని చేస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్లను కూడా సత్కరించారు.



జోనల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు


జోనల్ కార్యాయంలో సీనియర్ సిటిజన్‌ను సత్కరిస్తున్న అధికారులు

### సైఫాబాద్ సైన్స్ కాలేజీలో...

బంజారాహిల్స్: ప్రతిఒక్కరూ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని, మంచి నాయకులను ఎన్నుకోగలుగుతామని సైఫాబాద్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీల ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని, తప్పనిసరిగా ఓటు వేస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్నికల్లో డబ్బుకు, మద్యానికి ఆశపడి ఓట్లు వేయవద్దని, మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నవనీత, మీనాక్షి, వెంకటేశ్వర్లు, డాక్టర్ నరేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఓటును ఆయుధంగా ఉపయోగించుకోవాలి...

లిబర్టీ: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకు అతి ప్రాముఖ్యత ఉందని, ఓటును ఆయుధంగా ఉపయోగించుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఓటూ ఎంతో విలువైనదని ఓటు వేసేటప్పుడు తప్పు చేస్తే ఐదేళ్ల కష్టాలు అనుభవించాల్సి వస్తుందని ఆయన అన్నారు. మాల మహానాడు కార్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అతి కీలకమైందని గుర్తు చేశారు. మద్యం.. డబ్బుకు ఓట్ల అమ్ముకుంటే ఐదేళ్ల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు.


జోనల్ కార్యాలయంలో బెస్ట్ బీఎల్‌ఓను సత్కరిస్తున్న అధికారులు


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సైఫాబాద్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్

### అర్హులందరూ ఓటు హక్కును పొందాలి

శ్రీనగర్‌కాలనీ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలని, మన ప్రాంతాన్ని, దేశాన్ని సమగ్రంగా నడిపే నాయకుడిని ఎన్నుకోవాలని బీజేవైఎం తెలంగాణ అధ్యక్షుడు మహేందర్, బీజేపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ లంకల దీపక్‌రెడ్డి అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ పక్కన బీజేవైఎం ఆధ్వర్యంలో నవ్ మత్‌దత సమ్మేళన్‌లో భాగంగా నూతనంగా ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రజలకు ప్రధాని నరేంద్రమోదీ డిజిటల్ సందేశాన్ని తెలిపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని దేశ భవితకు మార్గదర్శకాలు యువతే అని, మీతోనే దేశాభివృద్ధి సాధ్యమని తెలిపారు. మన దేశాన్ని ప్రపంచంలో మేటిగా చేయడానికి యువత ముందుకు రావాలన్నారు. ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని కోరారు. నేతలు చిరంజీవిరెడ్డి, కుంబాల గంగరాజు, డాక్టర్ పద్మ వీరపనేని, మాజీ కార్పొరేటర్లు కిలారి మనోహర్, కంజర్ల సదాశివయాదవ్, ప్రేమ్‌కుమార్, సందీప్‌యాదవ్, బీజేవైఎం నేతలు శ్రీనివాసగౌడ్, గణేష్ పాల్గొన్నారు.


ఎర్రగడ్డలో ప్రధాని సందేశాన్ని తిలకిస్తున్న బీజేపీ నేతలు

## కూరగాయల ధరలు..

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమాట కిలో రూ. 21, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీ మిర్చి 45, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 23, క్యారెట్ 25, దొండ 28, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 28, గోకరకాయ 50, కీర 18, దోసకాయ 25, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 60, మొరంగడ్డ 26, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ: ఆర్.కృష్ణయ్య

వెంగళరావునగర్: ప్రకృతిని కాపాడుకోవడమే నిజమైన దైవత్వమని ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ ఎస్‌జీబీ హైస్కూల్‌లో గురువారం పర్యావరణంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హరి ఇప్పనపల్లి మాట్లాడుతూ... పండుగలన్నీ పర్యావరణ హితంగా జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... ప్రస్తుతం దేశంలోని అన్ని నగరాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను వాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల భవిష్యత్‌ను తలచుకుంటేనే భయమేస్తుందన్నారు. భవిష్యత్‌లో పర్యావరణాన్ని కాపాడుకోకపోతే భూమిమీద మానవజాతి అంతరించిపోయే ప్రమాదం ఉందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించి ప్రజలను చైతన్య వంతులను చేయాలని సూచించారు. తొలుత ప్రకృతిని కాపాడుకుందామంటూ ప్రతిజ్ఞ చేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్, అధ్యక్షులు భద్ర, కోశాధికారి రిజ్వాన్, ఎస్‌జీబీ స్కూల్ కరస్పాండెంట్ అశోక్‌కుమార్ యాదవ్, ప్రిన్సిపాల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు చెక్

- ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం
- బేగంపేటలోని టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

బంజారాహిల్స్: బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని షిండ్లర్ ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగులకు, సిబ్బంది గురువారం రోడ్డు సేఫ్టీ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు వారికి పలు సూచనలు చేశారు. పాదచారులు రోడ్డు దాటేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా చూసుకుని జాగ్రత్తగా దాటాలని, జీబ్రాలైన్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అతివేగం, డేంజరస్ డ్రైవింగ్ చేస్తూ నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే చట్టరీత్యా నేరమన్నారు. మోటార్ వాహన చట్టం ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పబ్లిక్ రోడ్లపై ఎవరూ వాహనం నడపకూడదన్నారు. అలా వాహనాలు నడిపినచో రూ. 5 వేల వరకు జరిమానాతో పాటు మూడు నెలల జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది సుమారు 6 వేల మంది లైసెన్స్ లేని వారికి టీటీఐ బేగంపేటలో కౌన్సెలింగ్ ఇచ్చామని ఆయన గుర్తుచేశారు. వాహనాలు నిర్లక్ష్యంగా నడపడం ఎప్పుడూ ప్రమాదకరమనే విషయాన్ని గుర్తించాలన్నారు. అలాగే ఎలాంటి సందర్భంలోనూ మద్యం సేవించి వాహనం నడపరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అరుణ్ మాణిక్, సమీర్, హెచ్‌ఆర్ రుషబ్, రాజేష్, సేఫ్టీ ఆఫీసర్ చక్రవర్తి చిగిటి, హెచ్‌జీ కృష్ణ, హీరో మోటో శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

## నేడు భారత మాతకు మహా హారతి

బంజారాహిల్స్: భారత మాతకు మహా హారతి కార్యక్రమాన్ని శుక్రవారం బీజేపీ శ్రేణులు నిర్వహించనున్నాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో ఏటా భారత మాతకు మహా హారతి ఇవ్వనున్నారు. అందులో భాగంగా భారత మాత విగ్రహాన్ని నెక్లెస్ రోడ్డులోని ఐ మ్యాక్స్ థియేటర్ సర్కిల్ వద్దకు తీసుకొచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భార్య కావ్య కిషన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ నేతలు పాల్గొన్నారు.




## నేడు సెయింట్ పాల్స్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పంజగుట్ట: సెయింట్ పాల్స్ అలూమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదర్‌గూడలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన స్వర్ణోత్సవాలను శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వినోద్‌కుమార్, మన్మోహన్, అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం లక్డీకాపూల్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ... ఆ పాఠశాలలో చదువుకున్న 1974 పదో తరగతి బ్యాచ్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమయ్యే వేడుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, తమకు చదువు చెప్పిన గురువులతో పాటు, ప్రస్తుతం ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన వారికి ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు.

## 'స్వర్ణప్రాశనం'తో చిన్నారుల్లో చురుకుదనం

వెంగళరావునగర్: స్వర్ణ ప్రాశనం చుక్కలు వేయడం వల్ల చిన్న పిల్లలకు మానసిక ఎదుగుదల, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రారెడ్డి తెలిపారు. ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో గురువారం చిన్న పిల్లల విభాగం ఆధ్వర్యంలో స్వర్ణ ప్రాశనం చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులకు చిన్న పిల్లల విభాగ అధిపతి డాక్టర్ యశోద పెనుబాల, సూపరింటెండెంట్‌తో కలిసి పిల్లలకు స్వర్ణ ప్రాశనం చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్వర్ణంతో తయారు చేసిన ఔషధాన్ని చుక్కల రూపంలో నోటి ద్వారా పిల్లలకు మింగించడం వల్ల వారిలో తెలివితేటలు బాగా పెరుగుతాయన్నారు. అయితే ప్రతి నెల పుష్యమీ నక్షత్రం రోజున మాత్రమే దీనిని వేస్తారన్నారు. జ్వరం, జలుబు ఉన్న పిల్లలకు ఈ డ్రాప్స్ వేయడం మంచిది కాదని చెప్పారు. చిన్నతనం నుంచి 16 ఏళ్ల వరకు కూడా ఈ చుక్కల మందు వేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ, డాక్టర్ సుజన, డాక్టర్ అఖిల్, డాక్టర్ మమత, డాక్టర్ ఐశ్వర్య పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్–2 కనకదుర్గా భవాని ఆలయంలో గురువారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన సంఘటన నేపథ్యంలో బోరబండ పోలీసులు సూచన మేరకు ఆలయంలో ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఆలయ ధర్మకర్త వేముల యాదయ్య తెలిపారు. ఆలయ ఆవరణతోపాటు బోరబండ వైపు వెళ్లే ప్రధాన రహదారి, దళిత్ స్టడీ సెంటర్ వెనుక భాగం రికార్డు అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

## పేద మహిళలకు చీరల పంపిణీ

లిబర్టీ: నిరుపేదలు, కూలీలకు చీరలు, దుస్తులను భారతీయ ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షుడు కె.వి.ఎ న్.శర్మ పంపిణీ చేశారు. పేదరికంలో అల్లాడుతూ జీవనం సాగిస్తున్న అడ్డా కూలీలకు నిరుపేదలకు పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ కార్మికులకు ప్రధానంగా నిరుపేద మహిళలకు 200 చీరలు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. తనవంతు బాధ్యతగా చీరలు, దుస్తులు, దుప్పట్లు, ఆహార పదార్థాలు నిరంతరంగా పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

## సమర్థ నాయకత్వం కోసమే బస్తీ ఎన్నికలు

రహమత్‌నగర్: సొసైటీ యాక్టు ప్రకారం ఎన్నికలు జరగాలని కోరుతున్న టి.అంజయ్యనగర్ బస్తీ అధ్యక్షురాలు ఆండాళు 2013వ సంవత్సరంలో జరిగిన బస్తీ ఎన్నికల్లో ఏ సొసైటీ యాక్టు ద్వారా గెలిచారో తెలయజేయాలని పీజేఆర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ ప్రశ్నించారు. ఎస్పీఆర్ హిల్స్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ... బస్తీ ఎన్నికల తీర్మాన పత్రంలో స్వయంగా ఆమే సంతకం చేశారని గుర్తు చేశారు. సంతకం చేసి ఇప్పుడు ఎన్నికలను వ్యతిరేకించడంలో ఆంతర్యం ఏమిటన్నారు. సమర్థవంతమైన నాయకత్వంతో బస్తీని అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఎన్నికలకు బస్తీవాసులంతా ముందుకు వచ్చారని శివ పేర్కొన్నారు.

## యువతి అదృశ్యం

వెంగళరావునగర్: తల్లి పని చేసే డ్యూటీ వద్దకు తోడుగా వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... కర్నూలు ప్రాంతానికి చెందిన దంపతులు జవహర్‌నగర్ సాయిబాబా ఆలయం వద్ద ఉంటున్నారు. వారికి ఇరువురు కుమార్తెలు. తల్లి, పెద్ద కుమార్తె మధురానగర్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగాలు చేస్తుంటారు. ఈ నెల 24న ఉదయం 10.30 గంటలకు తన పెద్ద కుమార్తె తల్లి పని చేస్తున్న ప్రాంతానికి వెళ్ళింది. తల్లి 3వ అంతస్తులో పని చేస్తుండగా కుమార్తె గ్రౌండ్‌ఫ్లోర్‌లో కూర్చుని ఉంది. మధ్యాహ్నం 12 గంటలకు తల్లి కిందకు రాగా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండాల్సిన తన కుమార్తె కనిపించలేదు. ఫోన్ చేయగా దాదాపు అరగంట వరకు ఫోన్ బిజీగా వచ్చింది. అనంతరం ఫోన్ స్విచాఫ్ అయింది. ఆందోళన చెందిన ఆమె కుమార్తె కోసం పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేదు. దాంతో గురువారం తన కుమార్తె మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# షర్మిల మాటలన్నీ బాబు, ఎల్లో స్క్రిప్టే

- రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం, రాజకీయాలపై ఆమెకు అవగాహన లేదు
- ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి, రాజకీయాలపై ఏమాత్రం అవగాహన లేని షర్మిల.. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఎల్లో మీడియా ఇచ్చిన స్క్రిప్ట్‌నే పోటీ పరీక్షలకు విద్యార్థి సిద్ధమైనట్లుగా బట్టీ పట్టి చదువుతున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ఆమె మాట్లాడుతున్న మాటలకు ఒకదానికి, మరొకదానికి పొంతన లేదన్నారు. షర్మిల మాటలను చూస్తే.. బహుశా ఆమె తెలంగాణలో ఉండి మాట్లాడుతున్నట్లుగా అనుకుంటున్నారేమో అని అన్నారు. ఆయన గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**సోనియా వేధింపులు షర్మిలకు తెలుసు**

వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణాన్ని తాళలేక మరణించిన వారి కుటుంబాలకు భరోసా కల్పించడానికి జగన్ చేపట్టిన ఓదార్పు యాత్రను అడ్డుకోవడానికి సోనియాగాంధీ యత్నించారు. అప్పట్లో సోనియాను జగన్, విజయమ్మ, షర్మిల కలిశారు. అక్కడేం జరిగిందో షర్మిలకు కూడా తెలుసు. వైఎస్ పథకాలను తుంగలో తొక్కి, ఆశయాలను పక్కన పెట్టేందుకు సిద్ధమైన సోనియాతో విభేదించి జగన్ ఓదార్పు యాత్ర చేపట్టినప్పటి నుంచి కక్ష సాధింపు మొదలు పెట్టి వేధించిన విషయమూ షర్మిలకు తెలుసు. వైఎస్ వివేకానందరెడ్డిని మంత్రిని చేసిన సోనియా.. వైఎస్సార్‌సీపీ స్థాపించాక పులివెందుల ఉప ఎన్నికలో వైఎస్ విజయమ్మపై వివేకానందరెడ్డిని పోటీ పెట్టడం ద్వారా కుటుంబాన్ని చీల్చిన విషయాన్ని జగన్ గుర్తుచేశారు. ఇప్పుడూ అదే రీతిలో కుటుంబాన్ని చీల్చి షర్మిలను పీసీసీ చీఫ్‌గా చేశారని జగన్ ఎత్తిచూపారు. ప్రజలు జగనే వైఎస్‌కు సరైన వారసుడు అనుకున్నారు కాబట్టే వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారు.

**మహానేత వైఎస్ ఆశయ సాధనే ఊపిరిగా..**

సీఎం జగన్ వైఎస్సార్ బిడ్డగా ఆ రోజు మొదలు పెట్టిన ప్రస్థానం.. నేడు ఉధృతమైన ప్రవాహంలా సాగుతోంది. దానికి కారణం వైఎస్ ఆశయాలను, ఆలోచనలను జగన్ మనసా వాచా నమ్మి వాటిని మరింత మెరుగుపర్చి అమలు చేస్తున్నారు. పార్టీని నడపడం, విలువలను పాటించడం, నిజాయితీ, నిబద్ధతతో ఎన్ని ఆటుపోట్లనైనా తట్టుకొంటూ వైఎస్ అడుగుజాడల్లో నడుస్తున్నారు. ఆనాడు అక్రమ కేసుల్లో 16 నెలలు జైల్లో పెట్టడం నుంచి చంద్రబాబు 23 మంది ఎమ్మెల్యేలను పశువులను కొన్నట్లు కొన్నప్పుడు కూడా జగన్ చలించలేదు. ఇలా సొంతంగా ఎదిగిన వ్యక్తి జగన్. జగన్ తండ్రి వైఎస్ అని చెప్పుకోవడం ఏ తండ్రికైనా గర్వకారణమే. వైఎస్ బిడ్డగా, జగన్ సోదరిగా షర్మిలకు ఇచ్చే గౌరవం అభిమానులు ఇస్తారు. గుండెల్లో పెట్టుకుంటారు.



**ఏం అన్యాయం జరిగిందో షర్మిలే చెప్పాలి**

జగన్ కాంగ్రెస్‌ను వీడి వైఎస్సార్‌సీపీని స్థాపించినప్పుడు లక్షలాది కార్యకర్తలు ఆయన వెంట కదిలారు. త్యాగాలు చేశారు. అందరూ కష్టపడ్డారు. జగన్ జైలులో ఉన్న సమయంలోనే కదా షర్మిల పాదయాత్ర చేశారు. ఆ సమయంలో పార్టీ నేతలు, శ్రేణులు, అందరూ ఎంతో కష్టపడ్డారు. అందరికీ రకరకాల బాధ్యతలు అప్పజెప్పారు. ఎవరి బాధ్యతలు వారు నిర్వర్తించారు. షర్మిల పాదయాత్ర చేశారు. అన్యాయం జరిగిందని షర్మిల అంటున్నారు. ఆమెకు ఏం అన్యాయం జరిగిందో స్పష్టంగా చెప్పాలి. పదవి కోసమే ఆమె ఆరోజు జగన్ కోసం నిలబడ్డానని స్పష్టంగా చెప్పగలిగితే సమాధానం చెప్పొచ్చు. పదవుల పంపకంలో అన్యాయం చేశారా? కుటుంబం పదవులు పంచుకోవడానికి ఉందా? అధికారంలో భాగస్వామ్యాలు ఉంటాయా? అది చర్చించడానికి అర్హమైనదేనా? కుటుంబం పదవులు పంచుకొంటే ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది?

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

**వైఎస్సార్‌టీపీ కార్యకర్తలకు షర్మిల ఏం న్యాయం చేశారు?**

తెలంగాణలో షర్మిల పెట్టిన వైఎస్సార్‌టీపీ కోసం చాలా మంది కష్టపడి ఉంటారు కదా. వారికి షర్మిల ఏం న్యాయం చేశారు? వారి భవిష్యత్తు గురించి ఏం ఆలోచన చేశారు? వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేసి రాష్ట్రానికి వచ్చిన షర్మిలను భుజానికెత్తుకుని మోస్తున్న ఎల్లో మీడియా.. తెలంగాణలో కాంగ్రెస్ గెలుపులో షర్మిలకు భాగముందని ఎందుకు రాయలేదు? అప్పుడూ ఇప్పుడూ జగన్‌పై షర్మిల బాణాలు ఎక్కుపెట్టినప్పుడే వాటినే ఎల్లో మీడియా ప్రచురిస్తోంది. వైఎస్ మరణంపై రేవంత్‌రెడ్డి ఇటీవల అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు షర్మిల ఎందుకు స్పందించలేదు?

**వైఎస్ పథకాలు లేవంటే తీసుకున్న వాళ్లంతా ఎవరు?**

వైఎస్ పథకాలను తీసేశారని షర్మిల మాట్లాడితే ఏమనాలో అర్థం కావడంలేదు. చంద్రబాబు, రాధాకృష్ణ వద్ద నుంచి వచ్చిన స్క్రిప్ట్‌ను బట్టీ పట్టి చెప్పినప్పుడు వాస్తవాలు ఆమెకు తెలిసి ఉండకపోవచ్చు. అప్పట్లో వైఎస్ అమలుచేసిన ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా ఇప్పుడు షర్మిల లేవంటున్నారు. రైతులకు నేడు ఇస్తున్నంత భరోసా దేశంలో మరెక్కడైనా ఉందా? అసలు క్రాప్ ఇన్సూరెన్స్ లేదంటున్నారు. తీసుకున్న రైతులంతా ఏమనుకుంటారు? పాపం ఆమె తెలియక ఇంత అబద్ధం మాట్లాడి ఉండొచ్చు. బహుశా చంద్రబాబు కూడా వీటిపై మాట్లాడటానికి సాహసం చేయకపోవచ్చు. చంద్రన్న కానుకలు లేవని అనొచ్చు కానీ.., ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు లేవని మాత్రం ఆయనా అనలేదు. షర్మిలమ్మే తిట్లు తింటుందిలే అని చంద్రబాబు కూడా ఆ తప్పుడు స్క్రిప్ట్ రాసిచ్చి ఉండొచ్చు. వైఎస్ ప్రవేశపెట్టి ఆరోగ్యశ్రీలో సీఎం జగన్‌ఆరోజుతో పోలిస్తే 3 వేలకు పైగా ప్రొసీజర్స్ పెంచారు. రూ.25 లక్షల వరకూ పరిమితి పెంచారు. అర్హత కోసం ఆదాయాన్ని రూ.5 లక్షలు చేశారు. 90 శాతం కుటుంబాలు కవర్ అవుతున్నాయి. ఇవి నిజం కాదా? ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఆనాడు రూ. 30 నుంచి రూ. 35 వేలు ఇస్తే, ఇప్పుడు వంద శాతం చెల్లిస్తున్నది వాస్తవం కాదా?

**హోదా, విశాఖ స్టీల్‌పై మోదీ సభలోనే గళమెత్తిన జగన్**

బీజేపీకి వైఎస్సార్‌సీపీ టూల్‌లా మారిందని, రాష్ట్రాన్ని అప్పజెప్పిందని షర్మిల చేసిన ఆరోపణలు అర్థరహితం. స్టీల్ ప్లాంట్ విషయం కేంద్రానికి సంబంధించింది. ప్రభుత్వ రంగంలోనే స్టీల్ ప్లాంట్‌ను నడిపేలా కేంద్రాన్ని ఒప్పించే ప్రయత్నం మేం చేస్తున్నాం. స్టీల్ ప్లాంట్ అప్పులను రీస్ట్రక్చర్ చేయడం, గనులు కేటాయించడం, అదనంగా ఉండే భూమిని అమ్మి ఆ సొమ్ముతో అప్పులను తగ్గించుకోవడం ద్వారా స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాటలో నడిపించవచ్చు సూచిస్తూ కేంద్రానికి సీఎం జగన్ లేఖ రాశారు. విశాఖ స్టీల్ పరిశ్రమ వ్యాపారం కాదని, సెంటిమెంట్‌కు సంబంధించినదని కూడా చెప్పాం. ఇంతకు మించి వేరే రకమైన పోరాటం ఎవరైనా చేయగలరా? ప్రధాని ఉన్న వేదికపైనే ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్స్ ప్లాంట్ గురించి సీఎం జగన్ గళమెత్తారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక ఇంకేదైనా ఉందా? పోరాటం అంటే నిర్వచనం, స్వరూపం ఎలా ఉండాలో షర్మిలే చెప్పాలి.

# వారానికి రెండు ఢిల్లీ టూర్లు

**సీఎం రేవంత్ 45 రోజుల్లో సాధించింది ఇదే: కేటీఆర్ ధ్వజం**

- దావోస్‌కు వెళ్లి ప్రపంచ వేదికపై పచ్చి అబద్ధాలు చెప్పారు
- బీఆర్‌ఎస్ పేరు మార్పు అంశంపై చర్చిస్తున్నాం
- లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయను

**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి పదవి చేపట్టిన 45 రోజుల్లో రేవంత్ రెడ్డి సాధించింది.. వారానికి రెండు సార్లు ఢిల్లీ పర్యటనలు చేయడం మాత్రమేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఢిల్లీ నుంచి పాలన జరుగుతుందని తాము చెప్పిందే నిజమవుతోందని అన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దావోస్ పర్యటనలో ప్రపంచ ఆర్థిక వేదికపై రైతుభరోసా ఇచ్చామని పచ్చి అబద్ధాలు చెప్పిన రేవంత్‌రెడ్డి.. తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**బీఆర్‌ఎస్ పేరు మార్పుపై చర్చిస్తున్నాం..**

పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో వచ్చిన అభిప్రాయాల మేరకు బీఆర్‌ఎస్ పార్టీ పేరును మార్చే అంశంపై చర్చిస్తున్నామని కేటీఆర్ వెల్లడించారు. తాను వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తానంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. తాను లోక్‌సభకు పోటీ చేసేది లేదని స్పష్టం చేశారు.

**సీఎం, మంత్రులు.. పరస్పర విరుద్ధ ప్రకటనలు**

'అంతర్జాతీయ సంస్థలు, బహుళ జాతి కంపెనీలతో సామాజిక న్యాయం, సమానత్వం, ఉద్యోగ, ఉపాధి కల్పన సాధ్యం కాదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అంటున్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణల పేరిట బహుళ జాతి కంపెనీలకు ద్వారాలు తెరిచిందే కాంగ్రెస్. గతంలో నేను దావోస్ పర్యటనకు వెళితే స్విస్ బ్యాంకుల్లో డబ్బు దాచుకునేందుకు వెళ్లానని విమర్శించారు. ఉత్తమ్ లాంటి నేతలు దావోస్ బోగస్ అన్నారు. ఇప్పుడు రేవంత్ అదే పనిచేశారా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

**అటెన్షన్ డైవర్షన్ పనులు**

'ప్రభుత్వం ఏర్పడిన కొద్ది కాలంలోనే అన్ని వర్గాల నుంచి విపరీతమైన వ్యతిరేకతను కాంగ్రెస్ ఎదుర్కొంటోంది. హామీల అమలు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం అటెన్షన్ డైవర్షన్ పనులకు పాల్పడుతోంది. ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి తప్పించుకునేందుకు చూస్తే మేము వదిలేది లేదు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) అంశంలో తెలంగాణ ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి శాశ్వతంగా తాకట్టు పెట్టింది'అని కేటీఆర్ దుయ్యబట్టారు.

**లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కథ ఖతం**

**కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వంలో ప్రాంతీయశక్తులే కీలకం: కేటీఆర్**



**సాక్షి, హైదరాబాద్:** మోసం కాంగ్రెస్ నైజమని, నయవంచనకు నిలువెత్తు రూపం అయినందునే ఆదిలోనే ఇండియా కూటమికి బీటలు ఏర్పడ్డాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అందుకే టీఎంసీ, ఆమ్ ఆద్మీ పార్టీలు కాంగ్రెస్‌ను వీడి ఒంటరి పోరుకు సిద్ధమయ్యాయని 'ఎక్స్'లో పేర్కొన్నారు. మిత్రపక్షాలను ఒప్పించలేని కాంగ్రెస్ దేశ ప్రజలను ఏం మెప్పిస్తుందని ప్రశ్నించారు. మోదీ, బీజేపీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కుగానీ, ఇండియాకూటమికి గానీ లేదన్నారు. మిత్రపక్షాలు దూరం కావడమే ఇందుకు నిదర్శనంగా పేర్కొన్నారు. తెలంగాణలో కేసీఆర్, బెంగాల్‌లో మమతాబెనర్జీ, పంజాబ్, ఢిల్లీలో కేజ్రీవాల్ అయినా పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేది రాష్ట్రాల్లోని బలమైన పార్టీలేనని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కథ ఖతం అవుతుందని, కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వంలో ప్రాంతీయశక్తుల పాత్రే కీలకంగా మారుతుందని కేటీఆర్ అన్నారు.

**కేసీఆర్‌పై జాతీయ పార్టీల కుట్ర**

'లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకు కుట్ర పన్నిన విషయం స్పష్టంగా తెలుస్తోంది. రేవంత్, బండి సంజయ్‌ల వ్యాఖ్యలు దీనికి అద్దం పడుతున్నాయి. గత పార్లమెంటు ఎన్నికల తరహాలోనే ఈ రెండు పార్టీలు ఈసారి కూడా కుమ్మక్కయ్యాయి. పార్లమెంటు ఎన్నికలు త్వరగా వస్తాయనే సమాచారం మాకు ఉంది. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 10లోపు రోజుకు సగటున పది అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున పార్లమెంటు ఎన్నికల సన్నద్ధత సమావేశాలు జరుగుతాయి. త్వరలో 31వేలకు పైగా పోలింగ్ బూత్‌లకు సంబంధించి 31వేలకు పైగా సోషల్ మీడియా కార్యకర్తలతో 'తెలంగాణ బలగం'పేరిట నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తాం. సోషల్ మీడియాను కూడా బలోపేతం చేస్తూ క్షేత్ర స్థాయి సమాచారం పార్టీకి అందేలా యూ ట్యూబ్ చానెళ్లు.. ఇతరత్రా వేదికలు ఏర్పాటు చేస్తాం'అని కేటీఆర్ పేర్కొన్నారు.

# పాలియేటివ్ కేర్‌లో తెలంగాణ భేష్

**ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రత్యేక ప్రశంస**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో చేపడుతున్న పాలియేటివ్ కేర్ సేవలు వివిధ దేశాలకు ఆదర్శనీయమని ప్రపంచ ఆరోగ్యసంస్థ కొనియాడింది. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్యసంస్థ వివిధ ఆసియా దేశాల్లో అమలవుతున్న పాలియేటివ్‌కేర్ సేవలపై తాజాగా నివేదిక విడుదల చేసింది. ప్రభుత్వ సహకారంతో స్వచ్ఛంద సంస్థలను కలుపుకొని జిల్లా వైద్యాధికారులు, ఇతర సిబ్బందికి పాలియేటివ్ కేర్‌పై అవగాహన కల్పించడం వంటివి కూడా చేస్తున్నారు. ఆశ కార్యకర్తలు, నర్సులు, ఆయాలు, స్టాఫ్‌నర్సులు, వైద్యాధికారులకు అవగాహన కల్పిస్తున్నారు. దీనివల్ల రోగులు సులువుగా పాలిటయేటివ్ కేర్ సేవలు పొందుతున్నారు. రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన హెల్త్ ప్రొఫైల్ వల్ల పాలియేటివ్‌కేర్ అవసరమైన వారిని గుర్తించడం సరళతరమైంది.

**తెలంగాణలో ఏటా 3 లక్షల మందికి ఈ సేవలు అవసరం**

రాష్ట్రంలో 2017 నుంచి పాలియేటివ్ కేర్ సేవలు అందుబాటులో ఉన్నాయి. 33 ప్రభుత్వ పాలియేటివ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేశారు. తద్వారా పాలియేటివ్ కేర్ అవసరమైన వారికి ఆస్పత్రుల్లోనూ లేదా ఇళ్లల్లోనూ లేదా ఔట్ పేషెంట్లుగా కూడా సేవలు అందిస్తున్నారు. తెలంగాణలో ఏటా 3 లక్షల మందికి పాలియేటివ్ కేర్ సేవలు అవసరమని వైద్య ఆరోగ్యశాఖ అంచనా వేసింది.

– డాక్టర్ కిరణ్ మాదల, సైంటిఫిక్ కన్వీనర్, ఐఎంఏ, తెలంగాణ

**పాలియేటివ్‌కేర్ సేవలంటే...**

జీవిత చరమాంకంలో ఉండే వయోవృద్ధులు, గుండె జబ్బులు, కేన్సర్‌కు గురై చివరిదశలో ఉన్నవారు, ఇతరత్రా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుండేవారు తుదిశ్వాస వరకూ నొప్పి, బాధ తెలియకుండా సంతోషంగా గడిపేందుకు అవసరమైన సపర్యలు చేయడాన్నే వైద్య పరిభాషలో 'పాలియేటివ్ కేర్' అని పిలుస్తారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద కేంద్రం 2012లో పాలియేటివ్ కేర్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇండియాలో పాలియేటివ్ కేర్‌పై ఎండీ పాలియేటివ్ కేర్ కోర్సు అందుబాటులో ఉంది. 2025 నాటికి ప్రస్తుతం అందిస్తున్న పాలియేటివ్ కేర్ సేవలను రెట్టింపు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం దేశంలో 708 జిల్లాల్లో పాలియేటివ్ కేర్ సేవలు అందుతున్నాయి.

**నగర వార్తలు**

## పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్‌కు 'ఐపీఎం'



**సాక్షి, సిటీబ్యూరో:** నగరంలోని పంజగుట్ట డివిజన్ ఏసీపీ శ్రీరాముల మోహన్ కుమార్‌కు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇండియన్ పోలీసు మెడల్ (ఐపీఎం) దక్కింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పలువురికి మెడల్స్ ప్రకటించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పట్వారీగూడేనికి చెందిన మోహన్‌కుమార్ 1995లో సబ్-ఇన్‌స్పెక్టర్‌గా (ఎస్సై) పోలీసు విభాగంలో అడుగుపెట్టారు. సుదీర్ఘకాలం హైదరాబాద్ పోలీసులోనే విధులు నిర్వర్తించిన ఆయన పలు కీలక స్థానాల్లో పని చేశారు. ఎస్సైగా సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, ఇన్‌స్పెక్టర్‌గా చార్మినార్, టాస్క్‌ఫోర్స్, పంజగుట్ట, ఏసీపీగా సూర్యాపేట, సీసీఎస్‌లో పని చేశారు. మోహన్‌కుమార్ ప్రస్తుతం పంజగుట్ట ఏసీపీగా ఉన్నారు. పంజగుట్ట ఠాణా పరిధిలో చోటు చేసుకున్న ఓ న్యాయవాది హత్య కేసు దర్యాప్తులో ప్రతిభ చూపినందుకు యూనియన్ హోమ్ మినిస్టర్స్ మెడల్, కేంద్రం అందించే ఉత్కృష్ట సేవా పతకం, రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవా పతకం మోహన్‌కుమార్‌కు గతంలో లభించాయి. తనకు ఐపీఎం రావడం సంతోషంగా ఉందని మోహన్‌కుమార్ హర్షం వెలిబుచ్చారు.

## 27 నుంచి ఆలిండియా బిల్డర్స్ కన్వెన్షన్ సదస్సు

**హైటెక్స్‌లో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి**

**రాయదుర్గం:** బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బీఏఐ) ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఆలిండియా బిల్డర్స్ కన్వెన్షన్ 31వ సదస్సు(ఏబీసీ)-2024 హైదరాబాద్ వేదికగా జరగనుంది. హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గురువారం ఎన్‌ఏసీ క్యాంపస్‌లో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఏఐ జాతీయ అధ్యక్షుడు ఎస్‌ఎన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు బొల్లినేని శీనయ్య, రాష్ట్ర అధ్యక్షుడు కె దేవేందర్‌రెడ్డి విలేకరులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటుండగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటారన్నారు. మూడురోజుల పాటు సాగే ఈ సమావేశంలో 800 మందికి పైగా పాల్గొంటారన్నారు. సదస్సులో నిర్మాణరంగంలో అధునాతన టెక్నాలజీ వంటి పలు అంశాలపై సెమినార్లు, టెక్నికల్ సెషన్స్ జరుగుతాయన్నారు. ఎగ్జిబిషన్, వర్క్‌షాపులు, అధునాతన నిర్మాణ పరికరాలను, నిర్మాణ మెటీరియల్ వంటి అంశాలపై మరింత అప్‌డేట్ చేసేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ప్రతినిధులు సచ్చిదానందరెడ్డి, డీవీఎన్‌రెడ్డి, భూపేందర్‌సింగ్, సుగుణాకర్‌రావు, సంకినేని కృష్ణారావు నరేందర్‌రెడ్డి, సుధాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఓషన్ పార్క్‌కే ఎసరు

- నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి ధరణిలో రిజిస్ట్రేషన్
- ఆపై అమ్మకానికి అగ్రిమెంట్
- ప్రహరీ కూల్చడంతో విషయం వెలుగులోకి...



పోలీసుల అదుపులో నిందితులు

**మణికొండ:** నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, ఓ సంస్థకు చెందిన భూమిని ధరణిలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆపై అమ్మకానికి పెట్టారు. అసలు విషయం తెలియని కొందరు అగ్రిమెంట్ చేసుకొని నష్టపోవడమే కాకుండా కేసుల్లో ఇరుక్కున్నారు. ఈ ఘటనలో గత ఏడాది మార్చిలో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు పంపారు. నార్సింగి ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ శ్రీనివాస్ తెలిపిన మేరకు.. కోకాపేట రెవెన్యూ విలేజ్‌లో 10 ఎకరాల విస్తీర్ణంలో 'ఆశ్రయ రిసార్ట్' విస్తరించి ఉంది. అందులోనే ఓషన్ పార్కు కూడా ఉంది. దీని యజమానుల్లో ఒకరైన కొపూరు శ్రీనివాస్‌గుప్తాకు సర్వేనంబరు 168లో 4ఎకరాల భూమి ఉంది. 2022లో అందులో నుంచి తప్పుకునే క్రమంలో ఆ భూమి సంస్థకు బదలాయించాడు.

**రికార్డుల్లో మారకపోవడంతో..**

శ్రీనివాస్‌గుప్తా ఆ భూమిని సంస్థకు బదలాయించినా, రెవెన్యూ రికార్డుల్లో అతని పేరే ఉంది. విషయం తెలుసుకున్న కడప జిల్లాకు చెందిన యెల్లటూరు శివప్రకాశ్‌రెడ్డి, నారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, లింగాల చంద్ర అలియాస్ శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్‌కుమార్ అలియాస్ శ్రీనివాస్‌గుప్తాలు నకిలీ ఆధార్‌కార్డులు, భూమి పత్రాలు సృష్టించారు. వాటి ఆధారంగా ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోగా, వారికి పట్టాదార్‌పాస్ పుస్తకం మంజూరైంది. దీంతో వారు ఆ భూమి తమదేనంటూ మార్కెట్‌లో అమ్మకానికి పెట్టారు. ఈ విషయం తెలియని కొందరు గత సంవత్సరం అగ్రిమెంట్ చేసుకున్నారు. ఆ తర్వాత భూమికి చెందిన ప్రహరీ కూల్చడంతో ఓషన్ పార్క్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**నిందితుల రిమాండ్**

కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల్లో ఒకరైన శ్రీనివాస్‌కుమార్ అలియాస్ శ్రీనివాస్‌గుప్తాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న శివప్రకాశ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లింగాల చంద్ర అలియాస్ శ్రీనివాస్ గుప్తాలను బుధవారం అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

## ఐఓసీఎల్ డీలర్ల నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఐఓసీఎల్ డీలర్లు

**మూసాపేట:** మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులోని ఐఓసి కార్యాలయం ముందు తెలంగాణ ఐఓసీఎల్ డీలర్లు నల్లబ్యాడ్జీలతో గురువారం నిరసన తెలిపారు. డీలర్ ప్రతినిధులు ఈడీ అనిల్‌కుమార్, సీజీఎం సుబ్రతో రాయ్, జీఎం మనోహర్‌రావు, డీఆర్ఎస్‌హెచ్ సుదీప్తో మిత్ర, టీఏపీఎస్‌ఓ ఇతర అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐఓసీ డీలర్ల సంఘం అధ్యక్షుడు సీహెచ్ సురేష్ మాట్లాడుతూ డీలర్లపై ఐఓసీఎల్ యాజమాన్యం చేస్తున్న అనైతిక ఒత్తిడికి వ్యతిరేకంగా నిరసన తెలిపామని అన్నారు. గత 7 సంవత్సరాల నుంచి డీలర్ కమీషన్ పెరగడం లేదని, అన్ని ఖర్చులు పెరిగినప్పటికీ, తమకు కమిషనర్ పెంచకపోవంతో భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నామని అన్నారు. 2500 లీటర్ల అండర్ స్టోర్డ్ ట్యాంకుల, డెడ్‌స్టాక్ స్థాయి, బ్రాండెడ్ ఉత్పత్తుల ఒత్తిడి, సబ్సిడీ ఇతర మొత్తంను రీయింబర్స్ చేయటం, ఇతర సమస్యలపై చర్చించటం జరిగిందని డీలర్లు తెలిపారు. డీలర్ల సమస్యలన్నిటిని అధికారులు ఓపికగా విన్నారని, అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కే.అనిల్ కుమార్, కోశాధికారి విజయ్‌రావు, గౌరవాధ్యక్షుడు దినేష్ రెడ్డి, ఐఓసీఎల్ డీలర్లు తదితరుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తొలిసారిగా ఎక్స్‌-రే మొబైల్ క్లినిక్ వాహనం




**సనత్‌నగర్:** మారుమూల గ్రామాల్లో సైతం వైద్య సేవలు అందించే లక్ష్యంగా మొట్టమొదటిసారిగా ఎక్స్-రే మొబైల్ క్లినిక్ వాహనాన్ని సర్వేజనా ఫౌండేషన్ అందుబాటులోకి తీసుకువచ్చింది. బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో గురువారం ఫౌండేషన్ చైర్మన్, కిమ్స్-సన్‌షైన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏవీ గురువారెడ్డి, కిమ్స్ హాస్పటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కర్‌రావు, కార్డియాలజిస్ట్ డాక్టర్ కావ్యలతో పాటు రోటరీ ఫౌండేషన్ సభ్యులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేజన ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు, జీవనాధారం లేని వారిని గుర్తించి ఉచితంగా 68 మందికి జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలను నిర్వహించి వారి జీవితాల్లో మార్పులు తీసుకువచ్చామన్నారు. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 (ఇండియా), రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ 7870 (యూఎస్‌ఏ) ద్వారా నిధులు సమకూర్చి మొబైల్ ఎక్స్-రే వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ వాహనంలో అత్యాధునిక ఎక్స్-రే సాంకేతికతతో కూడిన మొబైల్ క్లినిక్ ఉంటుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని మారుమూల ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు పొందలేని వారికి ఈ సేవలను అందించడమే ఈ వాహనం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

## హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థి హర్షా భోగ్లేకు అవార్డు



**సనత్‌నగర్:** బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) పూర్వ విద్యార్థి, ప్రఖ్యాత భారతీయ క్రికెట్ వ్యాఖ్యత హర్షా భోగ్లేను ఎక్స్‌లెన్స్ ఫర్ స్పోర్ట్స్ కామెంటరీ అండ్ జర్నలిజం అవార్డుతో సత్కరించారు. హెచ్‌పీఎస్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌పీఎస్ సొసైటీ అధ్యక్షుడు గుస్తీనోరియా, ప్రిన్సిపాల్ డాక్టర్ స్కందబాలిలు పాల్గొన్నారు. సమాజానికి విశేషమైన సేవలను అందించేవారిని గుర్తించి ఈ అవార్డులను అందజేస్తున్నామని తెలిపారు. హర్షా భోగ్లే జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన రచనలు విద్యార్థులకు మార్గదర్శకాలన్నారు.

## 'సుప్రీం'తీర్పును గౌరవించండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశం పై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అన్ని రాజకీయ పార్టీలు గౌరవించాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు టి.హుసెన్ డిమాండ్ చేశారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీలో మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.ముఖ్య అతిథిగా హాజరైన హుసెన్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశం పై కేంద్రం తీరును తప్పుపట్టారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినా రాజకీయ లబ్ధికోసం తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎస్సీల నడుమ చిచ్చుపెడుతున్నారని ధ్వజమెత్తారు.

# టర్కిష్ కరెన్సీ మార్పిడికి టీడీపీ నేత కుమారుడి యత్నం

- చెలామణిలో లేని లీరాలు చూసి మోసం చేసే ప్రయత్నం
- రంగంలోకి దిగిన ఆరుగురు సభ్యులతో కూడిన ముఠా
- ఐదుగురిని అరెస్టు చేసిన రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులు



మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి, వీర వెంకట సత్యనారాయణ (సత్తిబాబు) దంపతులు కుమారుడు కృష్ణ ప్రసాద్ (బుజ్జి)

**సాక్షి, సిటీబ్యూరో:** ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన తెలుగుదేశం పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి కుమారుడు పిల్లి బుజ్జి చెలామణిలో లేని టర్కిష్ కరెన్సీ అంటగట్టి మోసం చేయడానికి ప్రయత్నించాడు. మరో ఐదుగురితో కలిసి ఈ ప్రయత్నం చేసిన ఆరోపణలపై రాచకొండలోని ఎల్బీనగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఏలూరులోని ఎదరవారి వీధికి చెందిన మంచినీళ్ల ఓం నాగ ప్రసాద్, దెందులూరు మండలం సోమవరప్పాడుకు చెందిన గుండిమీద జ్యోతి రవితేజ, తూర్పుగోదావరి జిల్లా ఆనందరావుపేటకు చెందిన తోట వెంకట నాగరాజు, కాకినాడలోని రాజేంద్రనగర్‌కు చెందిన నిమ్మగంటి జీవన్ సత్య, కాకినాడలోని ఇంద్రపాలానికి చెందిన మర్కుటి తేజలను అరెస్టు చేయగా... కాకినాడకే చెందిన పిల్లి బుజ్జి పరారీలో ఉన్నట్లు చూపించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టర్కీకి చెందిన లీరా కరెన్సీని ఆ దేశం కొన్నేళ్ల క్రితం డీమానిటైజ్ చేసింది. ఇందులో భాగంగా 10 లక్షల విలువతో కూడిన లీరాలను రద్దు చేసింది. ఒక్కో లీరా రూ.2.75 పైసలతో సమానం. అయితే ఈ విలువతో కూడిన 99 నోట్లు ఎనిదేళ్ల క్రితం ఓం నాగ ప్రసాద్‌కు ఏలూరుకు చెందిన ఓ గుర్తుతెలియని వ్యక్తి ద్వారా లభించాయి. అప్పటి నుంచి వీటిని మార్పిడి చేసుకునేందుకు నాగ ప్రసాద్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో అతడికి కొన్ని రోజుల క్రితం ఇతడికి ఏలూరులోనే రవితేజ, నాగరాజులతో పరిచయమైంది. దీంతో ఇతడు తన వద్ద ఉన్న టర్కిష్ కరెన్సీని మార్పిడి చేయడానికి సహకరిస్తే కమీషన్ ఇస్తానని చెప్పాడు. ఇందుకు అంగీకరించిన వారు ఈ విషయాన్ని పులి బుజ్జికి చెప్పారు. తనకు హైదరాబాద్‌లో ఉన్న పరిచయాలు వినియోగించుకుని ఈ టర్కిష్ కరెన్సీ మార్పిడి చేస్తానంటూ ముందుకు వచ్చిన అతను తన స్నేహితులైన జీవన్ సత్య, తేజలను రంగంలోకి దింపాడు. ఈ లీరాలు ప్రస్తుతం చెలామణిలో లేవనే విషయం తెలిసినప్పటికీ ఎవరికైనా తక్కువ మార్పిడి రేటుకు ఇస్తామంటూ మోసం చేయాలని భావించాడు. పథకం ప్రకారం వీరు ఆరుగురూ హైదరాబాద్ చేరుకుని గచ్చిబౌలిలోని ఓ లాడ్జిలో మకాం వేశారు. సెల్‌ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపితే ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో రెండు వాకీటాకీలనూ ప్రత్యేకంగా ఖరీదు చేసుకున్నారు. తమ వద్ద ఉన్న 99 లీరాల విలువ భారత్ కరెన్సీలో రూ.27 కోట్లు ఉంటుందని, కేవలం రూ.కోటికే ఇస్తామంటూ పలువురికి చెప్పారు. ఈ గ్యాంగ్ గురువారం తమ వద్ద ఉన్న 99 లీరాలతో చింతల్‌కుంట వద్దకు చేరుకుంది. దీనిపై సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి బుజ్జి మినహా ఐదుగురిని పట్టుకున్నారు. వీరి నుంచి స్కార్పియో, లీరాలు, స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలిలోని లాడ్జిలో బస చేసిన బుజ్జి చిక్కకపోవడం, అతడిని ఆరో నిందితుడిగా చేర్చి పరారీలో ఉన్నాడని చెప్పడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

## హెచ్ఐసీసీలో హైబిజ్‌టీవీ రియాల్టీ అవార్డ్స్

**మాదాపూర్:** దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మౌళికవసతుల కల్పనలో రెండవ స్థానంలో ఉందని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం హైబిజ్‌టీవీ రియాలిటీ అవార్డ్స్ 2024ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. రియాల్టీ రంగం ఉన్నతస్థాయిలో అభివృద్ధి చెందడానికి సహకారం అందిస్తున్న సంస్థలు, వ్యక్తులకు 25 వివిధ విభాగాలలో అవార్డులను ప్రదానం చేశారు. రియాల్టీ రంగంలో 30 మంది దిగ్గజాలకు అవార్డులను అందజేశారు. సరసమైన ధరలకే గృహాలను అందించాలని కోరారు. లెజెండ్ అవార్డు విన్నర్‌గా సినీప్రముఖులు జయభేరిగ్రూప్ చైర్మన్ మురళీమోహన్‌కు అందజేశారు. కార్యక్రమంలో హైబిజ్‌టీవీ సీఈఓ డాక్టర్ జె.సంధ్యారాణి, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రాజగోపాల్, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## జీ4ఎస్ తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

**సుల్తాన్‌బజార్:** వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని జీ4ఎస్ తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ షరీఫ్ అన్నారు. ఈ మేరకు గురువారం కోఠి డీఎంహెచ్ఎస్ క్యాంపస్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ సంఘానికి రాష్ట్ర అధ్యక్షులుగా మహ్మద్ షరీఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.అశోక్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.యాకూబ్, డిప్యూటీ జనరల్ సెక్రెటరిగా బి.మహేష్, కార్యవర్గ సభ్యులుగా జాన్‌బాస్కో, పెంటయ్య, మహ్మద్ ఖాజా, సుమన్, స్వామి, ఆనంద్, ఓంప్రకాష్, దిలీప్‌కుమార్ తదితరులు ఎన్నికయ్యారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 26-1-2024

ఫ్యాషన్


# మూడు రంగుల ముస్తాబు





దేశీయ స్ఫూర్తి కోసం ఈ రోజు ప్రత్యేకంగా కనిపించాలనుకునేవారు తిరంగా రంగులను ట్రై చేయచ్చు. అయితే, ఆరెంజ్, తెలుపు, పచ్చ మూడు రంగులును ఒకే డ్రెస్‌లో ఉండాలనుకునేవారు కొందరైతే, ఒకే కలర్ కాన్సెప్ట్‌తో స్పెషల్‌గా వెలిగిపోవాలనుకునేవారు మరికొందరు ఉంటారు. అలాగని, గాఢీగా కాకుండా లేత రంగుల ప్రత్యేకతతోనూ మెరిసిపోవాలనుకుంటారు. అభిరుచికి తగినట్టుగా డ్రెస్‌ను ఎంపిక చేసుకునే స్పెషల్ డే కి స్పెషల్ లుక్.







**యాక్ససరీస్**
ఔట్‌ఫిట్స్‌లో ట్రై కలర్స్‌కి నో చెప్పేవాళ్లు ఇతర అలంకరణలో ప్రత్యేకతను చూపవచ్చు. అందుకు ట్రై కలర్ గాజులు, బ్రేస్‌లెట్స్ మంచి ఎంపిక అవుతుంది. ట్రై కలర్స్‌లో నెయిల్‌పాలిష్ డిజైన్‌నూ ఎంచుకోవచ్చు.





జీన్స్ మీదకు గ్రీన్ కలర్ కుర్తా లేదా లాంగ్ ఓవర్ కోట్, ట్రై కలర్ జాకెట్ ధరించినా చాలు.



పూర్తి వైట్ గాగ్రా చోళీ లేదా మూడు రంగుల కలబోతగా మిక్స్ అండ్ మ్యాచ్ చేయచ్చు.

* * *

వైట్ కుర్తా మీదకు ట్రై కలర్ దుపట్టా ఒక మంచి ఎంపిక అవుతుంది. ప్రత్యేకంగానూ ఉంటుంది.



ఆరెంజ్ కలర్ శారీ, వైట్ కలర్ బ్లౌజ్ లేదా సేమ్ ఆల్ ఓవర్ ఒకే కలర్‌ని ఎంచుకోవచ్చు.



ప్రఖ్యాత డిజైనర్స్ సైతం తమ డిజైన్స్‌లో తెలుపు, పచ్చ, ఆరెంజ్‌ల ఒకే కలర్ కాన్సెప్ట్‌తో డిజైన్ చేస్తుంటారు. సందర్భాన్ని బట్టి మిక్స్ అండ్ మ్యాచ్ కాంబినేషన్ ఔట్‌ఫిట్‌ను మనమే సొంతంగా రీ డిజైన్ చేసుకోవచ్చు.

# ఆరోగ్యకారకం

వంటిల్లు

**సంక్రాంతి రుచుల తియ్యటి రుచి బయటపడాలనిపిస్తోందా! నోటికి కారంగా, పొట్టకు తేలిగ్గా ఉండే ఆహారం తినాలనిపిస్తోందా. ఉన్నది ఆరు రుచులే... కానీ జిహ్వ మరింత రుచిని కోరుకుంటుంది. నాలుకకు మమకారం మాత్రమే కాదు రుచి కారమూ ఇష్టమే. పోపుల పెట్టెలో దినుసులన్నీ కలిపి రకరకాల కారం పొడులు చేద్దాం.**

## నువ్వుల పొడి



**కావలసినవి:** తెల్ల నువ్వులు – వంద గ్రాములు; ఎండు మిర్చి– 10; మినప్పప్పు – అర టేబుల్ స్పూన్; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; ఇంగువ – అర టీ స్పూన్; ఉప్పు– రుచికి తగినంత

**తయారీ:** ● మందపాటి బాణలిలో నువ్వులు వేసి మీడియం మంట మీద దోరగా వేయించి పక్కన పెట్టాలి. ● మరొక బాణలిలో ఎండుమిర్చి, పచ్చి శనగపప్పు, మినప్పప్పు వేయించి చివరగా జీలకర్ర వేసి దించేయాలి. ఇవన్నీ చల్లారిన తర్వాత మిక్సీ జార్‌లో నువ్వులు, పోపు దినుసులు, ఇంగువ, ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి. ఈ పొడిని అన్నం, ఇడ్లీ, ఉప్మాల్లో తినవచ్చు. కూరల్లో కలుపుకోవచ్చు. వేపుళ్లలో పైన చల్లుకోవచ్చు. ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కాబట్టి వారంలో కనీసం మూడు రోజులు ఆహారంలో ఈ పొడి ఉండేలా చూసుకోవడం మంచిది.

## కొబ్బరి పొడి

**కావలసినవి:** ఎండుకొబ్బరి తురుము – వంద గ్రాములు; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; వేయించిన శనగపప్పు – టీ స్పూన్; మిరప్పొడి– టేబుల్ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; వెల్లుల్లి రేకలు – 4; ఇంగువ – అర టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

**తయారీ:** ● బాణలిలో పచ్చి శనగపప్పు వేసి దోరగా వేగిన తర్వాత వేయించిన శనగపప్పు, జీలకర్ర, వెల్లుల్లి, ఇంగువ,



కొబ్బరి తురుము వేసి కలిపి దించేయాలి. వేడి తగ్గిన తర్వాత అన్నింటినీ మిక్సీ జార్‌లో వేసి మిరప్పొడి, ఉప్పు కలిపి పొడి చేయాలి. ఇడ్లీ, దోశెలు, అన్నంలోకి బాగుంటుంది. వేపుళ్లలో ఒక టేబుల్ స్పూన్ పొడి కలిపితే రుచి ఇనుమడిస్తుంది.

## కరివేపాకు పొడి



**కావలసినవి:** కరివేపాకు– వందగ్రాములు (మంచి నీటిలో శుభ్రం చేసి ఆరబెట్టి ఈనెలు తీసిన ఆకులు); ఎండు మిర్చి– పది; ఆవాలు– అర టీ స్పూన్; పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్; మినప్పప్పు – టేబుల్ స్పూన్; వేరుశనగపప్పు – అర టేబుల్ స్పూన్; ధనియాలు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; మిరియాలు – అర టీ స్పూన్; చింతపండు – అర అంగుళం పాయ; వెల్లుల్లి రేకలు – 4; ఇంగువ పొడి– పావు టీ స్పూన్; నూనె – టేబుల్ స్పూన్; ఉప్పు – రుచికి తగినంత.

**తయారీ:** ● బాణలిలో నూనె వేడి చేసి వేరు శనగపప్పు, ఆవాలు, ఎండు మిర్చి, ధనియాలు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు దోరగా వేయించాలి. అవి వేగిన తర్వాత మిరియాలు, జీలకర్ర, కరివేపాకు వేసి వేయించాలి. ఆకులో పచ్చిదనం పోయే వరకు చిన్న మంట మీద వేయించాలి. ఆకు వేగిన తర్వాత చింతపండు, ఇంగువ, వెల్లుల్లిరేకలు, ఉప్పు వేసి దించేయాలి. ● చల్లారే కొద్దీ ఆకు పెళపెళలాడుతుంది. పూర్తిగా చల్లారిన వెంటనే మిక్సీలో వేసి పొడి చేయాలి. రుచి చూసి అవసరమైతే మరికొంత ఉప్పు కలుపుకోవాలి. ఈ పొడి వేడి అన్నం, ఇడ్లీ, దోశెల్లోకి రుచిగా ఉంటుంది. ఆకలి మందగించినప్పుడు, నోటికి ఏదీ రుచించనప్పుడు ఈ పొడి తింటే జీర్ణవ్యవస్థ క్రమబద్ధమవుతుంది.

**గమనిక:** చల్లారిన వెంటనే పొడి చేయకపోతే ఆలస్యమయ్యే కొద్దీ ఆకు మెత్తబడి పోతుంది. సరిగ్గా మెదగదు.

## అవిశె గింజల పొడి



**కావలసినవి:** అవిశె గింజలు – వందగ్రాములు; ఎండు మిర్చి – పది; ఆవాలు – అర టీ స్పూన్; మిరియాలు– అర టీ స్పూన్; పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్; మినప్పప్పు – టీ స్పూన్; వేరు శనగపప్పు – అర టేబుల్ స్పూన్; ధనియాలు – టీ స్పూన్; ఇంగువ– అర టీ స్పూన్; కరివేపాకు – రెండు రెమ్మలు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

**తయారీ:** బాణలిలో అవిశె గింజలను మీడియం మంట మీద వేయించి పక్కన పెట్టుకోవాలి. మరొక బాణలిలో ఎండుమిర్చి, ఆవాలు, ధనియాలు, వేరు శనగపప్పు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, మిరియాలు, కరివేపాకు వేసి వేయించాలి. దినుసులన్నీ చక్కగా వేగి మంచి వాసన వచ్చేటప్పుడు అవిశె గింజలు, ఇంగువ వేసి కలిపి దించేయాలి. వేడి తగ్గిన తర్వాత మిక్సీ జార్‌లో వేసి ఉప్పు కలిపి పొడి చేసుకోవాలి. ఇది పూర్తిగా ఆరోగ్యకారకం. గుండె వ్యాధుల నివారణ, డయాబెటిస్ నియంత్రణకు డాక్టర్లు అవిశె గింజలను సూచిస్తున్నారు. రుచి కోసం చూడకుండా రోజూ ఒక స్పూన్ అన్నంలో లేదా బ్రేక్‌ఫాస్ట్‌లలో ఏదో ఒకరకంగా తీసుకోవడం మంచిది.

# రామ సన్నిధిలో శబరి గీతం

న్యూస్‌మేకర్
మైథిలీ ఠాకూర్



**అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సమయంలో మంత్రాలు, స్తోత్రాలతోపాటు భక్తి సంగీతం కూడా భక్తులను తన్మయత్వానికి గురి చేసింది. శంకర్ మహదేవన్, సోను నిగమ్ వంటి సీనియర్ గాయకులతో పాటు రామ సన్నిధిలో 'శబరి గీతం' వినిపించిన బిహార్ గాయని మైథిలీ ఠాకూర్ ప్రత్యేక ప్రశంసలు పొందింది. నరేంద్ర మోదీ ఆమె గురించే ప్రత్యేకంగా ట్వీట్ చేశారు. ఆరేళ్ల వయసు నుంచి భక్తి సంగీతాన్ని వినిపిస్తున్న మైథిలీ ఠాకూర్ పరిచయం.**

'శబరీ సవారె రాస్తా
ఆయేంగె రామ్‌జీ'...
(శబరి వీధుల్ని అలంకరిస్తోంది
రాముని రాక కోసం)...

అని పాడిన మైథిలీ ఠాకూర్ పాటను ప్రత్యేకంగా మెచ్చుకుంటూ ట్వీట్ చేశారు ప్రధాని మోదీ. బాలక్ రామ్ ప్రాణ ప్రతిష్ఠ సమయంలో మైథిలీ ఠాకూర్ ఈ పాటను యూట్యూబ్‌లో విడుదల చేయడమే కాదు... ప్రాణప్రతిష్ఠ సమయంలో ఆలయప్రాంగణంలో రాముని భజనలు కూడా పాడింది. దేశం మొత్తంలో ఇలాంటి అవకాశం పొందిన అతి చిన్న వయసు గాయని మైథిలి. 21 ఏళ్ల వయసులో ఇంత గుర్తింపు పొందడానికి కారణం ఎడతెగని సాధన, సంగీతం పట్ల ఆరాధనే.

**బిహార్ అమ్మాయి**

మైథిలీ ఠాకూర్‌ది బిహార్‌లోని మధుబని. తండ్రి రమేష్ ఠాకూర్ భజన గాయకుడు. అందువల్ల బాల్యం నుంచి తండ్రితో పాటు భజనలు పాడేది మైథిలి. ఇంట్లో ఏదో ఒక సమయంలో రామ్‌సీతా కీర్తనలు కొనసాగుతుండేవి. మైథిలిని తన వారసురాలిగా చేయాలని తండ్రికి ఉండేది. అందుకుని పదేళ్ల వరకూ స్కూల్‌కే పంపకుండా సంగీతంలో సాధన చేయించాడు. అయితే మైథిలికి గుర్తింపు మాత్రం వెంటనే రాలేదు.

**గెలుపూ ఓటమి**

మైథిలి భవిష్యత్తు కోసం ఢిల్లీకి మకాం మార్చాడు తండ్రి. ఢిల్లీలోని బాలభవన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నేరుగా ఆరవ తరగతిలో చేరిన మైథిలి మొదటిసారి స్కూల్ ముఖం చూడటం, అక్కడ ఇంగ్లిష్ రాక అవస్థ పడటం కొనసాగిస్తూనే సంగీతాన్ని సాధన చేసింది. ఢిల్లీలో మైథిలి కచ్చేరీలు చేసినా అందరికీ తెలిసేటంతటి పేరు రాలేదు. ఆ సమయంలోనే అంటే 11 ఏళ్ల వయసులో 'లిటిల్ చాంప్', 'ఇండియన్ ఐడల్ 2' వంటి రియాలిటీ షోస్‌కు వెళ్లి ఫెయిల్ అయ్యి తిరిగి వచ్చింది మైథిలి.



**దశ తిరిగింది**

2017లో కలర్స్ టీవీలో 'రైజింగ్ స్టార్' అనే సింగింగ్ రియాలిటీ షో మైథిలి దశ తిప్పింది. ఆ షోలో మైథిలి రన్నర్ అప్‌గా నిలిచింది. ముంబైలో ఈ షో చేసి తిరిగి వచ్చాక ఢిల్లీ నుంచే తాను లోకానికి తెలియానుకుంది. వెంటనే సోషల్ మీడియాలో తన పాటలను పోస్ట్ చేయడం మొదలెట్టింది. మైథిలికి ఇద్దరు తమ్ముళ్లు–రిషబ్, అయాచి ఉన్నారు. వారిద్దరు తబలా, డోలక్ వాయిస్తారు. మైథిలి హార్మోనియం వాయిస్తుంది. వీరు ముగ్గురు కలసి పాటల వీడియోలు రిలీజ్ చేయడం మొదలెట్టారు. పెద్ద హిట్ అయ్యాయి. సినిమా పాటలే కాకుండా బిహార్‌లోని జానపద సంగీతాన్ని, పంజాబీ, గుజరాతీ, కేసరియా, బజ్జిక వంటి సంగీత ధోరణులను వీడియోలుగా రిలీజ్ చేసింది మైథిలి. అంతేకాదు భజన సంగీతాన్ని కొనసాగించింది. ఇప్పుడు ఆమెకు యూట్యూబ్‌లో 20 లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. ఇన్‌స్టాలో, ఫేస్‌బుక్‌లో లక్షల ఫాలోయెర్లు ఉన్నారు. ఆ ప్రఖ్యాతి మైథిలిని రాముని పాదాల వరకూ చేర్చింది.

యువర్స్

## నవతరం వందేమాతరం

కొన్ని తరాల వెనక్కి వెళితే...యువతలో దేశభక్తి వ్యక్తీకరణ పద్యం, పాట, కవిత, నినాదాల రూపంలో కనిపించేది. ఇక నేటి యువత విషయానికి వస్తే... సోషల్ మీడియా క్యాంపెయిన్స్, డిజిటల్ ఎంగేజ్‌మెంట్, వర్చువల్ ఎడ్యుకేషనల్ కంటెంట్ ద్వారా తమలోని దేశభక్తిని చాటుకుంటున్నారు...



దేశభక్తి భావాలను డిజిటల్ ప్రపంచంలోకి తీసుకువచ్చింది యువత. ఒకప్పుడు మన దేశానికి మాత్రమే పరిమితమైన దేశాభిమాన భావాలు ఇప్పుడు ఇంటర్నెట్ పుణ్యమా అని విశ్వవ్యాప్తం అవుతున్నాయి.

ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమ వీరోచిత పోరాటగాథలను సోషల్ మీడియా వేదికగా యువత గుర్తు తెచ్చుకుంటుంది. కంటెంట్ క్రియేషన్ ద్వారా కూడా తమలోని దేశభక్తి భావాలను సృజనాత్మకంగా ఆవిష్కరిస్తున్నారు.

'జెన్–జెడ్ ఆర్టిస్టులు తమలోని దేశభక్తి భావాలను పాటలు, చిత్రాల రూపంలో ఆవిష్కరిస్తున్నారు. ప్రపంచ ధోరణులను గమనిస్తూ, విశ్లేషిస్తూనే కంటెంట్ క్రియేషన్‌కు సంబంధించి దేశీయతకు ప్రాధాన్యత ఇస్తున్నారు' అంటుంది కంటెంట్ క్రియేటర్ జాహ్నవి తివారి.

బెంగళూరుకు చెందిన 23 సంవత్సరాల ప్రణవ్ స్కూల్ రోజుల్లో 'హిస్టరీ రొస్టు కంటే రెస్టు మేలు' అన్నట్లుగా ఉండేవాడు. బోర్‌గా ఫీలయ్యేవాడు. అయితే ఇప్పుడు హిస్టరీ అనేది అతడి ఫేవరెట్ సబ్జెక్ట్. హిస్టరీ పుస్తకాలను ఇష్టంగా చదువుతుంటాడు. ది డిస్కవరీ ఆఫ్ ఇండియా, ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్, ది లాస్ట్ మొఘల్, ది వండర్ దట్ వాజ్ ఇండియా...మొదలైనవి అతడి అభిమాన పుస్తకాలు.

'ఒక దేశ గొప్పదనం గురించి తెలుసుకోవాలంటే ఆ దేశచరిత్ర తెలుసుకోవాలి అనే మాట విని చరిత్ర పుస్తకాలపై ఆసక్తి పెరిగింది. బుక్‌లెట్‌లాంటి చిన్న పుస్తకాలతో మొదలు పెట్టి ఇప్పుడు వందల పేజీలు ఉన్న పెద్ద పుస్తకాలు కూడా చదువుతున్నాను' అంటున్నాడు ప్రణవ్.

'దేశాన్ని ముందుకు నడిపించే ప్రతి మంచిపని దేశభక్తిగానే పరిగణించాలి. పర్యావరణ స్పృహ నుంచి స్టార్టప్‌ల వరకు ఏదైనా కావచ్చు' అంటున్న ముంబైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ తేజస్వీ పర్యావరణ హిత, సామాజిక స్పృహకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుంది. ఇక సినిమాలకు సంబంధించి 'యే జో దేశ్ హై తేరా, స్వదేశ్ హై తేరా' (స్వదేశ్), ఆప్నీ అజాదీ కో (లీడర్–1964), యే మేరా ఇండియా–ఐ లవ్ మై ఇండియా (పర్‌దేశ్)...మొదలైన పాటలను ఎక్కువగా షేర్ చేస్తుంటారు. జీ మ్యూజిక్ కంపెనీ 'సలామ్ ఇండియా' 'భారత్ సలామ్' టీ–సీరిస్ 'ఇండిపెండెన్స్ డే స్పెషల్' టిప్స్ 'ఇండిపెండెన్స్ డే సాంగ్స్' సారేగామా మ్యూజిక్ 'రిపబ్లిక్ డే స్పెషల్' నైంటీస్ గానే 'ఐ లవ్ మై ఇండియా–రిపబ్లిక్ డే సాంగ్స్' ఆల్బమ్‌లకు యూట్యూబ్‌లో యువత నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

సింగర్–సాంగ్ రైటర్ వినీత్ సింగ్ మ్యూజిక్ ఇండస్ట్రీలో రికార్డ్‌లు బ్రేక్ చేయడంలో ఘనాపాటీ. 'యుయస్ టాప్ 100 రేడియో చార్ట్స్'లో అతడి పాటలు టాప్‌లో నిలిచాయి. కొత్త దేశభక్తి గీతం 'బార్న్ ఇన్ భారత్, బార్న్ ఫర్ ఇండియా'తో ముందుకు వచ్చాడు వినీత్. డైనమిక్ వోకల్స్, ఎనర్జిటిక్ బేస్‌లైన్‌తో కూడిన ఈ పాట నవభారతాన్ని కళ్ల ముందు ఆవిష్కరిస్తుంది.

'దేశభక్తి పాటలు స్ఫూర్తిని ఇస్తాయి. దేశానికి నా వంతుగా ఏదైనా చేయాలనే సంకల్పాన్ని ఇస్తాయి' అంటున్న దిల్లీకి చెందిన అద్విక్ దేశభక్తి పాటలు పాడడంలో మంచి పేరు తెచ్చుకున్నాడు. 'దేశభక్తి గీతాలు కొన్ని రోజులకు మాత్రమే పరిమితమైనవి కావు. అన్ని రోజుల్లో వినాల్సిన విలువైన గీతాలు' అంటాడు 24 సంవత్సరాల అద్విక్.

## స్ఫూర్తిదాయక ఏఐ శకటం



ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖకు సంబంధించిన ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) శకటాన్ని ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు. కృత్రిమ మేధ(ఏఐ)లో మన దేశం సాధించిన పురోగతికి అద్దం పట్టేల, హెల్త్‌కేర్, లాజిస్టిక్స్, విద్య, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫాక్చరింగ్‌పై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావాన్ని ప్రతిఫలించేలా ఈ శకటాన్ని తీర్చిదిద్దారు. శకటంలో ఒక మహిళా రోబోట్ కృత్రిమ మేధస్సును ప్రతిబింబించేలా ఉంటుంది. వివిధ ఎలక్ట్రానిక్ పరికరాల్లో కీలకమైన సెమీకండక్టర్ చిప్ 3డీ మోడల్‌ను శకటంలోఏర్పాటు చేశారు. వివిధ రంగాల్లో భారతదేశ అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగాన్ని తెలియజేసేలా శకటానికి ఇరువైపులా ఎల్‌ఈడీ లైట్లతో అలంకరించిన సర్క్యూట్ డిజైన్ ఆకట్టుకుంటుంది. ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్స్(పీఎల్‌ఐ)లాంటి కార్యక్రమాల ద్వారా ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్‌లో మన దేశం సాధించిన పురోగతిని కూడా ఈ శకటం హైలెట్ చేస్తుంది. శకటం మధ్య విభాగంలో లాజిస్టిక్స్‌పై దృష్టి పెట్టారు. కలర్ కోడింగ్ ఆధారంగా పార్శిల్ గుర్తింపు, విభజనకు సాంకేతికత ఎలా సహాయపడుతుందో తెలియజేసేలా ఉంటుంది. శకటం వెనుక భాగం విద్యారంగంపై దృష్టిని మళ్లిస్తుంది. వీఆర్ హెడ్‌సెట్ ధరించి వర్చువల్ రియాలిటీ ద్వారా రిమోట్ క్లాసును నిర్వహించే ఉపాధ్యాయుడి లార్జర్ దెన్ లైఫ్ స్టాచ్యూ ఉత్తేజకరంగా ఉంటుంది. పశువుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించడంలో సెన్సర్‌ల ద్వారా ఏఐ అప్లికేషన్‌ల ఉపయోగం, నావిగేషన్‌కు సంబంధించి దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు సహాయపడే విషయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారాన్ని ఈ ఏఐ శకటం హైలెట్ చేస్తుంది.

### ● అవును... ఇది నిజమే!

● 'రిపబ్లిక్‌డే జనవరి 26న ఎందుకు జరుపుకుంటామో తెలుసా?'

అనే ప్రశ్నకు...'1950, జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చింది కాబట్టి' అని చెబుతాం. ఇది నిజమే అయినప్పటికీ అసలు కారణం వేరు. భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న ఆమోదించారు. అయితే రాజ్యాంగాన్ని అమలు చేసే తేదీకి ప్రాముఖ్యత ఉండాలనే ఉద్దేశంతో జనవరి 26ని ఎంపిక చేసుకున్నారు.

**జనవరి 26 ప్రాముఖ్యత ఏమిటి?**

1930 జనవరి 26న లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో తొలిసారిగా సంపూర్ణ స్వరాజ్య తీర్మానం చేశారు. చారిత్రక ప్రాధాన్యత ఉన్న 'జనవరి 26'కి చిరస్థాయి కల్పించాలనే ఉద్దేశంతో 1950 జనవరి 26 నుంచి రాజ్యాంగాన్ని అమల్లోకి తెచ్చారు

● రాజ్యాంగం అసలు ప్రతిని ప్రేమ్ బిహారి నారాయణ్ రైజాదా తన అందమైన చేతి రాతతో హిందీ, ఇంగ్లీష్‌లలో రాశారు. రాయడానికి ఆరు నెలల సమయం తీసుకుంది.

● తొలి రిపబ్లిక్ పరేడ్ (1950) దిల్లీలోని ఇర్విన్ యాంఫీథియేటర్ (ప్రస్తుతం మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియం)లో జరిగింది.

● రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న తొలి విదేశీ సైనిక బృందం...ఫ్రెంచ్ ఆర్మీ సైనికులు (2016).

● ఫస్ట్ రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరైన ఫస్ట్ చీఫ్ గెస్ట్ ఇండోనేషియా ప్రెసిడెంట్ సుకర్ణో.



### ● టెక్.. టాక్



**ఒప్పో ప్యాడ్ నియో**

సైజ్: 11.4 అంగుళాలు
రిజల్యూషన్: 2408X1720
రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్
బ్యాటరీ: 8000 ఎంఏహెచ్
బరువు: 538 గ్రా.
ఓఎస్: ఆండ్రాయిడ్ 13
కలర్: గ్రే



**రెడ్‌మీ నోట్ 13 ప్రో 4జీ**

డిస్‌ప్లే: 6.67 అంగుళాలు
రిజల్యూషన్: 1080X2400 పిక్సెల్స్
మెమరీ: 256జీబి 8జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
ఫ్రంట్ కెమెరా: 16 ఎంపీ

## సినిమా


● రవితేజ

### కారైకుడిలో మిస్టర్ బచ్చన్

కారైకుడికి వెళ్లారు 'మిస్టర్ బచ్చన్'. రవితేజ టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ఉపశీర్షిక. ఈ సినిమాకు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. పనోరమా స్టూడియోస్, టీ–సిరీస్ సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. కాగా 'మిస్టర్ బచ్చన్' సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ తమిళనాడులోని కారైకుడిలో ప్రారంభమైంది. రవితేజతో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ–నిర్మాతగా ఉన్న ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ స్వరకర్త.


● రామ్

### ఇస్మార్ట్ మ్యూజిక్

'డబుల్ ఇస్మార్ట్' మ్యూజిక్ సిట్టింగ్స్ జోరందుకున్నాయి. 'ఇస్మార్ట్ శంకర్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. 'ఇస్మార్ట్ శంకర్' సినిమాకు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. కాగా ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ మొదలయ్యాయి. ఈ విషయాన్ని 'ఎక్స్'లో షేర్ చేసి, 'డబుల్ ఇస్మార్ట్' అప్‌డేట్‌ను వెల్లడించింది చిత్రబృందం. 'ఇస్మార్ట్ శంకర్'కు సంగీతం అందించిన మణిశర్మనే సీక్వెల్‌కూ సంగీతం అందిస్తున్నారు. గతంలోనూ పూరి–మణిశర్మ కాంబినేషన్‌లో 'పోకిరి' వంటి బ్లాక్ బస్టర్ ఆల్బమ్ వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే ఈ సినిమా క్లైమాక్స్ పోర్షన్స్ చిత్రీకరణ కోసం దాదాపు 7 కోట్ల రూపాయలు కేటాయించినట్లుగా సమాచారం. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను మార్చి 18న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ గతంలో ప్రకటించింది. అయితే ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయన్నది ఫిల్మ్‌నగర్ తాజా కబురు.


● నాగార్జున, విజయ్ బిన్నీ, 'అల్లరి' నరేశ్, శ్రీనివాసా చిట్టూరి

### అలా సినిమాలు తీయడం సులభం కాదు - నాగార్జున

''నేను దాదాపు 95మందికి పైగా దర్శకులతో పని చేశాను. చక్కని క్లారిటీతో సినిమాలు చేసే కొద్దిమంది దర్శకుల్లో విజయ్ ఒకరు అని నాకనిపించింది. 'నా సామిరంగ' మూవీని ఓ పాటలా అందంగా తీసి, కొరియోగ్రాఫర్ అనిపించుకున్నాడు. సినిమాకి ఎంత కావాలో సరిగ్గా అంతే తీశాడు. ఇలా తీయడం అంత సులభం కాదు'' అని నాగార్జున అన్నారు. ఆయన హీరోగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్, ఆషికా రంగనాథ్, మిర్నా మీనన్, రుక్సార్ ధిల్లాన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నా సామిరంగ'. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలైంది. 'నా సామిరంగ' సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ – టీవీ డ్యాన్సర్స్ – డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్లు కలిసి విజయ్ బిన్నీని సన్మానించాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జున మాట్లాడుతూ– ''ఈ వేడుకకు రావడాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నాను. మీ అందరి చిరునవ్వులు చూస్తుంటే మనసు ఆనందంతో పొంగిపోయింది. విజయ్‌తో వండర్‌ఫుల్ వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్'' అన్నారు. మరో అతిథి 'అల్లరి' నరేశ్ మాట్లాడుతూ– ''దర్శకుడిని కావాలనుకున్న తన కలను సక్సెస్‌ఫుల్‌గా నెరవేర్చుకున్నారు విజయ్. ఇక్కడున్న డ్యాన్స్ మాస్టర్స్‌కి ఆల్ ది బెస్ట్'' అన్నారు. ''నాగార్జునగారు నన్ను దర్శకుడిగా ఎంచుకోవడం నా అదృష్టం'' అన్నారు విజయ్ బిన్నీ. ''విజయ్ గారు డైరెక్టర్‌గా గొప్ప విజయాన్ని అందుకోవడం మా అందరికీ గర్వకారణం'' అన్నారు శేఖర్ మాస్టర్.

### ఇళయరాజా కుమార్తె, సంగీత దర్శకురాలు భవతారణి కన్నుమూత



ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ఆయన కుమార్తె, గాయని భవతారణి రాజా (47) కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ గురువారం రాత్రి శ్రీలంకలో కన్నుమూశారు. నేడు ఆమె భౌతికకాయాన్ని చెన్నైకు తీసుకురానున్నారు. శుక్రవారమే అంత్యక్రియలు జరుగుతాయని తెలిసింది. ఇళయరాజాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో కార్తీక్ రాజా, యువన్ శంకర్ రాజా సంగీత దర్శకులు. కుమార్తె భవతారణి సంగీత దర్శకురాలిగా, గాయనిగా రాణిస్తున్నారు.

మలయాళ త్రీడీ 'మై డియర్ కుట్టి చాత్తాన్' (1984) గాయనిగా భవతారణికి తొలి చిత్రం. ప్రభుదేవా హీరోగా నటించిన 'రాసయ్య' (1995) చిత్రం ద్వారా గాయనిగా కోలీవుడ్‌కి పరిచయమయ్యారు భవతారణి. అదే విధంగా 'భారతి' (2000) చిత్రంలోని 'మైలు పోల పొన్ను..' అనే పాటకు గాను జాతీయ ఉత్తమ గాయనిగా కేంద్ర ప్రభుత్వ అవార్డును అందుకున్నారామె. తెలుగులోనూ పలు పాటలు పాడారు. తండ్రి, సోదరుల సంగీత దర్శకత్వంలో అనేక పాటలను పాడారు భవతారణి. దాదాపు పాతిక చిత్రాల్లో పాటలు పాడారు.

తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'గుండెల్లో గోదారి' సినిమాలో 'నన్ను నీతో..' పాటను పాడారామె. మెలోడీ పాటలతో సంగీత అభిమానుల హృదయాలలో చోటు దక్కించుకున్నారు. 2002లో నటి రేవతి దర్శకురాలిగా తెరకెక్కించిన తొలి చిత్రం 'మిత్ర్: మై ఫ్రెండ్'తో సంగీత దర్శకురాలిగా మారారు భవతారణి. సల్మాన్ ఖాన్, అభిషేక్ బచ్చన్, శిల్పాశెట్టి ముఖ్య తారలుగా వచ్చిన హిందీ చిత్రం 'ఫిర్ మిలేంగే' (2004) సినిమాకు ఓ సంగీత దర్శకురాలిగా చేశారు. హిందీలో ఆమెకు ఇది తొలి చిత్రం. తెలుగులో 'అవునా'(2003), కన్నడలో 'గీయా గీయా' (2005) సినిమాలకు సంగీతం అందించారు భవతారణి. దాదాపు పది చిత్రాలకు సంగీత దర్శకురాలిగా చేశారు. అడ్వర్టైజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆర్. శబరిరాజ్‌తో భవతారణి వివాహం జరిగింది. వీరికి సంతానం లేరు.


భవతారణి మృతి పట్ల పలువురు చిత్రరంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.


● మోక్ష, 'దిల్' రాజు, కృష్ణవంశీ

### మాటలు హత్తుకునేలా ఉన్నాయి - 'దిల్' రాజు

''అలనాటి రామచంద్రుడు' చిత్ర దర్శకుడు, నిర్మాత.. ఇలా అందరూ కొత్తవారే. ఈ రోజుల్లో సినిమా తీయడం కంటే దాన్ని థియేటర్లోకి తీసుకెళ్లడం గొప్ప విషయం. ఇకపై ఈ యూనిట్ అంతా చాలా కష్టపడాలి.. సినిమాని ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లాలి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. కృష్ణవంశీ, మోక్ష జంటగా చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ని 'దిల్' రాజు విడుదల చేసి, మాట్లాడుతూ–''అలనాటి రామచంద్రుడు' టైటిల్ బాగుంది. మాటలు మనసుని హత్తుకునేలా ఉన్నాయి. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''సరికొత్త ప్రేమకథా చిత్రమిది. చక్కని వినోదం ఉంటుంది'' అన్నారు చిలుకూరి ఆకాష్ రెడ్డి. ''మంచి కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. మా సినిమా ప్రేక్షకులని అలరిస్తుంది'' అన్నారు శ్రీరామ్ జడపోలు. ''అలనాటి రామచంద్రుడు' వంటి మంచి సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు కృతజ్ఞతలు అన్నారు కృష్ణవంశీ, మోక్ష.

### సినిమానే మాట్లాడుతుంది


● రవి కస్తూరి

గీతానంద్, నేహా సోలంకి జంటగా దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించిన చిత్రం 'గేమ్ ఆన్'. ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం రవి కస్తూరి విలేకరులతో మాట్లాడుతూ– ''ఆస్ట్రేలియాలో నాకు వ్యాపారాలున్నాయి. నిర్మాతగా నాకు ఇది తొలి చిత్రం. గీతానంద్ హీరోగా, నేను నిర్మాతగా సినిమాలు చేయాలనుకున్నాం. కథ సెట్ కావడంతో 'గేమ్ ఆన్' స్టార్ట్ చేశాం. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ. జీవితాన్ని చాలించాలనుకునే ఓ వ్యక్తి దాన్ని ఎలా అధిగమించాడు? అనేది గేమ్ థీమ్‌లో చూపించాం. ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా కూడా. ఓ సినిమాకు మనం ఎంత పబ్లిసిటీ చేసినా మార్నింగ్ షోకు ఆడియన్స్ వెళ్లేంతవరకే. ఆ తర్వాత సినిమానే మాట్లాడుతుంది'' అని చెప్పుకొచ్చారు.


● విశాల్

### రత్నం రెడీ

వేసవిలో థియేటర్స్‌కు వస్తున్నాడు 'రత్నం'. విశాల్ హీరోగా నటించిన తాజా యాక్షన్ ఫిల్మ్ 'రత్నం'. ఈ చిత్రంలో ప్రియాభవానీ శంకర్ హీరోయిన్‌గా నటించారు. హరి దర్శకత్వంలో కార్తికేయన్ సంతానం ఈ సినిమాను నిర్మించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా ఈ సినిమాను వేసవిలో ఏప్రిల్ 26న విడుదల చేయనున్నట్లుగా చిత్రయూనిట్ వెల్లడించింది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. 'తుప్పరివాలన్' (తెలుగులో 'డిటెక్టివ్')కి సీక్వెల్‌గా 'తుప్పరివాలన్ 2' చేస్తున్నారు విశాల్. ఈ మూవీలో హీరోగా నటించడంతో పాటు దర్శకత్వం వహించనున్నారట విశాల్. ఈ ఏడాదే చిత్రీకరణ ప్రారంభించాలనుకుంటున్నారని సమాచారం.

# సాక్షి బిజినెస్

శుక్రవారం
26-1-2024

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 360 | 102 |
| 70,701 | 21,353 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| సూచీ | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 15,571 | △ | 87 |
| డోజోన్స్ | 37,874 | △ | 67 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,535 | △ | 8 |
| డాక్స్ | 16,904 | △ | 14 |
| షాంఘై | 2,906 | △ | 85 |
| నికాయ్ | 36,236 | △ | 10 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## బులియన్ (రూ.లలో)

**ముంబై**

| | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | | |
| 62,312 | ▽ | 279 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | | |
| 62,062 | ▽ | 278 |
| వెండి (కేజీ) | | |
| 71,299 | ▽ | 227 |

## ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 82.73 | 83.75 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 104.63 | 107.21 |
| € | యూరో | ఎస్‌బీఐ | 89.49 | 94.85 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 55.58 | 56.84 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 53.92 | 55.85 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 61.19 | 62.63 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.21 | 22.83 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.73 | 23.53 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.47 | 12.54 |

## కుమారులకు 'ప్రేమ్'జీ కానుక

కోటి విప్రో షేర్లు బదిలీ



**న్యూఢిల్లీ:** ఐటీ దిగ్గజం విప్రో లిమిటెడ్ వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీ తన కుమారులకు కంపెనీ ఈక్విటీలో 0.2 శాతం వాటాను కానుకగా ఇచ్చారు. 1.02 కోట్ల ఈక్విటీ షేర్లను రిషద్ ప్రేమ్‌జీ, తారిఖ్ ప్రేమ్‌జీ పేరున బదిలీ చేశారు. విప్రో షేరు ప్రస్తుత మార్కెట్ ధర రూ. 470 ప్రకారం వీటి విలువ దాదాపు రూ. 480 కోట్లు. ప్రస్తుతం రిషద్ ప్రేమ్‌జీ.. విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. 'నా వద్దగల 1,02,30,180 విప్రో షేర్లను రిషద్, తారిఖ్‌లకు కానుకగా బదిలీ చేస్తున్నాను' అంటూ అజీమ్ హెచ్ ప్రేమ్‌జీ తెలియజేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు విప్రో తాజాగా సమాచారమిచ్చింది. ఇది కంపెనీ ఈక్విటీలో 0.2 శాతం వాటాకాగా.. దీంతో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ వాటాలలో ఎలాంటి మార్పులూ చోటుచేసుకోబోవని విప్రో వివరించింది.

హిండెన్‌బర్గ్ ఉదంతానికి ఏడాది

## పటిష్టంగా ఎదిగాం..

- రూ. 40 వేల కోట్లు సమీకరించాం; రుణభారం తగ్గించుకున్నాం
- పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ప్రారంభించాం
- అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ



**న్యూఢిల్లీ:** హిండెన్‌బర్గ్ ఉదంతంతో గత ఏడాది కాలంగా ఎదురైన పరీక్షలు, సవాళ్లు తమ గ్రూప్‌ను మరింత బలోపేతం చేశాయని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ తెలిపారు. అన్నింటినీ తట్టుకుని వృద్ధి బాటలో ముందుకు సాగామని, ధారావి సహా పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ప్రారంభించామని ఆయన వివరించారు. అదానీ గ్రూప్ కంపెనీల్లో, షేర్లలో అవకతవకలు జరుతున్నాయన్న అమెరికన్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ నివేదిక .. గతేడాది అదానీ సంస్థలను కుదిపేసిన సంగతి తెలిసిందే. ఈ ఉదంతం చోటు చేసుకుని ఏడాది అయిన సందర్భంగా రాసిన కాలమ్‌లో గౌతమ్ అదానీ ఈ విషయాలు తెలిపారు. గత ఏడాది వ్యవధిలో అదానీ గ్రూప్ కొన్ని సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా వచ్చే రెండేళ్ల పాటు రుణాల చెల్లింపునకు సరిపోయేంత స్థాయిలో ఏకంగా రూ. 40,000 కోట్లు సమీకరించిందని ఆయన వివరించారు. అలాగే, మార్జిన్ ఆధారిత ఫైనాన్సింగ్‌కి సంబంధించి రూ. 17,500 కోట్లు తిరిగి చెల్లించేశామని, రుణభారాన్ని తగ్గించుకున్నామని, తమ అసెట్ బేస్ రూ. 4.5 లక్షల కోట్లకు చేరిందని చెప్పారు. కార్యకలాపాలపై మరింతగా దృష్టి పెట్టడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్‌లో అత్యధిక స్థాయి త్రైమాసిక లాభాలను ఆర్జించామన్నారు. గ్రూప్‌లో భాగమైన లిస్టెడ్ సంస్థల్లో చాలా మటుకు కంపెనీలు, హిండెన్‌బర్గ్ వివాదంతో వాటిల్లిన నష్టాలను భర్తీ చేసుకోగలిగాయని అదానీ పేర్కొన్నారు. తాము మోసానికి, స్టాక్ మార్కెట్లో అవకతవకలకు పాల్పడ్డామన్న హిండెన్‌బర్గ్ నివేదిక అబద్ధాలపుట్ట అని ఆయన ఆక్షేపించారు. తమ ప్రత్యర్థులు ఎప్పటివో పాతబడిన ఆరోపణలకు మళ్లీ తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారన్నారు. "చచ్చు ఆరోపణలు, బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారం నుంచి సేకరించిన అర్ధ సత్యాలను ఎంపిక చేసుకుని (హిండెన్‌బర్గ్) అబద్ధాల పుట్టను 'పరిశోధన నివేదిక'గా వండి వడ్డించింది. మా స్పందనను తెలియజేశాక నేను దాని గురించి ఇక పట్టించుకోలేదు. కానీ (ఆ తర్వాత పరిణామాలతో) సత్యం చెప్పుల్లో కాళ్లు పెట్టే లోపలే అబద్ధం లోకాన్ని చుట్టి వస్తుందనే విలువైన పాఠాన్ని ఈ ఉదంతంతో తెలుసుకున్నాను. మాపై ఆర్థికంగాను, రాజకీయ కోణంలోనూ దాడి జరిగింది. మా వ్యాపార పటిష్టతపై మాకు ఉన్న విశ్వాసమే వ్యూహంగా వాటిని ఎదుర్కొన్నాం" అని అదానీ పేర్కొన్నారు.

**చిన్న ఇన్వెస్టర్లు నష్టపోవడం బాధించింది..**


"సాధారణంగా క్యాపిటల్ మార్కెట్లు హేతుబద్ధంగా కన్నా ఎక్కువగా భావోద్వేగాలతో పని చేస్తాయి. మాపై వచ్చిన తీవ్ర స్థాయి అబద్ధాలు మార్కెట్ క్యాప్‌ను గణనీయంగా హరించేశాయి. అన్నింటి కన్నా ఎక్కువగా వేల మంది చిన్న ఇన్వెస్టర్లు తాము దాచుకున్న సొమ్మును పోగొట్టుకోవడం నన్ను ఎంతో బాధించింది. విరోధుల ప్రణాళికలు పూర్తిగా విజయవంతమై ఉంటే దాని ప్రభావం.. పోర్టులు, విమానాశ్రయాలు, విద్యుత్ సరఫరా వ్యవస్థ వరకు ఎన్నో కీలక మౌలికసదుపాయాలను దెబ్బతీసేది. ఏ దేశానికైనా ఇది పెను విపత్తే" అని అదానీ తెలిపారు. గతేడాది ప్రారంభంలో ప్రపంచంలోనే 2వ అత్యంత సంపన్నుడిగా వెలిగిన అదానీ.. హిండెన్‌బర్గ్ నివేదిక పరిణామాలతో ఒక దశలో టాప్ 20 జాబితాలో కూడా చోటు కోల్పోయారు. ప్రస్తుతం 14వ స్థానంలో ఉన్నారు.

## ఇన్వెస్టర్లు షం'షేర్'..!

### గతేడాది భారీగా నమోదు

దేశవ్యాప్తంగా ప్రజలు ఉత్సాహంగా ఈక్విటీ పెట్టుబడుల వైపు అడుగులు వేస్తున్నారు. మార్కెట్ల ర్యాలీ కూడా వారిని ఆకర్షిస్తోంది. ఇందుకు నిదర్శనంగా బీఎస్ఈలో రిజిస్టర్డ్ ఇన్వెస్టర్ల సంఖ్య 2023లో 27 శాతం పెరిగి 3.3 కోట్లకు చేరింది. ముఖ్యంగా బిహార్‌లో 42 శాతం, యూపీలో 41 శాతం మేర కొత్త ఇన్వెస్టర్లలో వృద్ధి కనిపించింది. గతేడాది సెన్సెక్స్ 19 శాతం, నిఫ్టీ 50 సూచీలు 20 శాతం మేర ర్యాలీ చేశాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఇంతకంటే అధిక రాబడిని ఇచ్చాయి. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడిని సర్దుబాటు చేసుకునే స్థాయిలో దేశీ పెట్టుబడులు పెరుగుతుండడం గమనార్హం. ఆధార్, పాన్‌తో సులభంగా కొత్త ఖాతాల ప్రారంభం, మొబైల్ నుంచే లావాదేవీలకు వీలుగా ట్రేడింగ్ అప్లికేషన్లు, యూపీఐ తదితర సాధనాలతో సులభ చెల్లింపులు ఈ జోరుకు మద్దతునిస్తున్నాయి. గతేడాది డీమ్యాట్ ఖాతాలు సైతం 43 శాతం పెరిగి 11.45 కోట్లకు చేరాయి. అయినా ఇప్పటికీ దేశ జనాభా 140 కోట్లలో ఆర్థిక సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తున్న వారు కేవలం 8 శాతంగానే ఉండడాన్ని గమనించాలి.

ఏపీ నుంచి 61.8లక్షల మంది, తెలంగాణ నుంచి 47.1 లక్షల మంది ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు.




## ఐటీ, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు

- 21,400 స్థాయి దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్‌కు 360 పాయింట్ల నష్టం
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు



**మార్కెట్లు సెలవు**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ఎక్స్ఛేంజీలు పనిచేయవు. కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు.

**ముంబై:** ఫైనాన్స్, ఐటీ, ఫార్మా, ఎఫ్ఎంసీజీ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు గురువారం అర శాతం నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 360 పాయింట్లు నష్టపోయి 70,701 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 102 పాయింట్లు పతనమై 21,353 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాల ప్రభావంతో సూచీలు ఉదయం స్తబ్దుగా మొదలయ్యాయి. జనవరి ఎఫ్అండ్ఓ కాంట్రాక్టు ముగింపు సందర్భంగా ట్రేడర్లు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలు పాల్పడ్డారు. ఒక దశలో సెన్సెక్స్ 741 పాయింట్లు క్షీణించి 70,319 వద్ద, నిఫ్టీ 207 పాయింట్లు పతనమై 21,247 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. అయితే ట్రేడింగ్ చివర్లో మెటల్, సర్వీసెస్, పవర్, వినిమయ ఆటో, మీడియా షేర్లకు అనూహ్యంగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు సగానికిపైగా నష్టాలు భర్తీ చేసుకున్నాయి. అమెరికా పటిష్ట ఆర్థిక డేటా వెల్లడితో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల తగ్గింపు వాయిదా ఆందోళనలు మరోసారి తెరపైకి వచ్చాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

**మార్కెట్లో మరిన్ని సంగతులు...**

- డిసెంబర్ క్వార్టర్‌లో నికర లాభం 60% క్షీణించడంతో టెక్ మహీంద్రా షేరు 6% నష్టపోయి రూ.1,322 వద్ద స్థిరపడింది.
- ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో బజాజ్ ఆటో షేరు పరుగులు పెట్టింది. 5% పెరిగి రూ.7,597 వద్ద స్థిరపడింది.
- టెక్ మహీంద్ర పతన ప్రభావంతో. కోఫోర్జ్ 3%, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు 1 నుంచి అరశాతం నష్టపోయాయి.

## వేదాంతా క్యూ3 లాభం క్షీణత

రూ. 2,013 కోట్లకు పరిమితం



**న్యూఢిల్లీ:** ప్రయివేట్ రంగ మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 18 శాతం క్షీణించి రూ. 2,013 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,464 కోట్లు ఆర్జించింది. ఫైనాన్స్, ముడి సరుకుల వ్యయాలు పెరగడం, అమ్మకాలు నీరసించడం ప్రభావం చూపాయి. అయితే మొత్తం ఆదాయం రూ. 34,818 కోట్ల నుంచి రూ. 36,320 కోట్లకు ఎగసింది. ఫైనాన్స్ వ్యయాలు 54 శాతం పెరిగి రూ. 2,417 కోట్లను తాకాయి. కాగా.. త్రైమాసికవారీగా ఈ క్యూ3 అత్యుత్తమమని కంపెనీ సీఎఫ్‌వో అజయ్ గోయెల్ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేరు 0.4 శాతం బలపడి రూ. 264 వద్ద ముగిసింది.

## పీఎన్‌బీ లాభం రూ. 2,223 కోట్లు



**ముంబై:** ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం మూడు రెట్లు పైగా దూసుకెళ్లి రూ.2,223 కోట్లను తాకింది. గత 15 క్వార్టర్లలో ఇది అత్యధికం కాగా.. ఇందుకు అధిక వడ్డీ ఆదాయం, మెరుగుపడిన రుణ నాణ్యత సహకరించాయి. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 629 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 25,722 కోట్ల నుంచి రూ. 29,962 కోట్లకు జంప్ చేసింది. నికర వడ్డీ ఆదాయం 12 శాతం ఎగసి రూ. 10,293 కోట్లకు చేరింది. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 9.76 శాతం నుంచి 6.24 శాతానికి, నికర ఎన్‌పీఏలు సైతం 3.3 శాతం నుంచి 0.96 శాతానికి భారీగా దిగివచ్చాయి. నికర వడ్డీ మార్జిన్లు 3 శాతం నుంచి 3.11 శాతానికి మెరుగయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ షేరు బీఎస్ఈలో 2.5 శాతం బలపడి రూ. 105 వద్ద ముగిసింది.

# సాక్షి స్పోర్ట్స్



### క్వార్టర్ ఫైనల్లో భారత్

మహిళల హాకీ ఫైవ్స్ ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. మస్కట్‌లో నమీబియాతో జరిగిన గ్రూప్ 'సి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 7–2తో గెలిచింది. . నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి రజని భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తోంది.



### కిరణ్ జార్జి సంచలనం

ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ప్లేయర్, ప్రపంచ 36వ ర్యాంకర్ కిరణ్ జార్జి ప్రిక్వార్టర్ ఫైనల్లో 21–11, 13–21, 21–18తో ప్రపంచ 18వ ర్యాంకర్ లు గ్వాంగ్ జు (చైనా)ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. భారత్‌కే చెందిన లక్ష్య సేన్, ప్రియాన్శు ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు.

## భారత్ 'స్పిన్ బాల్'... ఆపై జైస్వాల్...

- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 246 ఆలౌట్
- ఆదుకున్న బెన్ స్టోక్స్
- భారత్ 119/1
- యశస్వి జైస్వాల్ అర్ధసెంచరీ

'బజ్‌బాల్'... దూకుడైన ఆటకు మారుపేరు అంటూ ఇంగ్లండ్ జట్టు గత కొంత కాలంగా ప్రచారం చేసింది. అయితే భారత్‌లో ఇది సాధ్యమా అనే సందేహాలు వినిపించాయి. ఇంగ్లండ్ ఆశించినట్లుగా ఆ ధాటి పని చేసింది... అయితే అది తొలి ఎనిమిది ఓవర్ల వరకే... ఆ తర్వాత భారత 'స్పిన్ బాల్' దెబ్బకు లెక్క మారిపోయింది... వరుసగా వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్ చివర్లో స్టోక్స్ ఆదుకోవడంతో కాస్త కోలుకుంది. అక్కడక్కడ ఇంగ్లండ్ కాస్త మెరుగైన స్థితిలోనే నిలిచినా చివరకు సాధారణ స్కోరుకే పరిమితమైంది. ఆపై మన గడ్డపై 'బజ్‌బాల్' ఎలా ఆడాలో భారత ఓపెనర్లు చూపించారు. యశస్వి ధాటికి ఆరంభంలో స్కోరు ఆరుకు పైగా రన్‌రేట్‌తో సాగింది. తొలి రోజే ప్రత్యర్థి స్కోరులో దాదాపు సగం స్కోరును జట్టు అందుకుంది... మొత్తంగా అన్ని విధాలా మొదటి రోజు మనదిగా ముగిసింది.



స్టోక్స్ క్లీన్‌బౌల్డ్



అక్షర్, జడేజా, అశ్విన్, బుమ్రా

**సాక్షి, హైదరాబాద్:** ఇంగ్లండ్‌తో గురువారం ప్రారంభమైన తొలి టెస్టులో భారత్ మొదటి రోజు పైచేయిని ప్రదర్శించింది. టాస్ ఓడిపోవడం మినహా దాదాపు మిగతా రోజంతా టీమిండియాకే అనుకూలంగా సాగింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 64.3 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బెన్ స్టోక్స్ (88 బంతుల్లో 70; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించగా... బెయిర్‌స్టో (58 బంతుల్లో 37; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. స్పిన్నర్లు అశ్విన్, జడేజా చెరో 3 వికెట్లు పడగొట్టగా...అక్షర్ పటేల్ ఖాతాలో 2 వికెట్లు చేరాయి. పేసర్ బుమ్రాకు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 23 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 119 పరుగులు సాధించింది. యశస్వి జైస్వాల్ (70 బంతుల్లో 76 బ్యాటింగ్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడగా... రోహిత్ శర్మ (27 బంతుల్లో 24; 3 ఫోర్లు) రాణించాడు. ప్రస్తుతం భారత్ మరో 127 పరుగులు వెనుకబడి ఉండగా... క్రీజ్‌లో యశస్వితో పాటు గిల్ (43 బంతుల్లో 14 బ్యాటింగ్; 1 ఫోర్) ఉన్నాడు. నేడు రెండో రోజూ పూర్తిగా బ్యాటింగ్ చేసి టీమిండియా భారీ స్కోరు సాధిస్తే మ్యాచ్ చేతుల్లోకి వచ్చినట్లే.

**ఓపెనర్ల శుభారంభం...**



యశస్వి

బుమ్రా, సిరాజ్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ క్రాలీ (40 బంతుల్లో 20; 3 ఫోర్లు), డకెట్ (39 బంతుల్లో 35; 7 ఫోర్లు) వేగంగా పరుగులు రాబట్టారు. 8 ఓవర్లలో వీరు 41 పరుగులు జత చేశారు. తర్వాతి ఓవర్ జడేజా మెయిడిన్‌గా వేయడంతో దూకుడుకు అడ్డుకట్ట పడింది. అశ్విన్, జడేజా చెలరేగడంతో 5 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయి ఇంగ్లండ్ కష్టాల్లో పడింది. ఈ దశలో రూట్ (60 బంతుల్లో 29; 1 ఫోర్), బెయిర్‌స్టో కలిసి 61 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. అయితే 4 పరుగుల వ్యవధిలో వీరిద్దరు వెనుదిరిగారు. అక్షర్ అద్భుత బంతితో బెయిర్‌స్టోను బౌల్డ్ చేయగా, రూట్ స్వయంకృతంతో వెనుదిరిగాడు. 137/6తో ఇన్నింగ్స్ ముగిసేందుకు ఇంగ్లండ్ చేరువైంది. అయితే స్టోక్స్ తన విలువను చూపించాడు. ఈ స్థితిలో స్టోక్స్ స్కోరు 8 పరుగులు మాత్రమే. కానీ టెయిలెండర్ల సహాయంతో అతను చెలరేగిపోయాడు. జట్టు సాధించిన తర్వాతి 109 పరుగుల్లో 62 అతని బ్యాట్ నుంచే రాగా... హార్లీ (24 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) తన కెప్టెన్‌కు అండగా నిలిచాడు. జడేజా ఓవర్లో స్టోక్స్ వరుస బంతుల్లో కొట్టిన రెండు సిక్సర్లు, అతని ఓవర్లోనే బాదిన మూడు ఫోర్లు హైలైట్‌గా నిలిచాయి. చివరకు చక్కటి బంతితో స్టోక్స్ ఆటను బుమ్రా కట్టించాడు. తొలి రెండు సెషన్లలో వందకు పైగా పరుగులు సాధించి ఇంగ్లండ్ మెరుగ్గానే ఆడినా... చివరకు వచ్చేసరికి ఆ జట్టు ఆశించిన భారీ స్కోరు మాత్రం సాధ్యం కాలేదు.

**మెరుపు ఆరంభం...**

వుడ్స్ వేసిన ఇన్నింగ్స్ తొలి బంతినే ఫోర్‌తో మొదలు పెట్టిన యశస్వి, అరంగేట్ర బౌలర్ హార్లీ తొలి టెస్టు బంతిని సిక్సర్ బాది స్వాగతం పలికాడు. మరోవైపు రోహిత్ అండగా నిలవడంతో 6.3 ఓవర్లలోనే టీమిండియా స్కోరు 50 పరుగులకు చేరింది. అనంతరం 47 బంతుల్లోనే యశస్వి అర్ధ సెంచరీ పూర్తయింది. అయితే జట్టుకు అంతా అనుకూలంగా ఉండి టెస్టులో ఇంకా ఎంతో సమయం మిగిలి ఉన్నా... అనవసరంగా అత్యుత్సాహానికి పోయి చెత్త షాట్ ఆడిన రోహిత్ వికెట్ పారేసుకున్నాడు. అనంతరం గిల్ బాగా జాగ్రత్త ప్రదర్శించడంతో వేగం తగ్గింది. అయినా చివరకు 5.17 రన్‌రేట్‌తో భారత్ రోజును ముగించింది.

### స్కోరు వివరాలు

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలీ (సి) సిరాజ్ (బి) అశ్విన్ 20; డకెట్ (ఎల్బీ) (బి) అశ్విన్ 35; పోప్ (సి) రోహిత్ (బి) జడేజా 1; రూట్ (సి) బుమ్రా (బి) జడేజా 29; బెయిర్‌స్టో (బి) అక్షర్ 37; స్టోక్స్ (బి) బుమ్రా 70; ఫోక్స్ (సి) భరత్ (బి) అక్షర్ 4; రేహాన్ (సి) భరత్ (బి) బుమ్రా 13; హార్లీ (బి) జడేజా 23; వుడ్ (బి) అశ్విన్ 11; లీచ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం** (64.3 ఓవర్లలో ఆలౌట్) 246. **వికెట్ల పతనం:** 1–55, 2–58, 3–60, 4–121, 5–125, 6–137, 7–155, 8–193, 9–234, 10–246. **బౌలింగ్:** బుమ్రా 8.3–1–28–2, సిరాజ్ 4–0–28–0, జడేజా 18–4–88–3, అశ్విన్ 21–1–68–3, అక్షర్ 13–1–33–2. **భారత్ తొలి ఇన్నింగ్స్:** యశస్వి (బ్యాటింగ్) 76; రోహిత్ (సి) స్టోక్స్ (బి) లీచ్ 24; గిల్ (బ్యాటింగ్) 14; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (23 ఓవర్లలో వికెట్ నష్టానికి) 119. **వికెట్ల పతనం** : 1–80. **బౌలింగ్:** వుడ్ 2–0–9–0, హార్లీ 9–0–63–0, లీచ్ 9–2–24–1, రేహాన్ 3–0–22–0.

## టైటిల్ పోరుకు బోపన్న జోడీ

ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ

**మెల్‌బోర్న్:** తన కెరీర్‌లో అందని ద్రాక్షగా ఉన్న పురుషుల డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించేందుకు భారత స్టార్ రోహన్ బోపన్నకు మరో అవకాశం లభించింది. గతంలో రెండుసార్లు (2013, 2023) యూఎస్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరి రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకున్న బోపన్న...తాజాగా ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన సెమీ ఫైనల్లో బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6–3, 3–6, 7–6 (10/7)తో టామస్ మెచాక్ (చెక్ రిపబ్లిక్)–జిజెన్ జాంగ్ (చైనా) జోడీపై విజయం సాధించింది. శనివారం జరిగే ఫైనల్లో సిమోన్ బొలెలీ–ఆండ్రియా వవాసోరి (ఇటలీ) ద్వయంతో బోపన్న–ఎబ్డెన్ జంట తలపడుతుంది.



**ఫైనల్లో సబలెంకా, కిన్‌వెన్ జెంగ్**

మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, రెండో సీడ్ సబలెంకా (బెలారస్), 12వ సీడ్ కిన్‌వెన్ జాంగ్ (చైనా) ఫైనల్లోకి ప్రవేశించారు. సెమీఫైనల్స్‌లో సబలెంకా 7–6 (7/2), 6–4తో నాలుగో సీడ్ కోకో గాఫ్ (అమెరికా)పై గెలుపొందగా... కిన్‌వెన్ జాంగ్ 6–4, 6–4తో క్వాలిఫయర్ డయానా యాస్ట్రెమ్‌స్కా (ఉక్రెయిన్)ను ఓడించింది.

## కోహ్లికి నాలుగోసారి...

ఐసీసీ 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు నెగ్గిన భారత స్టార్



**దుబాయ్:** భారత మేటి క్రికెటర్ విరాట్ కోహ్లి 2023 సంవత్సరానికి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం గెల్చుకున్నాడు. గత ఏడాది కోహ్లి 27 వన్డేలు ఆడి 1377 పరుగులు సాధించాడు. ఇందులో ఆరు సెంచరీలు, ఎనిమిది అర్ధ సెంచరీలు ఉన్నాయి. స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో కోహ్లి 11 మ్యాచ్‌ల్లో 765 పరుగులు సాధించి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డు దక్కించుకున్నాడు. వన్డే ఫార్మాట్‌లో ఐసీసీ 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు నెగ్గడం కోహ్లికిది నాలుగోసారి. గతంలో 2012, 2017, 2018లలో కూడా కోహ్లికి ఈ పురస్కారం లభించింది. 2018లో కోహ్లి 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'తో పాటు 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'... 2017లో 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డులు పొందాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు 2023 సంవత్సరానికి 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు ... ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖ్వాజాకు 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు దక్కాయి.



ముషీర్ ఖాన్

## యువభారత్ ఘనవిజయం

ముషీర్ ఖాన్ సెంచరీ • రాణించిన ఉదయ్

**బ్లూమ్‌ఫొంటీన్ (దక్షిణాఫ్రికా):** అండర్–19 వన్డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. ఐర్లాండ్‌తో గురువారం జరిగిన గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 201 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 301 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ముషీర్ ఖాన్ (106 బంతుల్లో 118; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ చేయగా... కెప్టెన్ ఉదయ్ సహారణ్ (84 బంతుల్లో 75; 5 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 156 పరుగులు జోడించారు. 302 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ జట్టు 29.4 ఓవర్లలో 100 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లు నమన్ తివారి (4/53), సౌమీ పాండే (3/19) ఐర్లాండ్‌ను దెబ్బతీశారు. భారత్ తమ చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌ను ఆదివారం అమెరికా జట్టుతో ఆడుతుంది.

## గవర్నర్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ 75వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగం ప్రసాదించిన అమూల్యమైన హక్కులు, విలువలకు కృతజ్ఞతలు తెలుపుదామన్నారు. రాజ్యాంగం ఒక దిక్సూచిగా పనిచేస్తోందని, భావవ్యక్తీకరణ, గౌరవప్రదమైన జీవనం, విద్య, ఉద్యోగాల్లో సమాన అవకాశాలను అందిస్తోందన్నారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి సూత్రాలను అందులో పొందుపరిచారని పేర్కొన్నారు.

## ఏపీ సీఎం జగన్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: రిపబ్లిక్ డే సందర్భంగా ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ గణతంత్ర దినోత్సవం నాడు మన రాజ్యాంగకర్తలను స్మరించుకుంటూ వారి బాటలో నడిచి దేశ అభ్యున్నతికి కృషి చేద్దామని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## మన రాజ్యాంగ స్ఫూర్తి ప్రపంచానికే మార్గదర్శకం

### గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రజాస్వామిక పాలన ద్వారానే రాజ్యాంగం ఆశించిన లక్ష్యాలు అన్ని వర్గాల ప్రజలకు అందుతాయని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వంతో పాటు అందరికీ న్యాయం అందాలనే మన భారత రాజ్యాంగ స్ఫూర్తి ఇప్పటికీ, ఎప్పటికీ ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజున జరుపుకునే ఈ పండుగను ప్రజలందరూ సగర్వంగా జరుపుకోవాలని, రాజ్యాంగ నిర్మాతలను, దేశాన్ని సమున్నతంగా నిలబెట్టిన మహనీయులను గుర్తు చేసుకోవాలని అన్నారు.

# శేషేంద్ర శర్మ రచనల హక్కులన్నీ కుమారుడికే..

### ఇందిర అప్పీల్‌ను కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ కవి గుంటూరు శేషేంద్ర శర్మ గ్రంథ హక్కుల వివాదంలో ఆయన కుమారుడు సాత్యకికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. తండ్రి పుస్తకాలపై హక్కులన్నీ ఆయనకే చెందుతాయని తీర్పునిచ్చింది. తను రాసిన పుస్తకాలు, గ్రంథాలపై హక్కులను కుమారుడైన సాత్యకికి 1989లో శేషేంద్ర శర్మ రాసిచ్చారు. 2007లో శేషేంద్ర శర్మ మృతిచెందారు. అయితే తనను శేషేంద్ర శర్మ వివాహం చేసుకున్నారని, తనకు కూడా ఆ పుస్తకాలపై హక్కులు ఉంటాయంటూ హైదరాబాద్‌కు చెందిన ఇందిరా ధనరాజ్‌గిర్ వివాదానికి తెరలేపారు. అనంతరం ఈ వివాదం సిటీ సివిల్ కోర్టుకు చేరింది. విచారణ జరిపిన న్యాయస్థానం రచనలపై హక్కులన్నీ కుమారుడికే చెందుతాయని తీర్పునిచ్చింది. హక్కులన్నీ ఆమెకు రాసిచ్చినట్లు ఇందిర దాఖలు చేసిన పత్రం నకిలీదని.. శేషేంద్ర శర్మ సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఫోరెన్సిక్ లేబొరేటరీ తేల్చిందని



స్పష్టం చేసింది. సిటీ సివిల్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఇందిర హైకోర్టులో అప్పీల్ చేశారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ జి.రాధాదేవి గురువారం తీర్పు వెలువరించారు. ఇందిర అప్పీల్‌ను కొట్టివేస్తూ, హక్కులన్నీ సాత్యకికే చెందుతాయని స్పష్టం చేశారు.

## లక్ష్మీప్రియకు ప్రధాని మోదీ అభినందనలు

సాక్షి, న్యూఢిల్లీ: హనుమకొండకు చెందిన 10వ తరగతి విద్యార్థిని, కూచిపూడి నృత్య కళాకారిణి లక్ష్మీప్రియను గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ఈ నెల 22న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఆమె 'రాష్ట్రీయ బాల పురస్కార్'అవార్డును అందుకుంది. ఈ మేరకు లక్ష్మీప్రియ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిసింది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.